www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 12 శనివారం | ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 208

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదల

★ జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు

కేటీఆర్ అరెస్టు తప్పదు!

★ బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై టీపీసీసీ అధినేత మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్య

తమిళనాడులో బీజేపీ అన్నాడీఎంకే పొత్తు

★ ప్రకటించిన అమిత్‌షా
★ ఎలాంటి షరతులేకుండానే పొత్తు

2

తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా నైనార్ నాగేంద్రన్

★ నేడో రేపో అధికారికంగా ప్రకటన
★ తేవర్ వర్గానికి ఇవ్వడం ద్వారాలాభం

భగ్గుమన్న బంగారం

★ 96వేలకు దాటిన బంగారం
★ వెండి కిలో రూ.95,500

2

ఇకపై ఏప్రిల్ నుంచే స్కూళ్లు

★ గోవా సర్కార్ నిర్ణయం
★ వేసవిలో స్కూళ్లపై ప్రజలు ఫైర్

2

ఢీ అంటే ఢీ

- అమెరికా చైనా మధ్య ముదురుతున్న వాణిజ్య యుద్ధం
- చైనాపై ఏకంగా 145% కి పెంచిన సుంకాలు
- అమెరికా వస్తువులపై చైనా 125%కి పెంపు
- అమెరికాలో పెరిగిన సుంకాలు 3నెలల తర్వాత అమల్లోకి..
- అమెరికా వస్తువులపై చైనా సుంకాలు తక్షణమే అమలు

2



న్యూయార్కు-నవభూమిబ్యూరో

విదేశాలపై ప్రతీకార సుంకాలతో విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ భారీ షాకిచ్చారు. గతంలో అమెరికా వస్తువులపై సుంకాల్ని 84 శాతానికి పెంచేసిన చైనా.. ఇప్పుడు దాన్ని ఏకంగా 125 శాతానికి పెంచేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. చైనా వస్తువులపై 145 శాతం సుంకాలు విధించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయానికి కౌంటర్ గా చైనా ఈ నిర్ణయం ప్రకటించింది. అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచీ విదేశాలపై ప్రతీకాల పన్నులు విధిస్తున్న ట్రంప్.. తాజాగా చైనా మినహా మిగిలిన దేశాలపై విధించిన సుంకాల అమలును వాయిదా వేశారు. చైనాపై మాత్రం 125 శాతం సుంకాలు అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఇది జరిగిన రెండు రోజుల్లోనే ఏకంగా 145 శాతానికి సుంకాలు పెంచుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. దీంతో చైనాకు మంటపుట్టింది. ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధాన్ని దీటుగా ఎదుర్కోవాలని చైనా నిర్ణయించింది. ఇందులో భాగంగా యూరోపియన్ యూనియన్ ను సైతం కలిసి రావాలని చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ కోరారు. అదే సమయంలో అమెరికా ఉత్పత్తులపై సుంకాల్ని 125 శాతానికి పెంచుతున్నట్లు చైనా ప్రభుత్వం ప్రకటించింది. అంతే కాదు ఈ నిర్ణయం రేపటి నుంచే అమల్లోకి వస్తుందని తెలిపింది. అయితే తమ నిర్ణయం తర్వాత ఇక అమెరికా వస్తువులపై సుంకాల పెంపు ఉండబోదని, ఎందుకంటే ఇంత సుంకాల భారం మోసేందుకు మార్కెట్ సిద్ధంగా లేదని, దాని బదులు ఆయా వస్తువుల్ని దిగుమతి చేసుకోవడం మానేస్తామని వెల్లడించింది.

దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్..

- ట్రంప్ ప్రపంచ దేశాలపై విధించిన టారిఫ్‌లపై 90 రోజుల విరామం
- మదుపుదారుల ఆనందానికి అవధుల్లేకుండా పోవడంతో స్టాక్స్‌పై ఎఫెక్ట్
- వాణిజ్య యుద్ధ మేఘాలు తొలగిపోయి వెల్లువెత్తిన కొనుగోలుదారుల ఉత్సాహం
- ఆసియాలోని ఇతర మార్కెట్లు మిశ్రమ సంకేతాలు..జపాన్ మార్కెట్‌కు నష్టాలు

ముంబై-నవభూమిబ్యూరో

భారతీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో శుక్రవారం ఒక మైలురాయిగా నిలిచిపోయింది. డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై విధించిన టారిఫ్‌లపై ఊహించని విధంగా 90 రోజుల పాటు విరామం ప్రకటించడంతో మదుపుదారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ అనూహ్య ప్రకటనతో వాణిజ్య యుద్ధ మేఘాలు తొలగిపోయి, కొనుగోలుదారుల ఉత్సాహం వెల్లువెత్తింది. అన్ని రంగాల షేర్లు కొనుగోళ్ల వర్షంలో తడిసి ముద్దయ్యాయి. ఫలితంగా ప్రధాన సూచికలు రికార్డు స్థాయిలో లాభాలను మూటగట్టుకున్నాయి. దూసుకెళ్లిన సెన్సెక్స్.. సెన్సెక్స్ ఏకంగా 1300 పాయింట్లు ఎగిసి 75,157.26 వద్ద స్థిరపడగా, నిఫ్టీ సైతం 429.40 పాయింట్లు లాభపడి 22,828.55 వద్ద ముగిసింది. ఈ ఒక్కరోజు ర్యాలీతో మదుపుదారుల సంపద ఊహించని రీతిలో పెరిగింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ. 7.72 లక్షల కోట్లు పెరిగి, రూ. 401.54 లక్షల కోట్లకు చేరుకుంది. ఇది మదుపుదారులకు నిజమైన పండగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. ఆసియాలోని ఇతర మార్కెట్లు మిశ్రమ సంకేతాలను చూపించాయి. జపాన్ మార్కెట్లు నష్టాలను చవిచూడగా, షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు లాభాలతో ముగియడం విశేషం. భారతీయ మార్కెట్లు మాత్రం ఈ ప్రాంతీయ ధోరణిని ధిక్కరించి, తమదైన ముద్ర వేసుకున్నాయి. ట్రంప్ ప్రకటనతో జోష్ ట్రంప్ విరామం ప్రకటన చేసిన మరుసటి రోజే ఈ ర్యాలీ జరగాల్సి ఉన్నప్పటికీ, మహావీర్ జయంతి కారణంగా నిన్న మార్కెట్లకు సెలవు. దీంతో, అంతర్జాతీయ మార్కెట్ల నుండి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ, భారతీయ సూచికలు ఈ ఉదయం లాభాలతోనే ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ దాదాపు వెయ్యి పాయింట్ల లాభంతో 74,835.49 వద్ద ప్రారంభమైంది, ఇంట్రాడేలో 75,467.33 పాయింట్ల వద్ద గరిష్టాన్ని తాకింది. లాభాలతో ముగిసిన స్టాక్స్ సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఏషియన్ పెయింట్స్

తెలంగాణ లోకాయుక్తగా రిటైర్డ్ జడ్జి రాజశేఖర్ రెడ్డి

- ఉప లోకాయుక్తగా జగ్జీవన్ కుమార్ నియామకం
- హెచ్ఆర్సీ చైర్ పర్సన్‌గా షమీమ్ అక్తర్ నియామకం
- నియామక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ లోకాయుక్తగా రిటైర్డ్ జడ్జి ఎ. రాజశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉప లోకాయుక్తగా బీ.ఎస్. జగ్జీవన్ కుమార్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్‌గా షమీమ్ అక్తర్ నియమితులయ్యారు.

గోదావరి-బనకచర్లపై ఏపీ ముందుకు వెళ్లకుండా చూడండి

జీఆర్ఎంబీకి తెలంగాణ లేఖ

హైదరాబాద్-నవభూమిబ్యూరో

గోదావరి - బనకచర్లపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళ్లకుండా చూడాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ)కు లేఖ రాసింది. ఈ మేరకు తెలంగాణ నీటి పారుదల శాఖ ఈఎన్సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్) కార్యాలయం జీఆర్ఎంబీకి లేఖను పంపింది.పోలవరం ప్రాజెక్టు, తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఎలాంటి టెండర్లు చేపట్టకుండా చూడాలని ఆ లేఖలో తెలంగాణ కోరింది.

డేంజర్ బెల్స్!

- కూటమికి తాజా సర్వే హెచ్చరిక..!!
- ఏడాది పూర్తికాకముందే సర్కార్‌పై వ్యతిరేకత
- ఒక ప్రముఖ సర్వే సంస్థ పబ్లిక్ మూడ్ తెలుసుకునే ప్రయత్నం

2

అమరావతి-నవభూమిబ్యూరో

ఏపీలో రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలల కాలం పూర్తి చేసుకుంది. వైసీపీ లక్ష్యంగా కూటమి రాజకీయ వ్యూహాలు అమలు చేస్తోంది. మాజీ సీఎం జగన్ ప్రభుత్వ వ్యతిరేకత ఆధారంగా రాజకీయం చేస్తున్నారు. త్వరలో ప్రజల్లోకి వెళ్లాలని డిసైడ్ అయ్యారు. ఇదే సమయంలో పాలనా - రాజకీయంగా తీసుకున్న నిర్ణయాల పైన కూటమి పార్టీల్లో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. ఇదే సమయంలో పది నెలల్లో కూటమి నుంచి గెలిచిన ఎమ్మెల్యేల పైన ఒక ప్రముఖ సర్వే సంస్థ వెల్లడించిన రిపోర్ట్‌లో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పుడు ఈ రిపోర్ట్ వైరల్ అవుతోంది. సీన్ రివర్స్ ఏపీలో కూటమి ప్రభుత్వం అనూహ్యంగా 164 సీట్లతో ఏర్పాటు అయింది. పది నెలల పాలన పూర్తి చేసింది. వైసీపీ 11 సీట్లకే పరిమితం కావటంతో ఇక ఇప్పట్లో వైసీపీ కోలుకోవటం సాధ్యం కాదనే అభిప్రాయంతో కూటమి నేతలు కనిపిస్తున్నారు. వైసీపీ తమకు వచ్చిన 40 శాతం ఓట్ షేర్ ఉందనే నమ్మకంతో ముందుకు వెళ్తోంది. కాగా, పది నెలల కాలంలో కూటమి నుంచి గెలిచిన 164 మంది ఎమ్మెల్యేల పని తీరు పైన ఒక ప్రముఖ సర్వే సంస్థ పబ్లిక్ మూడ్ తెలుసుకునే ప్రయత్నం

ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో

- వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన
- హైదరాబాద్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీపై దృష్టి పెట్టాలి
- ఆర్ఆర్ఆర్ రహదారి ఉత్తరభాగం భూసేకరణ పూర్తి చేయాలి
- అధికారులకు సూచించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. రీజినల్ రింగ్ రోడ్డు సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, ఆర్ఆర్ఆర్ (పనుల పురోగతిపై ముఖ్య మంత్రి రేవంత్ శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. హైదరాబాద్ - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ అధికారుల సమావేశంలో హైదరాబాద్ - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టి సారించాలని ముఖ్య మంత్రి సూచించారు. రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ నివేదికను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు పంపించాలని

రైతుల ఖాతాల్లో రూ.20 వేలు

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతీ రైతు ఖాతాలో రూ.20 వేలు జమ చేస్తామని కూటమి హామీ
- అమలు దిశగా బడ్జెట్‌లో నిధులు కేటాయింపు

2

అమరావతి-నవభూమిబ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేసారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం అమలు ముహూర్తం ఖరారు చేసారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతీ రైతు ఖాతాలో రూ 20 వేలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం ఈ నెలతో మొదలైన ఆర్థిక సంవత్సరంలో అమలు దిశగా బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఇప్పుడు ఈ పథకం అమల్లో భాగంగా రైతు ఖాతాలో నిధుల జమ గురించి ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చారు. దీంతో పాటుగా తల్లికి వందనం పథకం అమలు గురించీ మరోసారి వెల్లడించారు. తల్లికి వందనం పై ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల అమలు పైన ప్రకటన చేసారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెన్షన్ రూ 4వేలకు పెంచి అమలు చేస్తున్న అంశాన్ని గుర్తు చేసారు. రూ.64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి రూ.10 వేలు, రూ.15 వేలు ఇస్తున్నామని వెల్లడించారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడ్డారంటే డ్వాక్రా సంఘాలే కారణమని, త్వరలో తల్లికి వందనం కింద ఆర్థిక సాయం చేస్తామని పేర్కొన్నారు. వచ్చే నెలలో ఈ పథకం ప్రతీ బడికి వెళ్లే విద్యార్థి తల్లి ఖాతాలో నిధులు జమ చేయనున్నారు. బడ్జెట్‌లో ఈ పథకం కోసం నిధులను కేటాయించారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి పథకం అమలు చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. రైతుల ఖాతాల్లో రూ 20 వేలు అదే సమయంలో ఉద్యోగాల్లో 33, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించామని, జిల్లాల వారీగా బీసీ భవన్లకు శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. తమ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత వెనకబడిన వర్గాల సంక్షేమమే అని చెప్పారు. ఈ ఏడాది

తెలంగాణ ప్రజలకు ఇంటింటికీ ఇంటర్నెట్

- ఇకపై తెలంగాణ నెక్స్ట్ జెన్ టెక్నాలజీ పేరుతో ప్రతి ఇంటికీ ఇంటర్నెట్
- టెలిఫోన్, కంప్యూటర్, స్మార్ట్ టెలివిజన్ సేవలను ఇక ప్రతి ఇంటికి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి
- బేగంపేటలోని సెంటర్ పాయింట్ భవనంలో నూతన తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రారంభించిన మంత్రి

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

ప్రస్తుతం ఇంటర్నెట్ యుగం నడుస్తోంది. ప్రతి ఒక్కరూ ఇంటర్నెట్ కు అలవాటు పడిపోయారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటింటికీ ఇంటర్నెట్ అందించే యోచనలో ఉంది. రానున్న ఆరు నెలల్లో ప్రతి ఇంటికి టీ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు టీ ఫైబర్ ఇకపై తెలంగాణ నెక్స్ట్ జెన్ టెక్నాలజీ పేరుతో ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సేవలు అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. బేగంపేటలోని సెంటర్ పాయింట్ భవనంలో నూతనంగా ఏర్పాటైన తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. 'టీ ఫైబర్ ప్రాజెక్టు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పేరిట నూతన విద్యా విధానానికి శ్రీకారం
- అత్యున్నత ప్రమాణాలతో తొలి ప్రభుత్వ లీప్ పాఠశాలను మంగళగిరిలో ఏర్పాటు
- విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడి

2

అమరావతి-నవభూమిబ్యూరో: లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పేరిట నూతన విద్యా విధానానికి శ్రీకారం చుడుతున్నామని విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో తొలి ప్రభుత్వ లీప్ పాఠశాలను మంగళగిరిలో ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఎన్డీఏ కూటమి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ఓ క్రమపద్ధతిలో నెరవేరుస్తోందని అన్నారు. ఇచ్చిన ప్రతీ హామీ నిలబెట్టుకుంటామని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. మంగళగిరికి మంజూరైన ఆంధ్రప్రదేశ్‌లో తొలి వందపడకల ప్రభుత్వ ఆస్పత్రికి 13వ తేదీన శంకుస్థాపన చేస్తున్నామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉండగానే మంగళగిరి కోసం సొంత ఖర్చులతో 26 సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే... అధికారంలో ఉండగా ఇంకెంత చేయగలనో ఆలోచించాలని అన్నారు. మంగళగిరిలో పోటీ చేయాలని 2019లో తీసుకున్న నిర్ణయం తన

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 హైదరాబాద్ శనివారం 12 ఏప్రిల్ 2025

నిరుద్యోగులకు అదిరిపోయే గుడ్ న్యూస్.. ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం కీలక ప్రకటన

వరంగల్-నవభూమి: తెలంగాణ తెచ్చుకుంది ఉద్యోగాల కోసమేనని మంత్రి సీతక్క తెలిపారు. వరంగల్ ఎంకే నాయుడు కన్వెన్షన్‌లో ఇవాళ(శుక్రవారం) మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మెగా జాబ్‌మేళాను మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన వచ్చిందని అన్నారు. భారీ సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 60వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు. త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఇలాంటి జాబ్‌మేళాను నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని సూచించారు. అవకాశాలు వస్తే వాటిని వదులుకోవద్దని అన్నారు. తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని చెప్పారు. సొంత ఊరు దాటితేనే.. భవిష్యత్తు బంగారం అవుతుందని మంత్రి సీతక్క తెలిపారు. 60 కంపెనీల ద్వారా 11వేల ఉద్యోగాలు కల్పిస్తున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల ముందు తాము చెప్పామని.. అందులో భాగంగానే ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌పై ప్రత్యేక దృష్టి సాధించారని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలపై పదేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 60వేల ఉద్యోగాలు కల్పించామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే కష్టం.. అందుకే ఇలాంటి జాబ్‌మేళాను నిర్వహించామని తెలిపారు. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగం దక్కుతుందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.



యాంకర్ రవి, సుడిగాలి సుధీర్‌పై హిందూ సంఘాల ప్రతినిధులు ఫైర్..

హైదరాబాద్-నవభూమి: బుల్లితెర నటులు యాంకర్ రవి, సుడిగాలి సుధీర్ చేసిన స్కిట్ ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఓ టీవీ షో సందర్భంగా వారు చేసిన స్కిట్?పై హిందూ సంఘాల ప్రతినిధులు భగ్గుమన్నారు. హిందూ దేవుళ్లను అపహాస్యం చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. హిందువుల మనోభావాలను రవి, సుధీర్ దెబ్బ తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హిందూ సంఘం నేత కేవశరెడ్డి.. యాంకర్ రవికి ఫోన్ చేసిన మాట్లాడిన ఆడియో ఇప్పుడు వైరల్?గా మారింది. దేవుడి పేరితో డ్రామాలు చేయడం తగదంటూ రవిని ఆయన హెచ్చరించారు.తమ దేవుళ్లను కించపరుస్తూ స్కిట్‌లు చేయడం ప్రతి ఒక్కరికీ ఫ్యాషన్ అయిపోయిందంటూ మండిపడ్డారు. సాటి హిందువుగా ఉంటూ దేవుళ్లను కించపరచడం ఏంటని ప్రశ్నించారు. తప్పు చేశాననే పశ్చాతాపం కూడా కనిపించడం లేదని యాంకర్?పై కేశవరెడ్డి ఆగ్రహించారు. అయితే స్కిట్?లో భాగంగానే తాము అలా చేశామని, హిందూ దేవుళ్లను తామేక్కడా కించపరచలేదని యాంకర్ రవి తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి సినిమా(బావగారూ బాగున్నారా)కు సంబంధించిన సీన్లనే తాము రిక్రియేట్ చేసినట్లు చెప్పారు.కొత్తగా తాము చేసిందేమీ లేదన్నారు. స్కిట్ సమయంలో అక్కడున్న వారంతా చెప్పులు, షూలు తీసి మరీ చిత్రీకరించామని చెప్పుకొచ్చారు రవి.అయినా కేశవరెడ్డి మాత్రం మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడవద్దంటూ ఘాటుగా హెచ్చరించారు. కాగా, ఒకప్పటి హీరోయిన్ రంభ టీవీ షోకి వచ్చిన సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి, ఆమె నటించిన బావగారూ బాగున్నారా సినిమా సన్నివేశాన్ని బుల్లితెర నటులు ప్రదర్శించారు. సెట్‌లో నందీశ్వరుడిని పెట్టి, కొమ్ముల మధ్యలో నుంచి రంభను చూస్తారు సుడిగాలి సుధీర్. ఇలా చేయడంపై హిందూ సంఘాలు మండిపడుతున్నాయి. మరోవైపు యాంకర్ రవికి కేశవరెడ్డి ఫోన్ చేసిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్?గా మారింది. కాగా, తాను చేసింది తప్పేనని మరోసారి అలాంటి వీడియోలు చేయనంటూ యాంకర్ రవి ఓ వీడియో రిలీజ్ చేశారు.

నయీం కేసులో ఈడీ దర్యాప్తు ముమ్మరం..

హైదరాబాద్-నవభూమి: గ్యాంగ్‌స్టర్ నయీం కేసు లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. నయీంకు సంబంధించిన 35 ఆస్తులు జప్తు చేసేందుకు ఈడి అధికారులు (చర్యలు చేపట్టారు. 35 ఆస్తులను నయీం తన కుటుంబ సభ్యులు, సన్నిహితుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసినట్లు ఈడి గుర్తించింది. అక్రమంగా, బలవంతంగా ఈ ఆస్తులను నయీం తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద రిజిస్టర్ చేసుకున్నట్టు నిర్ధారించారు. 2022 మార్చిలో నయీం ఆస్తులపై ఈడీ అధికారులు మనీ లాండరింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి ఐటీ అధికారులు, సిట్ సమాచారంతో ఈసీఐఆర్ నమోదు చేసింది.ఆస్తులు మొత్తాన్ని నయీం కుటుంబ సభ్యులు హసీనా బేగం, తహీరా బేగం, సలీమా బేగం, అబ్దుల్ సలీం, అహేలాబేగం, సయ్యద్ నిలోఫర్ , ఫిర్దోస్ అంజూమ్, మహమ్మద్ ఆరిఫ్ ,హసీనా కౌసర్ పేర్ల మీద రిజిస్టర్ చేసినట్లు ఈడి గుర్తించింది. వీరి పేర్లను ఈసీఐఆర్ లో నమోదు చేసింది. పలుమార్లు ఈడి సమన్లు పంపిన కూడా నయీం కుటుంబ సభ్యులు స్పందించలేదు. భువనగిరిలో ఉన్న క్రిస్టియన్ గోస్పెల్ మిషన్ సెక్రెటరీ ప్రభాకర్ నయీంపై ఫిర్యాదు చేశారు. నయీ%శీ% కుటుంబ సభ్యులు పేరు మీద అక్రమంగా ఆస్తులను రాయించుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇన్ని కోట్ల ఆస్తులు సంపాదించినా నయీం కుటుంబ సభ్యులు ఐటీ రిటర్న్స్ దాకలు చేయలేదు. దీంతో బినామీ యాక్టు కింద హసీనా బేగం పేరు చేర్చి ఆస్తులను ఈడీ అధికారులు జప్తు చేయనున్నారు. కాగా 2020 మార్చిలో నయీంపై ఈడీ అధికారులు మనీ లాండరింగ్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.కాగా గ్యాంగ్‌స్టర్ నయీం 2016 ఆగస్టులో షాద్‌నగర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన విషయం తెలిసిందే. నయీం మరణించడంతో అతని బాధితులంతా బయటకు వచ్చి ఫిర్యాదులు చేశారు. వాటిని విచారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసింది. విచారణలో దాదాపు 250 కేసులు నమోదు చేశారు. ఇందులో 27 హత్య కేసులతో పాటు అనేక నేరాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. వీటికి సంబంధించి కేసులు నమోదయ్యాయి. ఇప్పటికీ ఆ కేసుల దర్యాప్తు పూర్తి కాలేదు.

పరీక్షలో తక్కువ మార్కులు..చివరకు ప్రాణమే తీసుకున్న యువకుడు

హైదరాబాద్-నవభూమి:మార్కులనే ప్రామాణికంగా చూస్తున్న ప్రస్తుత రోజుల్లో..ఓ విద్యార్థికి పరీక్షలో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపం చెందాడు. ఆ క్రమంలో అతని మనసులో అనేక ప్రశ్నలు, భయాలు మెదిలాయి. ఇంట్లో ఏమంటారు, ఫ్రెండ్స్ ఎలా చూస్తారనే ఆలోచనలు అతన్ని కుంగేలా చేశాయి. ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు అతను ఆత్మహత్యనే శరణ్యంగా భావించాడు. చివరికి, అతని తల్లిదండ్రులకు పుట్టెడు శోకం మిగిల్చి, సమాజానికి ఒక దారుణమైన సందేశాన్ని అందించాడు. ఈ హృదయ విదారక ఘటన హనుమకొండలో చోటుచేసుకుంది.మార్కులు ముఖ్యమా..ఇక వివరాల్లోకి వెళితే..రితిక్ సాయి అనే యువకుడు వరంగల్ రెండో సంవత్సరం %దీవష్ఠ% చదువుతున్నాడు. నిట్ అంటేనే పెద్ద కాలేజ్. విద్యార్థులు కూడా వారి జీవితంలో పెద్ద లక్ష్యాలను సాధించాలని చూస్తారు. అదే సమయంలో వారి తల్లిదండ్రులు కూడా వారిపై బోలేడు ఆశలు పెట్టుకుంటారు. ఆ క్రమంలోనే ఇటీవల పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని రిత్విక్ మనస్తాపం చెందాడు. అంతటితో ఆగలేదు. ఈ విషయం తన తల్లిదండ్రులు, స్నేహితులకు తెలిస్తే ఎలా అని ఆందోళన చెందిన విద్యార్థి..చివరకు హనుమకొండ వడ్డేపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ప్రస్తుతం మనకు మార్కుల ప్రాముఖ్యత కంటే ఎక్కువగా విద్యార్థుల మనసు ఆరోగ్యం ఎంత ముఖ్యమో గుర్తు చేస్తుంది.అసలు కారణం ఇదేనా..ఈ విషయం తెలిసిన పలువురు మాత్రం మార్కులు తక్కువ వస్తే ఆత్మహత్య ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇది తప్పని చాలా మంది చెబుతున్నారు. కానీ నిజానికి సాయితో ఉన్న వారు మార్కులు తక్కువ వచ్చినా కూడా ఏం కాదని అతనితో మట్లాడి ఆందోళన లేకుండా చేస్తే, ఇంత దూరం వచ్చేది కాదని అంటున్నారు. విద్యార్థులు ఆందోళన లేదా ఒత్తిడిగా ఉన్న క్షణాల్లో వారికి ఉపశమనం కలిగించే విషయాలు చెప్పాలని నిపుణులు అంటున్నారు. దీంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా మార్కుల పేరుతో వారిపై ఒత్తిడి తీసుకురావద్దని సూచిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో మార్కులు రాకుంటే వెస్ట్ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనల నేపథ్యంలో తల్లిదండ్రుల ధోరణి కూడా మారాలని నిపుణులు చెబుతున్నారు.

కొత్త హంగులతో.. ఎయిర్‌పోర్ట్ మాదిరిగా మారిన కరీంనగర్ రైల్వేస్టేషన్..

హైదరాబాద్-నవభూమి:తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత్ భారత్ స్టేషన్ పథకం శరవేగంగా పురోగమిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్రంలోని పలు ముఖ్యమైన రైల్వే స్టేషన్లను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా.. కరీంనగర్ రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. విమానాశ్రయ తరహాలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. ఈ స్టేషన్ అభివృద్ధికి రూ.26.6 కోట్లు అంచనా వేశారు.ఈ నేపథ్యంలో.. ఒక నెటిజన్ సోషల్ మీడియా వేదికగా కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధిపై ఒక పోస్ట్ పెట్టాడు. ఆ పోస్ట్ వైరల్ అయింది. ఆ పోస్ట్‌లోజజ కరీంనగర్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి మరియు తెలంగాణ అభివృద్ధికి కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న అవిశ్రాంత కృషి, అంకితభావం నిజంగా ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇది కరీంనగర్ ప్రజలకు గర్వకారణమైన క్షణమని, అంతేకాకుండా కనెక్టివిటీలో ఒక పెద్ద ముందడుగు అని కొనియాడారు. ఈ అభివృద్ధికి సహకరించినందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ ఓ వీడియోను షేర్ చేశారు

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద.. ఎంపిక చేసిన రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల కోసం అనేక నూతన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా విశాలమైన వెయిటింగ్ హాల్స్, ఆధునిక టాయిలెట్లు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ప్రకాశవంతమైన లైటింగ్, మెరుగైన ప్లాట్‌ఫారమ్‌లు, ప్రయాణికుల సమాచార వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో కూడా ఈ సౌకర్యాలన్నీ అందుబాటులోకి రానున్నాయి. ఈ అభివృద్ధి వల్ల

బంగారం ధరలు భగభగలు.. సామాన్యుడికి చుక్కలు!

చెన్నై-నవభూమి:పసిడి ప్రియులకు, మధ్యతరగతి కుటుంబాలకు ఇది నిజంగా పిడుగుపాటు లాంటి వార్త! బంగారం ధరలు అదుపు తప్పి ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. వరుసగా రెండో రోజూ పసిడి ధరలు భారీగా పెరిగి, సామాన్యులకు షాక్ మీద షాక్ తగిలింది. తగ్గేటప్పుడు పదుల్లో తగ్గి పెరిగే టప్పుడు మాత్రం వందల్లో పెరుగుతుంది. నాలుగు రోజుల పాటు ఊగిసలాటలో ఉన్న ధరలు, రెండు రోజుల నుంచి ఒక్కసారిగా భగ్గుమనడంతో ఏం జరుగుతుందో అర్థం కాక వినియోగదారులు అయోమయంలో పడిపోయారు. కారణాలేంటి? ఎందుకీ భగభగ? అంతర్జాతీయంగా మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిణామాలు బంగారం ధరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల్లో పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భాగిస్తుండటం ఒక ప్రధాన కారణం.

తెలంగాణ రైతులకు శుభవార్త.. అకౌంట్లోకి రూ.10 వేలు..?

హైదరాబాద్-నవభూమి:తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 23,364 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా వెల్లడించారు. గడిచిన నెలలో కురిసిన వర్షాలకు 8,408 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.ఈ నష్టపోయిన రైతులకు త్వరలోనే నష్టపరిహారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అంతేకాకుండా.. ఏప్రిల్ 3వ తేదీ నుండి ఏప్రిల్ 9వ తేదీ వరకు కురిసిన వర్షాలకు మరో 14,956 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశారు. ఈ మేరకు పూర్తి నివేదికలు అందిన వెంటనే ఈ రైతులకు కూడా పంట నష్టపరిహారం అందజేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం రైతుల పట్ల ఎల్లప్పుడూ సానుకూలంగా ఉంటుందని.. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించడానికి సిద్ధంగా ఉంటుందని మంత్రి తెలిపారు. గతంలో కూడా రాష్ట్రంలో అకాల వర్షాలు లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం అందజేసింది. గత సంవత్సరం అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఎకరాకు రూ. 10,000 చొప్పున పరిహారం అందించింది. ఈ చర్య ద్వారా వేలాది మంది రైతులకు ఆర్థికంగా కొంత ఊరట లభించింది. ఈసారి కూడా అదే తరహాలో నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందజేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఎకరాకు రూ.20 వేలు డిమాండ్..

గురువారం కురిసిన వర్షాలు, వడగళ్ల వాన కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరానికి రూ.20,000 పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి టి హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన నియోజకవర్గంలో పంటలు దెబ్బతిన్నాయని తెలుసుకున్న హరీష్ రావు వ్యవసాయ, ఉద్యానవన అధికారులతో మాట్లాడి రైతులకు వర్షం వల్ల ఎంత నష్టం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. పరిహారం కోసం ఒత్తిడి తెచ్చేందుకు గణన నిర్వహించాలని ఆయన అధికారులను సూచించారు. చిన్న కోడూరు, నంగనూరు మండలాల్లోని కొంతమంది రైతులతో కూడా మాట్లాడి నష్టం గురించి ఆరా తీశారు. ఆయన రైతులను ఓదార్చి.. ప్రభుత్వం పంట నష్టాన్ని భర్తీ చేయించేందుకు పాటుపడతానని వారికి హామీ ఇచ్చారు.

దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్..

(1వపేజీ తరువాయి)షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ , రిలయన్స్ వంటి బ్లూ-చిప్ స్టాక్‌లు అద్భుతమైన పనితీరును కనబరిచాయి. ఫార్మా మరియు మెటల్ స్టాక్‌లు ప్రత్యేకించి దూకుడుగా రాణించాయి. నిఫ్టీ మెటల్ ఇండెక్స్ (4 శాతం), నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ (3 శాతం)తో పాటు నిఫ్టీ ఆటో, హెల్త్‌కేర్, ఫైనాన్షియల్, ఐటీ వంటి అన్ని రంగాల షేర్లు రాణించడం మార్కెట్లకు మరింత ఊపునిచ్చింది. అటు అంతర్జాతీయ మార్కెట్లలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 63.65 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం ధరలు మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయి. ఔన్సు బంగారం ధర 3248 డాలర్లకు చేరుకుంది. భారత్‌తో సహా 75 దేశాలపై విధించిన టారిఫ్‌లను 90 రోజుల పాటు నిలుపుదల చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం భారత మార్కెట్లకు ఊరటనిచ్చింది. వాణిజ్య యుద్ధ భయాలు తొలగిపోవడంతో మార్కెట్లకు కొత్త ఉత్సాహం వచ్చింది. అటు డాలర్ విలువ క్షీణించడం కూడా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు సానుకూలంగా మారింది. డాలర్ ఇండెక్స్ తాజాగా 100 దిగువకు చేరింది. బంగారం ధరలు భగభగలు.. సామాన్యుడికి చుక్కలు! డాలర్ బలహీనత: డాలర్ విలువ క్షీణించడం కూడా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు సానుకూలంగా మారింది. డాలర్ ఇండెక్స్ తాజాగా 100 దిగువకు చేరింది. రంగాల వారీగా కొనుగోళ్లు: నిఫ్టీ మెటల్ ఇండెక్స్ (4 శాతం), నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ (3 శాతం)తో పాటు నిఫ్టీ ఆటో, హెల్త్‌కేర్, ఫైనాన్షియల్, ఐటీ వంటి అన్ని రంగాల షేర్లు రాణించడం మార్కెట్లకు మరింత ఊపునిచ్చింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర 63 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దిగుమతులపై ఆధారపడే మన దేశానికి ఇది చాలా సానుకూల అంశమని నిపుణులు చెబుతున్నారు . ఈ ఉత్సాహం రాబోయే రోజుల్లో కూడా కొనసాగుతుందని మార్కెట్ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

డేంజర్ బెల్స్!

(1వపేజీ తరువాయి)చేసింది. ఈ సర్వే ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పది నెలల కాలం లోనే కూటమి నుంచి 71 మంది ఎమ్మెల్యేల పైన వారి నియోజకవర్గాల్లో 30 శాతం కంటే తక్కువ ఆమోదం కనిపిస్తోందని నియోజకవర్గాలను వెల్లడించింది. ప్రజల్లో వ్యతిరేకత కూటమి పార్టీలకు చెందిన 71 మంది పైన పది నెలల కాలంలో ఈ స్థాయిలో వ్యతిరేకత రావటాని కి కారణాలను సర్వే సంస్థ వెల్లడిం చింది. ఇదే సర్వే సంస్థ 2019 లో వైసీపీకి 148 స్థానాలు వస్తా యని అంచనా వేయగా.. 151 సీట్లు జగన్ పార్టీ నాడు దక్కించుకుంది. 71 మంది కూటమి ఎమ్మెల్యేలపై ప్రజా వ్యతిరేకత ఉందని సర్వేలో తేల్చి చెప్పారు. కూటమి ప్రభుత్వం పరిస్థితి చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో జోక్యం చేసుకోవటం.. వారే సొంతంగా నిర్వహించటం పైన పెద్ద స్థాయిలో ఫిర్యాదులు ఉన్నట్లు వెల్లడించింది. దీంతో పాటుగా లిక్కర్, సెటిల్మెంట్స్, మైనింగ్.. ప్రతీ విషయంలో లంచాలు.. కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేయటం వంటికి వ్యతిరేకతకు ప్రధాన కారణంగా సర్వేలో విశ్లేషించారు. డేంజర్ బెల్స్ పలువురు ఎమ్మెల్యేలు వ్యాపారుల నుంచి వసూల్లతో పాటుగా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి లంచా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అదే విధంగా పార్టీ కేడర్ తో దూరం గా ఉండటం తో పాటుగా గెలిచిన తరువాత పట్టించుకోవటం లేదనే కారణంగా వారితో కార్యకర్తలు దూరంగా ఉంటున్నారని చెప్పుకొచ్చారు. జగన్ పాలన తిరస్కరించి.. కూటమికి పట్టం కట్టిన పది నెలల కాలంలోనే ఈ స్థాయి లో వ్యతిరేకత కనిపించటం కూటమికి డేంజర్ బెల్స్ గా భావించాలని సూచిస్తున్నారు.

అటు జగన్ పదే పదే ప్రభుత్వం పైన భారీగా వ్యతిరేకత ఉందని చెప్పుకొస్తున్నారు. సంక్షేమ పథకాల అమలు విషయంలోనూ గ్రామీణ ప్రజల్లో ఎక్కువగా చర్చ సాగుతోంది. మరి..ఈ పరిస్థితిని సీఎం చంద్రబాబు.. పవన్ ఏ విధంగా సరి దిద్దుకుంటారు.. రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది ఆసక్తి కరంగా మారుతోంది.

ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో

(1వపేజీ తరువాయి)ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి రేవంత్ ఆరా తీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయని, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అంగీకరించడం లేదని అధికారులు వివరించారు. పంట కాలం దాదాపు పూర్తవుతున్నందున ఆ వెంటనే రైతులతో మాట్లాడి భూ సేకరణ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. భూ సేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడాలని, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి సూచించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, ఆర్‌ఆర్‌ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో మరోవైపు, హైదరాబాద్ మెట్రో విస్తరణపైనా సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోను విస్తరించాలని ఆదేశించారు. ఇందు కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

రైతుల ఖాతాల్లో రూ.20 వేలు

(1వపేజీ తరువాయి)లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యమని, రైతులకు అండగా ఉంటామని, వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తామని అన్నారు. మే నెల నుంచి రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమల్లో భాగంగా నిధులు జమ చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే ఈ పథకాన్ని కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ తో కలిపి కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

(1వపేజీ తరువాయి)జీవితాన్నే మార్చేసిందని చెప్పారు. మంగళగిరిలో నాల్గో రోజు 'మన ఇల్లు-మన లోకేష్' కార్యక్రమం చేపట్టారు. పేదలకు మంత్రి నారా లోకేష్ శాశ్వత ఇంటి పట్టాలు అందజేస్తున్నారు. రత్నాల చెరువుకు చెందిన 600 మందికి, తాడేపల్లిలోని మహానాడు ప్రాంతానికి చెందిన 430 మంది పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 1030 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలను మంత్రి నారా లోకేష్ పంపిణీ చేశారు.

తెలంగాణ లోకాయుక్తగా రిటైర్డ్ జడ్జి రాజశేఖర్ రెడ్డి

(1వపేజీ తరువాయి)మానవ హక్కుల కమిషన్ సభ్యులుగా శివాడి ప్రవీణ, బి. కిశోర్‌లను ప్రభుత్వం నియమించింది. దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న మానవ హక్కుల కమిషన్ చైర్మన్, లోకాయుక్త, ఉపలోకాయుక్త పోస్టుల భర్తీ కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 5వ తేదీన సచివాలయంలో సమావేశమైన సెలక్షన్ కమిటీ అభ్యర్థుల జాబితాను పరిశీలించి వీరి పేర్లను ఖరారు చేసింది.

తమిళనాడులో బీజేపీ అన్నాడీఎంకే పొత్తు

చెన్నై-నవభూమి:తమిళనాడులో అన్నాడీఎంకే, బీజేపీ పొత్తు ఖరారు అయింది. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేయనున్నాయి. ఈ మేరకు కేంద్ర మంత్రి అమిత్ షా అధికారిక ప్రకటన చేశారు. పళనిస్వామి నాయకత్వంలోనే అన్నాడీఎంకే ఎన్నికలకు వెళుతుందని ఆయన స్పష్టం చేశారు.అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో కలిసి చెన్నైలో అమిత్ షా విలేకరుల సమావేశం నిర్వహించారు. 1998లో అప్పటి ముఖ్యమంత్రి జయలలిత నేతృత్వంలో బీజేపీ, అన్నాడీఎంకే కూటమిగా ఏర్పడి లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన విషయాన్నిఆయన గుర్తు చేశారు.ఈ పొత్తు కోసం అన్నాడీఎంకే ఎలాంటి షరతులు, డిమాండ్లు పెట్టలేదని అమిత్ షా తెలిపారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో బీజేపీ జోక్యం చేసుకోదని స్పష్టం చేశారు. ఈ పొత్తు రెండు పార్టీలకు లాభదాయకమని ఆయన అభిప్రాయపడ్డారు. సీట్ల కేటాయింపు వంటి అంశాలను త్వరలో నిర్ణయిస్తామని వెల్లడించారు.

తెలంగాణ టెట్ 2025 షెడ్యూల్ విడుదల

హైదరాబాద్-నవభూమి: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 15 నుంచి 30 వరకు టెట్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ శుక్రవారం వెల్లడించింది. జూన్ 15 నుం

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్
శనివారం
12 ఏప్రిల్ 2025

మహిళ, ఆమె కుమార్తెను దారుణంగా కొట్టిన ఇద్దరు.. తర్వాత ఏం జరిగిందంటే?

అహ్మదాబాద్-నవభూమి: కూరగాయలు దొంగిలించారన్న ఆరోపణలతో ఒక మహిళ, ఆమె కుమార్తె పట్ల ఇద్దరు వ్యక్తులు దారుణంగా ప్రవర్తించారు. వారి జుట్టుపట్టుకుని ఈడ్చి కడుపులో తన్నడంతోపాటు కర్రలతో కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి లాఠీలతో కుళ్లబొడిచారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గుజరాత్‌లోని సూరత్‌లో ఈ సంఘటన జరిగింది. ఏప్రిల్ 10న

సూరత్‌లోని మార్కెట్‌లో ఒక మహిళ, ఆమె కుమార్తె కూరగాయలు దొంగిలించినట్లు కొందరు వ్యక్తులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు దారుణంగా ప్రవర్తించారు. మహిళల జుట్లు పట్టుకుని ఈడ్చారు. వారి కడుపులో తన్నారు. ఆ మహిళలను కర్రలతో దారుణంగా కొట్టారు. అక్కడున్న వారు చోద్యం చూశారు. ఎవరూ కూడా వారిని రక్షించేందుకు ప్రయత్నించలేదు. కాగా, ఈ విషయం పోలీసులకు తెలిసింది. దీంతో తల్లీకుమార్తెలను దారుణంగా కొట్టిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారిద్దరిని లాఠీలతో కుళ్లబొడిచారు. గాయాలతో కుంటుతున్న నిందితులను మీడియాకు చూపించారు. సూరత్ పోలీసులు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

అది కాళరాత్రి.. 26/11 దాడిలో ప్రాణాలకు తెగించి 20 మంది గర్భిణీలను కాపాడిన నర్సు

ముంబై- నవభూమి: ముంబయి 26/11 దాడుల కుట్రదారు తహవూర్ రాణాను భారత్‌కు అప్పగించడంపై బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముష్కరుల బీభత్సాన్ని ప్రత్యక్షంగా చూసినవారు ఆ పీడకల తమ కళ్లముందు ఇంకా కదలాడుతోందని చెబుతున్నారు. ఇక, తమ ప్రాణాలకు పలువుర్ని కాపాడిన కొందరు ఆ సమయంలో తాము ఎదుర్కొన్న ఒత్తిడిని నెమరువేసుకుంటున్నారు. అలాంటివారిలో ముంబయి కామా ఆసుపత్రిలో పనిచేసే నర్సు అంజలి కుల్తే ఒకరు. తమ ఆసుపత్రిలోని 20 మంది గర్భిణీ స్త్రీలను ఉగ్రదాడి నుంచి రక్షించడమే కాదు... అధిక రక్తపోటుతో బాధపడుతున్న ఓ గర్భిణికి సురక్షితమైన ప్రసవం జరిగేలా చూశారు. తాజాగా అంజలి కుల్తే ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. నవంబర్ 26న రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఛత్రపతి శివాజీ టెర్మినస్ స్టేషన్‌పై దాడి చేస్తున్న ఉగ్రవాదులు.. కామా ఆసుపత్రి వైపు కదులుతున్నారని తమకు సమాచారం అందిందని తెలిపారు. కొద్ది నిమిషాల తర్వాత ఆసుపత్రి వెనుక ఉన్న సందులో కాల్పుల శబ్దం విన్నామని చెప్పారు. 'కిటికీలో నుంచి చూస్తే, ఇద్దరు ఉగ్రవాదులు పరిగెత్తుకుంటూ రావడం.. పోలీసులు వారిపై కాల్పులు జరపడం కనిపించింది.. తరువాత ఉగ్రవాదులు గేటు దూకి ఆసుపత్రి ప్రాంగణంలోకి ప్రవేశించారు.. ఇద్దరు సెక్యూరిటీ గార్డులను వారు కాల్చి చంపడం నేను చూశాను.. కిటికీ వద్ద ఉన్న మమ్మల్ని గమనించి వారు మాపై కాల్పులు జరిపారు.. కాల్పుల్లో మా సిబ్బందిలో ఒకరు గాయపడ్డారు. నేను ఆమెను ఎమర్జెన్సీ విభాగానికి తీసుకెళ్లి, ఉగ్రవాదులు ఆసుపత్రిలోకి ప్రవేశించారని అందరికీ చెప్పాను' అని అంజలి వెల్లడించారు.

'అక్కడ నుంచి ప్రసూతి వార్డుకు తిరిగొచ్చి మెయిన్ డోర్లు మూసివేసి, 20 మంది గర్భిణిలను ఓ చిన్న గదిలోకి తీసుకెళ్లాను.. సెల్‌ఫోన్‌లు, లైట్లు స్విచ్ ఆఫ్ చేసి.. వారు చీకటిలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. కొద్దిసేపటికే హైబీపీతో బాధపడుతున్న మహిళకు పురిటి నొప్పులు మొదలయ్యాయి... అప్పటికే ఆసుపత్రి లోపల కాల్పులు తీవ్రంగా జరుగుతుండటంతో ఆ వార్డుకు రావడానికి డాక్టర్ నిరాకరించారు... ఆమెను మెల్లగా గోడ పక్క నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ ప్రసూతి గదికి తీసుకెళ్లాను.. కొద్ది గంటల తర్వాత ఆమె ఒక ఆడ పిల్లను ప్రసవించింది.. ఆ శిశువుకు 'గోలీ' అని పేరు పెట్టారు.. ఆ రాత్రి ఐదు గంటల పాటు ఆసుపత్రిపై దాడి జరిగింది' అని తెలిపారు.

ఈ ఘటనలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులతో పాటు ఆసుపత్రి ఉద్యోగి కూడా చనిపోయారు. ఆ భయానక అనుభవం , బాధ నుంచి బయటపడ్డారా? అని అడిగిన ప్రశ్నకు కుల్తే మాట్లాడుతూ... 'ఆసుపత్రిలో పనిచేసిన డాక్టర్లు, నర్సులు లేదా ఇతర సిబ్బంది ఏ ఒక్కరూ ఆ రాత్రిని ఎప్పటికీ మరచిపోలేరు.. వారు గ్రెనేడ్‌లు విసరడం, కాల్పులు జరిపిన తీరు.. ప్రజలను చంపిన విధానం, మాలో ఎవరూ ఎప్పటికీ మరచిపోలేరు. దేశం మొత్తానికి అది దుఃఖం.. భయానకమైన రాత్రి' అని ఆమె అన్నారు.

నవంబరు 26, 2008 నాటి ఉగ్రదాడుల్లో తహవూర్ రాణా కీలక పాత్ర పోషించినట్టు ఆరోపణలు ఉన్నాయి. మూడు రోజుల పాటు పాకిస్థాన్ ఉగ్రమూకలు సాగించిన నరమేధంలో విదేశీయులు సహా 166 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో ప్రధాన నిందితుడు పాకిస్థాన్-అమెరికన్ ఉగ్రవాది డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ తన వాంగ్మూలంలో ఉగ్రవాద కార్యకలాపాల కోసం రాణా లాజిస్టికల్, ఆర్థిక సహాయం అందించాడని వెల్లడించారు. 2008 నవంబరులో దేశ ఆర్థిక రాజధాని ముంబయిలోకి చొరబడిన పాకిస్థాన్ ముష్కరులు.. తాజ్ హోటల్, రైల్వే స్టేషన్, ఒక యూదు కేంద్రం, ఇతర ప్రదేశాలు లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో పాల్గొన్న 10 మంది ఉగ్రవాదుల్లో అజ్మల్ కసబ్ ప్రాణాలతో పట్టుబడ్డాడు. అతడ్ని నవంబర్ 21, 2012న ఉరితీశారు. పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా ఈ దాడులకు పాల్పడింది.

గొంతు నులిమి భార్య హత్య.. మురుగు కాల్వలో మృతదేహం..

న్యూఢిల్లీ-నవభూమి: దేశ రాజధాని ఢిల్లీలో సుమారు నెల రోజుల క్రితం జరిగిన ఓ హత్య కేసును పోలీసులు చేధించారు. మృతురాలు శరీరంపై ఉన్న ముక్కు పుల్ల నే ఈ కేసు చేధనకు ఉపయోగపడింది. ముక్కు పుల్ల ఆధారంగా కేసును చేధించిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. మృతదేహాన్ని ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. ఢిల్లీకి చెందిన అనిల్ కుమార్ ఓ వ్యాపారి. ఆయన భార్య సీమా సింగ్. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ క్రమంలో సుమారుగా నెల రోజుల క్రితం సీమా సింగ్‌ను అనిల్ కుమార్ గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ఓ బెడ్‌షీట్‌లో చుట్టి, దానికి రాళ్లు, ఇటుక కట్టి, కారులో తీసుకెళ్లి దక్షిణ ఢిల్లీలోని మురుగు కాల్వలో పడేశాడు. గత నెల 15న కాల్వలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టానికి తరలించారు. పోస్టుమార్టంలో ఆమెను గొంతు నులిమి చంపినట్లు తేలింది. కానీ మృతురాలు ఎవరనేది గుర్తించడం కష్టంగా మారింది. ఈ క్రమంలో పోలీసుల కన్ను ఆమె ఒంటిపై లభించిన ముక్కు పుల్లపై పడింది. దక్షిణ ఢిల్లీలోని ఓ జ్యుయెలరీ దుకాణంలో ఆ ముక్కు పుల్లను చూపించగా.. అది తామే అమ్మినట్లు జ్యుయెలరీ యజమాని గుర్తించారు. ఆ ముక్కు పుల్ల కొనుగోలుకు సంబంధించిన బిల్లును తీయగా అది అనిల్ కుమార్ పేరిట ఉంది. దాంతో అనిల్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించగా నేరం ఒప్పుకున్నాడు. అతడి ద్వారా సీమా సింగ్ పుట్టింటి వారి వివరాలు తెలుసుకున్న పోలీసులు.. ఈ నెల 1న వారిని పిలిపించి మృతదేహాన్ని గుర్తించాలని కోరారు. దాంతో సీమా సింగ్ సోదరి, కుమారుడు ఆమె మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని వారికి అప్పగించారు. కాగా హత్య గురించి సీమా సింగ్ సోదరి బబితా సింగ్ మాట్లాడుతూ.. పోలీసులు చెప్పేవరకు తమ సోదరి హత్యకు గురైందనే విషయం తమకు తెలియదని అన్నారు. మార్చి 11న చివరిసారి సీమాకు ఫోన్ చేశానని, కానీ అనిల్ మాట్లాడాడని బబిత చెప్పింది. ప్రస్తుతం సీమా మనసు బాగోలేదని, మాట్లాడే మూడ్‌లో లేదని, ఆమె మంచి మూడ్‌లోకి వచ్చినప్పుడు తానే మాట్లాడిస్తానని అనిల్ కుమార్ చెప్పినట్లు ఆమె వెల్లడించింది. కానీ పోలీసులు హత్య వార్త చెప్పేవరకు అనిల్ కుమార్ ఫోన్ చేయించలేదని తెలిపింది.

ఎంత కష్టమొచ్చింది తల్లీ.. పది నిమిషాల్లో పరీక్ష అనగా హాల్‌టికెట్ ఎత్తుకెళ్లిన గద్ద

న్యూఢిల్లీ-నవభూమి: సాధారణంగా పరీక్ష రాయబోతున్న ఎవరిలోనైనా చిన్నపాటి కంగారు, ఆందోళన ఉంటుంటాయి. హాల్ టికెట్, పెన్ను అన్నీ ఉన్నాయో లేదోనని పదే పదే చూసుకుంటూ ఉంటాం. ఇంకా ప్రభుత్వ ఉద్యోగం కోసం రాసే పరీక్ష అయితే మరింత టెన్షన్ పడిపోతూ.. పరీక్ష ప్రారంభం అవ్వడానికి 15 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకుంటాం. అచ్చంగా ఇలాగే చేసిందో మహిళ. కానీ పరీక్షా కేంద్రానికి వచ్చాక.. 10 నిమిషాల్లో పరీక్ష ప్రారంభం కాబోతుండగా.. ఓ గద్ద వచ్చి హాల్ టికెట్ ఎత్తుకెళ్లిపోయింది. దీంతో ఆమె విపరీతంగా కంగారు పడిపోతూ.. ఏడ్వడం ప్రారంభించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతుండగా.. గద్ద చేసిన పనికి అంతా షాక్ అవుతున్నారు. మరి చివరకు గద్ద హాల్ టికెట్ తిరిగిచ్చేసిందా, అమ్మాయి పరీక్ష రాసిందా లేదా తెలియాలంటే మీరీ కథ చదవాల్సిందే. కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఇటీవలే రాత పరీక్షలు నిర్వహించింది. అయితే కొన్ని సంవత్సరాలుగా సర్కారు ఉద్యోగం సంపాదించేందుకు విపరీతంగా కష్టపడి చదువుతున్న ఓ మహిళా అభ్యర్థి.. తనకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి వచ్చింది. ఆలస్యం అయితే ఎక్కడ లోపలికి రానివ్వరేమోనని అరగంట ముందుగానే అక్కడకు చేరుకుంది. లోపలికి పిలిచే వరకు ఏం చేయాలో తెలియక ఓ చెట్టు కింద కూర్చుంది. అన్నీ సరిగ్గానే ఉన్నాయో లేదోనంటూ హాల్ టికెట్, పెన్నులను చెక్ చేసుకుంటుంది. ఇంతలోనే అక్కడకు ఓ గద్ద వచ్చి అమ్మాయి హాల్ టికెట్‌ను ఎత్తుకెళ్లిపోయింది. ఏం జరిగిందో అర్థం అయ్యలోపే ఆ గద్ద పరీక్షా కేంద్ర భవనం పైనున్న కిటికీపై కూర్చుంది.

ఆపై విషయం గుర్తించిన సదరు అభ్యర్థి ఛూ, ఛూ అంటూ గద్దను అదిరించింది. కానీ అది మాత్రం చప్పుడు చేయకుండా అలాగే ఉండిపోయేసరికి అమ్మాయి భయపడి పోయింది. పరీక్ష రాస్తానో లేదేనంటూ ఆందోళన చెందుతూ ఏడ్వడం ప్రారంభించింది. దీంతో పక్కనున్న అభ్యర్థులు ఆ విషయాన్ని గుర్తించారు. గద్దపైకి చిన్న చిన్న రాళ్లు విసరడం, చప్పట్లు కొడుతూ దాన్ని అదిరించడం చేశారు. అయినా ఆ గద్ద వారికి స్పందించలేదు. మరో 10 నిమిషాల్లోనే పరీక్ష ప్రారంభం అవుతుండగా.. అంతా లోపలికి వెళ్లిపోయారు. దీంతో అమ్మాయి మరింత ఆవేదన చెందగా.. ఉన్నట్టుండి ఆ గద్దే కిందకు వచ్చి హాల్ టికెట్ విసిరేసి పోయింది. దీంతో ఊపిరి పీల్చుకున్న ఆమె వెంటనే లోపలికి వెళ్లిపోయి.. హాయిగా పరీక్ష రాసుకుంది.

అయితే ఇదంతా జరుగుతుండగా.. అక్కడున్న కొందరు దీన్ని వీడియోగా తీశారు. ఆపై సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో కాస్తా నెట్టింట వైరల్ అయింది. పరీక్షకు 10 నిమిషాల ముందే గద్ద హాల్ టికెట్ ఎత్తుకుపోవడం, కొన్ని నిమిషాల్లోనే తిరిగిచ్చేయడం చూసి అంతా షాక్ అవుతున్నారు.

హిందూ తిలకాన్ని వేశ్యతో ముడిపెట్టి పిచ్చి జోకేసిన మంత్రి.. పార్టీ పదవి నుంచి తొలగించిన అధిష్టానం

చెన్నై- నవభూమి: తమిళనాడు మంత్రి చేసిన ఓ పిచ్చి జోకుతో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేగుతోంది. ముఖ్యంగా హిందువులు పెట్టుకున్న అడ్డ, పొడవు నామాలను వేశ్యతో ముడిపెడుతూ వివాదాస్పద కామెంట్లు చేశారు. ఆపై ఈ వీడియోను ఎక్స్ వేదికగా పోస్ట్ చేయగా.. ఒక్కొక్కరూ ఒక్కో విధంగా స్పందిస్తున్నారు. మహిళల గురించి ఇంత అసభ్యంగా ఎలా మాట్లాగల్గారని ప్రశ్నిస్తూనే.. మంత్రి పదవిని వీడాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈక్రమంలోనే పార్టీ అధిష్టానం ఈ అంశంపై స్పందించింది. మంత్రిని తమ పార్టీ పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఆపూర్తి వివరాలు మీకోసం. తమిళనాడు అటవీశాఖ మంత్రి కె.పొన్ముడి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవలే ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఓ జోక్ వేశారు. ముఖ్యంగా హిందువులు పెట్టుకునే బొట్టును శృంగారం, వేశ్యతో ముడి పెడుతూ కామెంట్లు చేశారు. ముందుగానే మహిళలూ నన్ను అపార్థం చేసుకోకండని చెప్పిన మంత్రి.. ఆపై ఓ వ్యక్తి వేశ్య దగ్గరకు వెళ్లాడని వివరించారు. అయితే ఆమె అతడిని నీవు వైష్ణవుడివా, శైవుడివా అని అడగ్గా.. అతడికి అర్థం కాలేదని చెప్పారు. దీంతో ఆ వేశ్య సదరు వ్యక్తిని నీవు పొడువు నామాల వాడివా, అడ్డ నామానా వాడివా అని అడిగిందని తెలిపారు. అడ్డంగా బొట్టు పెట్టుకునే వారైతే పడుకుని, నిలువు బొట్టు పెట్టుకునే వాడైతే నిల్చుని శృంగారం చేస్తారంటూ ఆమె వివరించినట్లుగా చెప్పి మంత్రి పచ్చి కామెంట్లు చేశారు.

ఆపై ఈ వీడియోను ఆయిన ఎక్స్ వేదికగా పోస్ట్ చేయగా.. నెట్టింట తెగ వైరల్ అయింది. మంత్రి పదవిలో ఉన్న పొన్ముడి.. అంత పచ్చిగా మహిళల గురించి ఎలా మాట్లాడగల్గారంటూ నెటిజెన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీజేపీ నాయకురాలు, నటి ఖుష్బూ సుందర్ స్పందిస్తూ.. మంత్రి చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమాదానం చెప్పాలని కోరారు. ఇంత పచ్చిగా మాట్లాడే మాటలను మీ ఇంట్లోని మహిళలు అంగీకరిస్తారా అంటూ ప్రశ్నించారు. ఆయన్ను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా నైనార్ నాగేంద్రన్.. రేపు అధికారిక ప్రకటన..!

చెన్నై- నవభూమి: తమిళనాడు బీజేపీ కొత్త అధ్యక్షుడి పేరు ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుత చీఫ్‌గా ఉన్న అన్నామలై వారసుడిగా నైనార్ నాగేంద్రన్ రానున్నట్లు తెలిసింది. అన్నామలై స్థానంలో నాగేంద్రన్ బాధ్యతలు చేపట్టబోతున్నారని సమాచారం. రాష్ట్ర బీజేపీ చీఫ్ పదవికి నాగేంద్రన్ ఒక్కరే నామినేషన్ వేశారు. దీంతో ఆయన నియామకం ఖాయమైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నాగేంద్రన్ పేరును అన్నామలై ప్రతిపాదించినట్లు తెలిసింది. నాగేంద్రన్ నియామకానికి సంబంధించిన అధికారిక ప్రకటన ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో రేపు ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. నాగేంద్రన్.. గతంలో అన్నాడీఎంకేలో కీలక పాత్ర పోషించారు. జయలలిత మరణం తర్వాత అన్నాడీఎంకేను విడిచిపెట్టి బీజేపీలో చేరారు. 2021లో బీజేపీ-అన్నాడీఎంకే కూటమిలో భాగంగా తిరునల్వేలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. అన్నాడీఎంకేతో నాగేంద్రన్‌కు మంచి సంబంధాలున్నందున కూటమి బలపడుతుందని బీజేపీ భావిస్తోంది.

అత్తింటివారిపై మాయావతి మేనకోడలి ఫిర్యాదు

న్యూఢిల్లీ-నవభూమి: ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీఎస్పీ అధినేత్రి మాయావతి మేనకోడలు అత్తింటివారిపై కేసు పెట్టింది. పెళ్లైనప్పటినుంచి భర్త, అత్త మామలు తనను వరకట్న వేధింపులకు గురిచేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాధితురాలికి 2023 నవంబర్ 09న హాపూర్ మున్సిపల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ పుష్పాదేవి కుమారుడు విశాల్ సింగ్‌తో వివాహం జరిగింది. అయితే, పెళ్లైనప్పటి నుంచి భర్త విశాల్, అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులు తనను వరకట్న వేధింపులకు గురిచేస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాదు లైంగికంగా కూడా వేధింపులకు ప్రయత్నించినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త బాడీబిల్డింగ్ కోసం స్టెరాయిడ్స్ వాడాడని, దీనివల్ల అతను వైవాహిక జీవితానికి అనర్హుడని బాధితురాలు ఫిర్యాదులో ఆరోపించింది. తన భర్త వైద్య పరిస్థితి గురించి తన అత్తమామలను తెలుసునని పేర్కొంది. దీంతో తన బావమరిది భూపేంద్రతో కమిట్ అయ్యి బిడ్డకు జన్మనివ్వాలని బలవంతం చేసినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. 2025 ఫిబ్రవరి 17న తన మామ, బావమరిది తనను దారుణంగా కొట్టి, లైంగిక వేధింపులకు ప్రయత్నించారని ఆమె ఆరోపించింది. వారి వేధింపులు భరించలేక తాను పుట్టింటికి వెళ్లిపోయినట్లు చెప్పింది. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని తెలిపింది. అందుకే తాను మార్చి 24న నేరుగా కోర్టును ఆశ్రయించినట్లు పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు బాధితురాలి భర్త, అత్తమామలు, మరో ఐదుగురు కుటుంబ సభ్యులపై గృహహింస, వరకట్న, లైంగిక వేధింపుల అభియోగాలు నమోదు చేసినట్లు పోలీసు అధికారి మునీష్ ప్రతాప్ సింగ్ తెలిపారు. తదుపరి దర్యాప్తు జరుగుతోందని, తగిన చర్యలు తీసుకుంటామని సింగ్ తెలిపారు. మరోవైపు ఈ పరిణామాల నేపథ్యంలో పుష్పాదేవి కుటుంబ సభ్యులను బీఎస్పీ నుంచి బహిష్కరించారు.

షర్టు బటన్ పెట్టుకోలేదని న్యాయవాదికి శిక్ష విధించిన అలహాబాద్ హైకోర్టు.. ఎన్ని నెలలంటే?

న్యూఢిల్లీ-నవభూమి: షర్టు బటన్ పెట్టుకోకుండా, మెడచుట్టూ ధరించే లాయర్ రోబ్ లేకుండానే ఓ కేసు వాదించేందుకు వెళ్లిన న్యాయవాదికి అలహాబాద్ హైకోర్టు షాక్ ఇచ్చింది. ఆయన కోర్టు ధిక్కరణకు పాల్పడ్డాడంటూ.. ఆరు నెలల జైలు శిక్ష విధించింది. అలాగే 2 వేల రూపాయల జరిమానా కూడా వేసింది. ఒకవేళ జరిమానా కట్టలేకపోతే మరో నెల రోజులు ఎక్కువగా జైల్లో ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. అసలు షర్టుకు బటన్ పెట్టుకోకుండా, మెడచుట్టూ లాయర్ రోబ్ ధరించకుండానే.. హైకోర్టులో కేసు వాదించేందుకు వెళ్లిన ఆ లాయర్ ఎవరో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

2021వ సంవత్సరం ఆగస్టు 18వ తేదీన అలహాబాద్ హైకోర్టు స్థానిక న్యాయవాది అశోక్ పాండే.. షర్టు బటన్ లేకుండా లాయర్లు మెడ చుట్టూ ధరించే రోబ్ లేకుండానే కేసు వాదించేందుకు వెళ్లాడు. విషయం గుర్తించిన న్యాయమూర్తులు అతడిని బయటకు వెళ్లిపోవాలని సూచించారు. దీంతో తీవ్ర కోపోద్రిక్తుడైన లాయర్ అశోక్ పాండే.. న్యాయమూర్తులను గుండాలని సంబోధించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈక్రమంలోనే ఆయనపై కోర్టు ధిక్కరణ చర్యలు మొదలు అయ్యాయి. అనేక అవకాశాలు ఉన్నా ఆశోక్ పాండే మాత్రం ఈ ఆరోపణలపై స్పందించలేదు.

అయితే అలహాబాద్ హైకోర్టు ఈ కేసుపై నేడు విచారణ జరిపింది. ముఖ్యంగా న్యాయవాది అశోక్ పాండే నిజంగానే కోర్టు ధిక్కరణకు పాల్పడ్డాడని కోర్టు తేల్చింది. అతడు షర్టు బటన్ పెట్టుకోకుండా, రోబ్ ధరించకూడనే కేసు వాదించేందుకు వచ్చాడని.. న్యాయవాదులును కూడా గూండాలని సంబోధించినట్లు తెలిపింది. 2017లోనూ ఆయనపై కోర్టు ప్రాంగణం నుంచి రెండేళ్ల నిషేధం విధించబడిందని.. వాటన్నిటినీ పరిగణలోకి తీసుకుని ఆయనకు శిక్ష వేస్తున్నట్లు చెప్పింది. కోర్టు ధిక్కరణలో భాగంగా ఆరు నెలల పాటు జైలు శిక్ష విధిస్తున్నట్లు జస్టిస్ వివేక్ చౌదరీ, బీఆర్ సింగ్‌లకు చెందిన డివిజన్ బెంచ్ తీర్పును ఇచ్చింది. అంతేకాకుండా రెండు వేల రూపాయల జరిమానా కూడా విధించింది. ఒకవేళ ఆ డబ్బులు చెల్లించలేకపోతే మరో నెల రోజులు ఎక్కువగా జైలు శిక్ష అనుభవించాలని స్పష్టం చేసింది. అలాగే లక్నోలోని చాఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట లొంగిపోవడానికి ఆశోక్ పాండేకు 4 వారాల సమయం కూడా ఇచ్చింది. అంటే మే 1వ తేదీన ఆయన అక్కడకు వెళ్లాలి. ఇది మాత్రమే కాకుండా అలహాబాద్ హైకోర్టు, లక్నో బెంచ్‌లలో లీగల్ ప్రాక్టీస్ చేయకుండా ఎందుకు నిషేధం విధించకూడదో అడుగుతూ షోకాజ్ నోటీస్ జారీ చేసింది.

పనిలోంచి తీసేశారని.. శరీరంలో బుల్లెట్ ఇంప్లాంట్ చేసుకుని గ్యాంగ్ రేప్ చేశారంటూ నాటకమాడిన పనిమనిషి

న్యూఢిల్లీ-నవభూమి: ఆమె ఓ పనిమనిషి. మేయర్ ఇంట్లో పని చేస్తోంది. అయితే సరిగ్గా పని చేయకోవడంతో మేయర్ భార్య ఆమెను పనిలోంచి తీసేసింది. దీంతో వారిపై కోపం పెంచుకున్న ఆమె మేయర్ కుటుంబంపై పగ తీర్చుకోవాలనుకుంది. అందుకోసం రూ.2,500 ఇచ్చి ఓ డాక్టర్ చేత తన శీరరంలో బుల్లెట్ ఇంప్లాంట్ చేయించు కుంది. ఆపై పోలీసుల వద్దకు వెళ్లి తనను కిడ్నాప్ చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పింది. అయితే మేయర్ ఇందులో కీలక పాత్ర పోషించారంటూ వివరిం చింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

పనిలోంచి తీసేశారని.. శరీరంలో బుల్లెట్ ఇంప్లాంట్ చేసుకుని గ్యాంగ్ రేప్ చేశారంటూ నాటకమాడిన పనిమనిషి రోజురోజుకూ పలువురు దారుణంగా తయారు అవుతున్నారు. చిన్న చిన్న వాటికే మనుషులపై పగ పెంచుకుని.. వాటిని తీర్చుకునేందుకు దారుణాలకు తెగబడుతున్నారు. హత్యలు కూడా చేస్తూ తమలోని రాక్షసత్వాన్ని బయట పెడుతున్నారు. అచ్చంగా ఇలాగే చేసిందో మహిళ. కానీ హత్యకు బదులు అంతకు మించిన నాటకం ఆడింది. ముఖ్యంగా తనను పనిలోంచి తీసేశారని మేయర్ కుటుంబంపై పగ పట్టింది. ఈక్రమంలోనే తన శరీరంలో బుల్లెట్ ఇంప్లాంట్ చేయించుకుని.. తనను కిడ్నాప్ చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడి ఆపై తుపాకీతో కాల్చారాని ఆరోపించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులకు షాకింగ్ విషయాలు తెలిసాయి. అసలీ స్టోరీ బయట ఎలా పడిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం. ఉత్తర ప్రదేశ్‌లోని బరేలీ మేయర్ ఉమేష్ గౌతమ్ ఇంట్లో పని చేసే 40 ఏళ్ల వయసు గల మహిళ.. మార్చి 29వ తేదీన పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. ఛాతీ నుంచి రక్తం కారుతుండగా అక్కడకు వెళ్లింది. అది చూసిన పోలీసులు తీవ్ర ఆందోళనకు గురవుతూనే మహిళను ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలోనే ఏమైందని ప్రశ్నించగా.. తనను మేయర్ ఉమేష్ గౌడ్, ఆయన కుమారుడు పార్థ్ కిడ్నాప్ చేశారని చెప్పింది. ఆపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని వివరించింది. ఈక్రమంలోనే తాను తప్పించుకోవడానికి ప్రయత్నించగా తుపాకీతో కాల్పులు జరిపారని పేర్కొంది. దీంతో పోలీసులు సదరు మహిళను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తూనే.. మరోవైపు మేయర్, ఆయన కుమారుడిని అదుపులోకి తీసుకున్నారు. అసలేం జరిగిందో చెప్పాలంటూ వారిని ప్రశ్నించారు. కానీ తమకేమీ తెలియదని మేయర్, ఆయన కుమారుడు చెప్పారు. ఎన్నిసార్లు పోలీసులు అడిగినా వారి నుంచి ఇదే సమాధానం వచ్చింది. ఇదిలా ఉండగా.. మహిళకు చికిత్స చేసిన వైద్యులు పోలీసులకు ఫోన్ చేసి ఆస్పత్రికి రమ్మని చెప్పారు. అలా వెళ్లగానే మహిళను తుపాకీతో కాల్చలేరని.. కావాలనే దాన్ని ఆమె ఛాతీలో పెట్టారని వివరించారు. దీంతో షాక్ అయిన పోలీసులు మహిళ వద్దకు వెళ్లి తమదైన స్టైల్లో విచారించారు. దీంతో ఆ పని మనిషి అసలు విషయం చెప్పింది. తాను 2021వ సంవత్సరంలో మేయర్ ఇంట్లో పని చేసేదాన్నని.. కానీ సరిగ్గా చేయడం లేదంటూ ఆయన భార్య తనను ఉద్యోగంలోంచి తీసేసిందని వివరించింది. దీంతో వారిపై కోపం పెంచుకుని.. పగ తీర్చుకోవాలని ఇలా చేసినట్లు వెల్లడించింది. ముఖ్యంగా అత్యాచారం, హత్యాయత్నం చేశారంటే కచ్చితంగా వారికి శిక్ష పడుతుందని ఈ నాటకం ఆడినట్లు చెప్పింది.

2022లోనూ ఇలాగే

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ శనివారం 12 ఏప్రిల్ 2025

పిట్టను రక్షించేందుకు రంగంలోకి దిగిన జడ్జి, కలెక్టర్.. అసలు కథ ఇదీ..!

తిరువనంతపురం– నవభూమి: పక్షులు, మూగజీవాలు కళ్ల ముందే చనిపోతున్నా.. ఎవరూ పట్టించుకోరు. కానీ ఓ పక్షిని ప్రాణాలతో కాపాడేందుకు స్వయంగా జడ్జి, కలెక్టర్ రంగంలోకి దిగారు. మూడు రోజుల పాటు తీవ్రంగా శ్రమించి.. ఆ పక్షిని ప్రాణాలతో కాపాడారు. ఈ పక్షి కథ తెలుసుకోవాలంటే కేరళలోని కన్నూరు జిల్లాకు వెళ్లాల్సిందే.కన్నూరు జిల్లాలోని ఉల్లిక్కల్ పంచాయతీ పరిధిలోని మూసేసిన ఓ టెక్స్ టైల్ షాపు గ్లాస్ ప్యానెల్‌లో ఓ పక్షి చిక్కుకుంది. పక్షి ఆ గ్లాస్ ప్యానెల్‌లో చిక్కుకుని విలవిలలాడుతున్న దృశ్యాన్ని స్థానికులు గమనించారు. ఆ ప్యానెల్‌లో నుంచి బయట పడేందుకు పక్షి శతవిధాలా ప్రయత్నిస్తుంది. కానీ సాధ్యం కావట్లేదు.

మిగతా దుకాణదారులు, స్థానికులు కూడా పక్షిని కాపాడలేని పరిస్థితి ఉంది.ఎందుకంటే బిజినెస్ పార్ట్‌నర్స్ మధ్య ఉన్న వివాదం కారణంగా కోర్టు ఉత్తర్వులకు లోబడి ఆ షాపును కొన్ని నెలల క్రితం సీజ్ చేశారు. దీంతో షాపును తెరిచేందుకు కోర్టుకు వెళ్లి అనుమతి తీసుకోవాలి. ఇందుకోసం జిల్లా కలెక్టర్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు కూడా రంగంలోకి దిగారు. స్థానికుల సహాయంలో ఒక చిన్న పైపు ద్వారా ఆ పక్షికి ఆహారం, నీరు అందించారు.చివరకు కోర్టు జడ్జి కూడా స్పందించి.. నేరుగా ఘటనాస్థలానికి చేరుకున్నారు. మూడు రోజుల తర్వాత జడ్జి, కలెక్టర్ సమక్షంలో ఆ షాపును తెరిచి.. గ్లాస్ ప్యానెల్‌లో చిక్కుకున్న పక్షిని ప్రాణాలతో కాపాడారు. ఏప్రిల్ 8న పక్షి చిక్కుకోగా, ఏప్రిల్ 10న గాల్లోకి ఎగిరిపోయింది.



పేదల ఇంట కొత్త వెలుగు 'పీ4'

పేదల సాధికారత లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ ఉగాది నుంచి అమలు చేస్తున్న విశిష్ట పథకం పీ4. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలోని అత్యంత నిరుపేదలను ఆదుకోవడానికి ప్రవేశపెట్టిన పథకం ప్రభుత్వ–ప్రైవేటు–ప్రజల భాగస్వామ్యం (పీ–4). మరింత వివరంగా చెప్పాలంటే అత్యంత పేదరికం (జీరో పావర్టీ)తో మగ్గిపోతున్న 20 శాతం కుటుంబాలను అత్యున్నత స్థాయిలో ఆర్థికంగా నిలదొక్కుకున్న 10 శాతం మంది, ఇంకా ఎన్ఆర్ఐల సహకారంతో రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో పేదరికాన్ని గణనీయంగా తగ్గించడానికి కృషి చేయడం కోసం చంద్రబాబు తెచ్చిన విధానమే పీ4. దీని అవసరం ఇప్పుడే ఎందుకు అనే అంశాన్ని చర్చించే ముందు దేశంలో, రాష్ట్రంలో కొనసాగుతున్న పేదరికం నేపథ్యాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత కేంద్రం, రాష్ట్రాలు ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో అభివృద్ధి కోసం, పేదరిక నిర్మూలన కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశాయి. ప్రభుత్వాలు తాము చేసిన వ్యయాన్ని ప్రణాళికాబద్ధంగానే చేస్తున్నామని చెబుతాయి. కానీ, ఇన్ని నిధులు ఖర్చు పెట్టినా పేదరికం ఎందుకు తగ్గడం లేదు? ప్రముఖ రాజ్యాంగ కోవిదుడు నానీ ఫాల్కీవాలా గతంలో చెప్పినట్లు.. మనం అమలు చేసిన అస్తవ్యస్త ఆర్థిక విధానాల కారణంగా పేదరికం అనే విశాల సముద్రంలో సంపదతో తులతూగే కొన్ని ద్వీపాలను మాత్రం అభివృద్ధి పరుచుకోగలిగాం. ఫాల్కీవాలాతో పాటు పలువురు ప్రసిద్ధ ఆర్థిక, సామాజికవేత్తల అభిప్రాయం కూడా అదే.

మనం అమలు చేసిన ప్రణాళికల వల్ల దేశంలో సంపద పెరిగిన మాట నిజమే గానీ, అదే సమయంలో దేశంలో ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య అగాధాలు పెరిగిపోయాయి. ఒకవైపు జాతీయోత్పత్తి, సగటు తలసరి ఆదాయంలో పెరుగుదల కన్పించినా.. ఆర్థిక అసమానతలు అంతకంతకూ పెరిగిపోయాయి. దేశంలో సంపన్నులు మరింత సంపన్నులు కావడంలో ఎవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చునేమో గానీ పేదలు మరింత పేదలు కావడాన్ని ఎవరు మాత్రం ఆమోదిస్తారు? 1991 తర్వాత దేశంలో ప్రవేశపెట్టిన సరళీకృత ఆర్థిక విధానాల కారణంగా జాతీయ సంపద గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. 90వ దశకం ముందువరకు జాతీయ ఆర్థికాభివృద్ధి రేటు 3–4శాతం మించలేదు. కానీ సరళీకృత ఆర్థిక విధానాలు అమలయ్యాక ఆరికాభివృద్ధి రేటు 8–9శాతం చేరుకొంది. జాతి సంపద ప్రతియేటా 8–9శాతం పెరుగుతుంటే, పేదరికం ఆ దామాషాలో తగ్గాలి కదా? కానీ పేదరికం ప్రతియేటా సగటున 0.5శాతం కూడా తగ్గడం లేదు. మరి లోపం ఎక్కడున్నట్లు?ప్రస్తుతం 200 దేశాల ఆకలి సూచీ జాబితాలో భారత్‌ది 180వ స్థానం. మనకంటే మెరుగైన స్థానాల్లో పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లు ఉన్నాయి. ఇది భారత్‌కు అవమానం కాదా? త్వరలోనే ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని గొప్పలు చెప్పుకుంటున్న భారత్‌లో 20శాతం మంది నిరుపేద ప్రజలు ప్రతిరోజూ అర్ధాకలితో ఉంటున్నారన్నది ఓ చేదు వాస్తవం. 'పేదరికంతో సహజీవనం చేయడం కంటే అనాగరికత మరొకటి లేదు'%–% అన్నారు మహాత్మాగాంధీ. అభివృద్ధి, పేదరికం సమాంతరంగా కొనసాగడం ఏ సమాజానికి శ్రేయస్కరం కాదు. పేదరికాన్ని తగ్గించకపోతే శాంతిభద్రతలతో సహా అనేక సమస్యలొస్తాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి, శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందంజ వేయడం తదితర మార్పులు ఆహ్వానించదగినవేగానీ.. అంతిమంగా అవన్నీ అన్ని వర్గాల ప్రజలకూ ఉపయోగపడాలి, పెరిగే సంపద హేతుబద్ధంగా ప్రజల మధ్య పంపిణీ జరగాల్సిన అవసరం ఉంది. ఈ వాదనను చంద్రబాబు 1995 సెప్టెంబర్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ పలు వేదికల ద్వారా వినిపిస్తూనే ఉన్నారు.చంద్రబాబు తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా, ప్రభుత్వోద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని దుస్థితిలో ఉంది. అటువంటి క్లిష్ట సమయంలో చంద్రబాబు అప్పటి వరకు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రజల సహకారంతో, ప్రజల భాగస్వామ్యంతో సమాజాన్ని స్వశక్తితో నిర్మించడానికి 'జన్మభూమి' కార్యక్రమం చేపట్టారు. ప్రారంభంలో ఆయన రాజకీయ ప్రత్యర్థులు. ఆ ప్రయత్నాన్ని అవహేళన చేశారు. ప్రభుత్వ ఖజానాలో చిల్లిగవ్వ లేదు గనుక ప్రజల శక్తి సామర్థ్యాలను పైసా ఖర్చు లేకుండా చంద్రబాబు వాడుకొంటున్నాడు.. అని ఎద్దేవా చేశారు.సంప్రదాయ ఆలోచనాపరులు 'ప్రభుత్వం వేరు.. ప్రజలు వేరు' అనే భావన కలిగి ఉండటం సహజమే. ప్రజల్లో కూడా%–% 'మనకెందుకు.. అన్నీ ప్రభుత్వం చూసుకొంటుంది' అనే మైండ్‌సెట్ ఏర్పడి పోయింది. అయితే, చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమాన్ని పట్టుదలతో చాలెంజ్‌గా తీసుకొన్నారు. తెలుగు ప్రజలలో జన్మభూమి స్ఫూర్తిని, చైతన్యాన్ని రగిలించడంలో చంద్రబాబు గొప్ప విజయం సాధించారు. దాంతో, వయస్సు తారతమ్యాలు, సాంఘిక హోదాలు లేకుండా ప్రజలు తమ ప్రాంతాలను బాగు చేసుకోవడానికి ముందుకు కదిలారు. శ్రమదానం కార్యక్రమాలు ఊరువాడా జరిగాయి. అధికార యంత్రాంగం ఆఫీసు గదుల నుంచి ప్రజాక్షేత్రానికి కదిలారు. ఫలితంగా ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతో అన్నిచోట్లా ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు పరిష్కారం అయ్యాయి. ఎన్నో ఏళ్లుగా ప్రేక్షకులుగా ఉండడానికి అలవాటు పడిన ప్రజలు జన్మభూమి స్ఫూర్తితో అభివృద్ధిలో భాగస్వాములు కావడం రాష్ట్ర చరిత్రలో ఓ ఉజ్జ్వల ఘట్టం. అంతేకాదు.. గ్రామాలలో పుట్టి పెరిగి, పల్లె బడి నుంచి పైకెదిగి దేశ, విదేశాలలో స్థిరపడిన పారిశ్రామికవేత్తలు, ఉన్నత విద్యావంతులు, వివిధ రంగాల ప్రముఖులు తాము పుట్టి పెరిగిన నేల తల్లి రుణం తీర్చుకోవడానికి అవకాశం లభించడం అదృష్టంగా భావించి.. కన్న తల్లి కంటే మిన్న అయిన జన్మభూమి రుణాన్ని కొంతైనా తీర్చుకొన్నారు.ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ4 ఒక విధంగా చెప్పాలంటే జన్మభూమికి కొనసాగింపే! అయితే జన్మభూమిలో వేల కోట్ల రూపాయల విలువైన సామాజిక పనులు జరిగాయి. సామాజిక ఆస్తులు రూపుదిద్దుకొన్నాయి. వేలాది గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. అయితే, 'పీ4' మాత్రం నేరుగా పేదరిక నిర్మూలనకు సంబంధించి అత్యంత నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొని.. వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం లక్ష్యంగా అమలు జరుగుతుంది. పీ4లో నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోవడానికి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి సంపన్న వర్గాలు ముందుకు వస్తాయా? అనే ప్రశ్న తలెత్తడం కూడా సహజమే. నిజానికి, సమాజంలో ఏ ఆపద వచ్చినా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా.. ప్రభుత్వంతో పాటు ఆదుకోవడానికి ఎంతోమంది దాతలు, సంస్థలు ముందుకొచ్చి ఇతోధికంగా సాయం చేయడం ఎప్పట్నుంచో జరుగుతూనే ఉంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) క్రింద ఎన్నో సంస్థలు పలు సామాజిక కార్యక్రమాలపై నిధులు ఖర్చు పెడుతున్నాయి.

నిరాశ నిస్పృహలే ప్రథమ శత్రువులు



నీవు ఏ పరిస్థితుల్లో ఉన్నా, నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగవలసిన పనులు వాటంతట అవే జరుగుతుంటాయని స్వామి వివేకానంద చక్కగా ఏనాడో స్పష్టం చేశారు. అవును, ఖచ్చితత్వంతో ఎవరికి నిర్దేశించిన పనులను వారు సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహిస్తే తిరిగే లేదు. సమస్యల్లా ఎవరి పనులను వారు చేయకపోవడమే అవుతోంది. సృష్టిలో స్పష్టంగా ఎవరి విధులు, పనులు వాటికి నిర్దేశించబడ్డాయి. సృష్టిని పరిశీలిస్తే, వాటి పనులు అవి సక్రమంగా నిర్వహించడం వల్లనే సృష్టి కొనసాగుతుంది. కొద్దిగా తేడా వస్తేనే ఇబ్బందులు గమనించబడుతున్నాయి. ఉదాహరణకు, అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు, సునామీలు, తుఫానులు.... అందుకే, దేనికి, ఎవరికి నిర్దేశించిన పనిని వారు నిర్వహిస్తే తిరిగే ఉండదు. సృష్టిలోని సకల వ్యవస్థలు వాటికి నిర్దేశించిన కర్తవ్యాలను అవి స్వయంగా, సక్రమంగా నిర్వహించుకుంటూ ఉంటేనే మనం మనుగడ సాగిస్తున్నాం, కానీ మన విధులను మనం సక్రమంగా నిర్వహిస్తున్నామా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఉదాహరణకు బాలురు రోజు బడికి వెళ్లాలి, చక్కగా అంతా చదువుకోవాలి. క్రమశిక్షణను పాటిస్తూ ఉపాధ్యాయులు బోధించిన అంశాలను చక్కగా వింటూ ఆకలింపు చేసుకుంటూ అర్థం కాని విషయాలను, తెలియని విషయాలను వెంటనే తెలుసుకోవాలి. చదువుకు సంబంధించి ఎప్పటి పనులను, కృత్యాలను అప్పుడే నిర్వహిస్తే, టీచర్లు చెప్పింది తూచా తప్పకుండా పాటిస్తే ఇక ఫలితాలు బ్రహ్మాండంగా ఉంటాయి. కానీ ఆ విధంగా గమనించబడక పోవడం వల్లనే చదువుల్లో కొందరు వెనకబాటు గమనించబడుతోంది.

విద్య అంటే జ్ఞానము, చదువు! విద్యార్థి అంటే చదువుకోరువాడు అంటే విద్య (చదువు) ను అర్థిస్తూ తగు అర్హాన్ని కలిగించేవాడు. ఈ ప్రకారమే విద్యాభ్యాసం క్రమంగా కొనసాగితే ఇక తిరుగే లేదు. కాని ప్రస్తుతం పరిస్థితులు కొన్ని ఇందుకు భిన్నంగా గమనించబడటం వలన చదువుల్లో విపరీతం, వెనకబాటు గమనించబడుతుంది. ఒకటి మాత్రం నేను స్పష్టంగా చెప్పగలను. కేవలం చదివే అన్నిటినీ మార్చేస్తుంది. చివరకు మన తలరాతను కూడా! దీనికి, పట్టుదలతో శ్రమించే తత్వంతో ఇష్టపడుతూ కష్టపడి చదవడం వంటివి మాత్రమే కావాల్సింది. అనేకమంది కేవలం చదువునే నమ్ముకుని దానిని ఆశ్రయించి ప్రయోజకులయ్యారు. మరికొందరైతే మహానుభావులుగా, మహాత్ములుగా, మనకు మార్గదర్శకులుగా నిలిచిపోయారు. వారికి వందనాలు. అందుకే, ఎవరికి నిర్దేశించిన పనిని వారు చేయడమే తమ వంతుగా భావించాలి. దాని ఫలాలు ఖచ్చితంగా లభించి తీరుతాయి. నిర్దేశించిన పనిని సక్రమంగా చేయక పోవడమే వెనుకబాటుకు కారణం. అదే ఒక విధంగా దారిద్ర్యమునకు కారణం కూడా!

ఏదైనా పని ప్రారంభించే ముందు అట్టి పని గూర్చి స్పష్టంగా తెలుసుకోవాలి. సదరు పనిని ఎలాగైనా సాధించేలా సరైన పక్కా ప్రణాళికలను రూపొందించుకోవాలి. పని ప్రారంభించే ముందు అన్ని తెలుసుకుంటూ కీడెంచుతూ మేలెంచుకోవాలని పెద్దలు చెబుతారు. ఇది అక్షర సత్యం. దానర్థం కీడెంచుతూ మేలెంచితే, కఠినమైన పరిస్థితులను సైతం ముందే ఊహిస్తూ కష్టాలను, నష్టాలను, ఇబ్బందులను ధైర్యంగా, సమర్థవంతంగా ఎదుర్కొనే వీలుంటుంది. కష్టపడిన తర్వాత లభించే సుఖం అమితమైన ఆనందాన్ని కలిగిస్తుంది. అట్టి సుఖానికి విలువ కట్టలేం. కష్టపడే తత్వం ఉన్నవారు ఏది జరిగినా అంతా మన మంచికే అనే దృక్పథంతో ముందుకు వెళుతుంటారు. ఎదురయ్యే అపజయాలను సోపానాలుగా మార్చుకుంటూ విజయ పథంలో దూసుకెళ్తుంటారు. సాధించాలనే తపన చక్కని మనోధైర్యాన్ని కలిగిస్తుంది. ముందుకు తోడుకోని వెళ్తుంది.

ఏదో ఒకసారి పొరపాటుతో ఫలితం రాకపోతే నిరాశకు లోను కావద్దు. వాస్తవానికి నిరాశను దేనిలోనూ రానియ్య కూడదు. నిరాశ, ఆశలను వమ్ము చేస్తూ అంధకారంలోకి తీసుకెళ్తుంది. ఏ విషయంలోనైనా నిరాశ నిస్పృహాలు చోటు చేసుకుంటే, ఇక ఏది సఫలం కాదు. రుచించదు కూడా!

నిరాశ, వైరాగ్యం, నిస్పృహలతో ఉంటూ హైదరాబాదీ బిర్యానీ తిన్నా రుచి లభించదు. అదే ఆశావాదం, సాధించాలనే సంకల్ప బలంతో నిజాయితీగ పనిచేస్తూ లభించే పచ్చడి మెతుకుల్లో బ్రహ్మాండమైన రుచి గోచరిస్తుంది. నిరాశ అనేది వ్యక్తిత్వాన్ని క్రమంగా హరించివేస్తుంది. అయితే ఆశావాదం బ్రహ్మాండంగా రాణింపచేస్తుంది. దీనికి ఒక చక్కటి ఉదాహరణ, గమనించండి.

19వ శతాబ్దంలో, ఒక విద్యార్థి తల్లికి, ఆ విద్యార్థి చదివే పాఠశాల నుండి ఒక లేఖ వస్తుంది. దాని సారాంశం ఏమంటే పిల్లవాడు మెంటల్ గ ఎదగలేడు, పాఠాలను అర్థం చేసుకోలేకపోతున్నాడు, వెనకబడిపోతున్నాడు కావున బడికి ఆయనను పంపకండి అని! అట్టి లేఖను చూసిన సదురు పిల్లాడి తల్లి చాలా బాధపడుతుంటే.... ఆ పిల్లవాడు అమాయకంగా ఏమైందమ్మా ఆ లెటర్ లో ఏముంది అని అడిగితే... ఆ మాతృమూర్తి నిరాశను ఏ మాత్రం దరిచేయనీయక, ఆశావాదంతో... బాబు నీవు చాలా తెలివిగల వాడివట, నీ స్థాయికి వారు పాఠాలు చెప్పలేరంట, అందుకే బడికి పంపకండి అంటూ లేఖ పంపారని చెప్పి, తానే స్వయంగా అకుంఠ దీక్షతో పిల్లాడికి పాఠాలను బోధిస్తుంది. అదే స్ఫూర్తి ప్రేరణతో ఆ పిల్లవాడు విద్యనభ్యసిస్తాడు. తదుపరి పెద్దయిన తర్వాత ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తగా మారాడు. ఆయనగారే థామస్ ఆల్వా ఎడిసన్. ప్రపంచానికి బల్బు ద్వారా కాంతిని పరిచయం చేసిన మహా గొప్ప మేధావి. ఆయన గారు బల్బును కనుగొనే ప్రయోగ సమయంలో, ప్రయోగం ప్రారంభించగానే విఫలమై అనేక వందల మార్లు ప్రయత్నిస్తూనే ఉన్నారట. ఆ సమయంలో ఆయన గారితో పాటు సహాయకారిగా ఉండే ఒక వ్యక్తి, సార్! బల్బు వెలిగించక ముందే ఫెయిల్ అయిపోతుంది. ఇక బల్బు కనుగొంటామా? అనే ప్రశ్నకు, ఆశావాది కార్యసాధకుడైన థామస్ ఆల్వా ఎడిసన్ గారు నవ్వుతూ, చాలా కూల్ గా అయ్యా! బల్బు ఫెయిల్ కాకుండా ఉండడానికి గల కారణాలు కనుగొంటున్నాను అని బదులు ఇచ్చాడట. ఆయన గారు ఆనాడే నిరాశ, నిస్పృహతో ప్రయోగాన్ని వదిలేస్తే నేడు మనం బల్బు వెలుగు చూడగలిగే వారమా? ఆలోచించండి. అందుకే, చక్కని ఆత్మస్థైర్యంతో, పట్టుదలతో సదా ముందుకు వెళ్లే ప్రయత్నం చేయాలి. అంతేగాని నిరాశకు ఏ మాత్రం చోటు ఇవ్వకూడదు. గెలుపు ఓటములు సహజమే. ఓటమిలోనే గెలుపు మార్గాలను అన్వేషించాలి. గెలుపుతో పొంగి పోవద్దు. ఓటమితో కృంగి పోవద్దు. అన్నింటిలో మనకు మనం తగించుకుంటూ దృఢ సంకల్పంతో, సాధించి తీరాలనే స్థిరమైన లక్ష్యంతో, నిజాయితీతో శ్రమిస్తే విజయం ఖచ్చితంగా మన బానిస అవుతుంది. దీనికై ఎన్నో ఉదాహరణలను గమనించవచ్చు. నిజాయితీగ, నిబ్బరంగ మన పని మనం చేస్తే అభివృద్ధి గమనించబడి తీరుతుంది. సందేహమే లేదు.

డాక్టర్ ఎం ప్రభు దయాల్
మాజీ సెనేట్ మెంబర్ – కాకతీయ యూనివర్సిటీ
జీవిత సభ్యుడు – ఐఏటిఈ
మండల విద్యాశాఖ అధికారి – కొత్తగూడెం

గవర్నర్లు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించే బిల్లులకు సంబంధించి గవర్నర్ల పాత్రపై సుప్రీంకోర్టు ఇటీవల కీలకమైన తీర్పుని వెలువరించడంశుభపరిణామం. అసెంబ్లీ ఆమోదించిన పదికి పైగా బిల్లులను గవర్నర్ ఆర్.ఎన్.రవిఅడ్డుకుంటూ నిరవధికంగా జాప్యం చేస్తున్నారని తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టునుఆశ్రయించగా బిల్లులను గవర్నర్ నిరవధికంగా నిలిపివేయడం రాజ్యాంగ విరుద్ధం అని,గవర్నర్ చర్య చట్టవిరుద్ధం మరియు ఏకపక్షం అని జస్టిస్ జె.బి పార్దివాలా మరియుజస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ధర్మాసనం కీలకమైన తీర్పుని వెలువరించడంవిశిష్టమైన ప్రాధాన్యతని సంతరించుకుంది. ఇది తమిళనాడుకే కాదు, అన్ని భారతీయరాష్ట్రాలకు పెద్ద విజయం. రాష్ట్రాలకున్న లెజిస్లేటివ్ హక్కులను పునరుద్ఘాటించే తీర్పు.కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసిన గవర్నర్లు విపక్ష పాలిత రాష్ట్రాల్లో ప్రగతిశీల లెజిస్లేజివ్‌సంస్కరణలను అడ్డుపడే సంస్కృతిని ఈ తీర్పు నిలువరించింది' అని తమిళనాడుముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఈ తీర్పును చారిత్రాత్మకమైన తీర్పుగా అభివర్ణించడంగమనార్హం. ఏది ఏమైననూ 'ఈ తీర్పు గవర్నర్ల అప్రజాస్వామిక విధానాలకు అడ్డుకట్టవేయనుంది' అని నిస్సందేహంగా చెప్పవచ్చు.స్వాతంత్ర్య భారతదేశంలో నాటి నుండి నేటి దాకా కొన్ని రాష్ట్రాల్లోని గవర్నర్లురాజ్యాంగబద్ధంగా వ్యవహరించకుండా తమ ఇష్టారాజ్యంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపైపెత్తనాలు సాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఒక రకంగా సమాంతరప్రభుత్వాలని నడిపిస్తున్నారు. ఆ విధంగా వ్యవహరించే ఆయా గవర్నర్ల



రాజకీయఆధిపత్య ధోరణులు ప్రజాస్వామ్యంలో ఏమాత్రం సహేతుకం కావు. అంతిమంగా గవర్నర్లఅప్రజాస్వామిక విధానాలు ప్రజాస్వామ్య మనుగడకు తీవ్ర ప్రతిబంధకాలుగానిలువనుండడం విచారకరం. ఇలాంటి సంకుచిత పరిస్థితుల్లో గవర్నర్ల విధి విధానాలపైఅడపాదడపా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. గవర్నర్లు తమ అధికారాన్నిఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలు అనేకసందర్భాలలో వెలువెత్తుతూనే ఉన్నాయి. గవర్నర్ వ్యవస్థ రాజ్యాంగబద్ధమైనదే అయిననూ కూడా ఆయా గవర్నర్లు రాజ్యాంగానికి అతీతంగా ఆయా రాజకీయ పార్టీలకుఅనుకులంగా వ్యవహరిస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా కొన్నిరాష్ట్రాలలోని కొందరు గవర్నర్లు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ గవర్నర్ పదవికి తీవ్రకళంకం తీసుకురావడం విచారకరం.గవర్నర్ల అప్రజాస్వామిక కళంక ఘటనలను పరిశీలిస్తే గతంలో తమిళనాడు రాష్ట్రంలోపది బిల్లులను గవర్నర్ తొక్కిపెట్టిన క్రమంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి మరియు ముఖ్యమంత్రి ఎం. కె. స్టాలిన్ మధ్య ఘర్షణలు మరింతగా చోటుచేసుకున్న పరిణామాలు సంభవించాయి. గతంలో ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్, పశ్చిమ బెంగాల్ గవర్నర్, కేరళగవర్నర్, పంజాబ్ గవర్నర్ మరియు తెలంగాణ గవర్నర్ మొదలైన వారు ఆయా రాష్ట్రప్రభుత్వాలతో వైరాలు కొనితెచ్చుకున్న ఘటనలు కళ్ళముందు కదలాడుతూనే ఉన్నాయి.ఇలా ఇంకా దేశంలోని అనేక రాష్ట్రాల్లో గవర్నర్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి విధేయులుగా వ్యవహరిస్తుండటం వల్ల తరచూ వివాదాలు చెలరేగుతున్నాయి. ముఖ్యంగా గతంలో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై అనుసరిస్తున్న నిరంకుశ అప్రజాస్వామిక విధానాలని నిరశిస్తూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సి.పి.ఐ) చలో రాజభవన్‌కార్యక్రమానికికి పిలుపు ఇచ్చి ఏకంగా గవర్నర్ వ్యవస్థని రద్దు చేయాలి అని నినదిస్తూపోరుబాట పట్టిన ఘటన ఇంకా తెలంగాణ ప్రజల కళ్ళ ముందు కదలాడుతూనే ఉంది.'రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ కు విచక్షణాధికారం లేదు.మంత్రిమండలి సలహాలు, సూచనల మేరకే నడుచుకోవాలి. ఏదైనా బిల్లు తన వద్దకువచ్చినప్పుడు గవర్నర్ బిల్లులకు ఆమోదం తెలపడం లేదా బిల్లులనుఆమోదించకపోవడం లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపించడం అనే మూడు ఆప్షన్లలో ఏదో ఒకదానిని తప్పనిసరిగా ఎంచుకోవాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఒరిజినల్ వెర్షన్ తో పోలిస్తేబిల్లులో మార్పులు లేకపోతే రెండో సారి తన వద్దకు వచ్చిన బిల్లుకు గవర్నర్ ఆమోదంతెలపాల్సి ఉంటుంది. గవర్నర్ ఆమోదం తెలపకుండా బిల్లులను రాష్ట్రపతికి రిజర్వ్ చేయకూడదు. రాజ్యాంగానికి, రాష్ట్ర విధాన నిర్దేశక సూత్రాలకు లేదా జాతీయ ప్రాముఖ్యతకలిగిన విషయానికి విరుద్ధంగా ఉంది అని తాను భావించే బిల్లులను మాత్రమే గవర్నర్రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వ్ చేయవచ్చు' అని ధర్మాసనం తీర్పులో ప్రముఖంగాపేర్కొనడాన్ని గమనించవచ్చు.ఈ తీర్పు ద్వారా బిల్లుల ఆమోదానికి ధర్మాసనం నిర్ణీత కాలవ్యవధులనిసూచించడం గొప్ప మైలురాయిగా నిలుస్తుంది. 'గవర్నర్లు బిల్లుకు ఆమోదం తెలపకుండా ఒక నెల గడువును కేటాయించి మంత్రి మండలి సహాయం మరియు సలహాతో రాష్ట్రపతిసమీక్షకు రిజర్వ్ చేయాలి. మంత్రి మండలి సహాయం మరియు సలహా లేకుండా బిల్లునురిజర్వ్ చేసినప్పుడు ఈ గడువు మూడు నెలలు. రాష్ట్ర అసెంబ్లీ పునఃపరిశీలన తర్వాతబిల్లును గవర్నర్‌కు సమర్పించినట్లయితే ఒక నెలలోపు దానిని ఆమోదించాలి. 10బిల్లులను రాష్ట్రపతికి రిజర్వ్ చేయాలన్న తమిళనాడు గవర్నర్ అర్.ఎన్. రవి చర్యచట్టవిరుద్ధం మరియు ఏకపక్షం. ఈ బిల్లులను ఆ గవర్నర్‌కు తిరిగి సమర్పించిన తేదీ నుండి ఆమోదం పొందినట్లు పరిగణించబడుతాయి' అని ధర్మాసనం తీర్పునివెలువరించడాన్ని తమిళనాడు ప్రభుత్వం సాధించిన అతి పెద్ద విజయంగా పేర్కొనవచ్చు.గవర్నర్లు కావాలని సమస్యలు సృష్టించకుండా ప్రజాస్వామికంగా వ్యవహరిస్తేఏవిధమైన సమస్యలు ఉత్పన్నం కానేకావు. పైగా ప్రభుత్వాలు కోర్టులకు రావలసినఅవసరం ఎంతమాత్రం ఉండదు. గవర్నర్లు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరించాలే తప్పకేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి ఏవిధంగాను విధేయులుగా వ్యవహరించకూడదు.అందువలన ఇకనైననూ ఆయా గవర్నర్లు తమ తమ రాజకీయాలకు అతీతంగావ్యవహరిస్తూ ప్రజాస్వామిక దృక్పథంతో రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన తక్షణ కర్తవ్యం ఎంతైనా ఉంది.

– జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్,
సెల్: 94933 19690.

ఉనికిని చాటిన భావ వ్యక్తీకరణ

భక్తి

కార్పణ్య దోషోపహత స్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తే?హం శాధి మాం త్వాం ప్రపన్నమ్

'కృష్ణా! నేను కార్పణ్య (పిరికితనము) దోషానికి లోనై, నా స్వభావానికి దూరమయ్యాను. ధర్మాధర్మ విచక్షణ జ్ఞానం లోపించి కర్తవ్యాన్ని నిర్ణయించుకోలేక పోతున్నాను. నేనిప్పుడు నీకు శిష్యుడిని. శిష్య వాత్సల్యతతో నాకేది శ్రేయస్కరమో దానిని ఉపదేశించు' అంటున్నాడు, అర్జునుడు. సర్వసమర్పణ భావనతో పార్థుడు తన సమస్యను పరమాత్మకు నివేదించాడు.

అర్జునుని మాటలు సమంజసంగా కనిపి

బెండకాయ నీళ్లతో ఇన్ని లాభాలా..!

బెండకాయలను చిన్న ముక్కలుగా కోసి వెడల్పాటి గిన్నెలో వేయాలి. అవి మునిగేవరకూ నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. తెల్లారిన తరవాత మరో గిన్నెలోకి వడబోయాలి. ఈ నీటినే బెండకాయ నీళ్లు లేదా ఓక్రా వాటర్ అంటారు. ఈ నీటిని తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...బెండకాయ నీళ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి అకాల వార్ధక్యాన్ని నివారిస్తాయి. చర్మం మీద ముడతలు, ముఖం మీద

మొటిమలు రాకుండా కాపాడతాయి. గుండె జబ్బులు రావు.

బెండకాయ నీళ్లు తాగడం వల్ల సి, కె విటమిన్లు లభిస్తాయి. ఇవి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీనివల్ల చర్మం బిగుతుగా మృదువుగా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

మలబద్ధకం రాదు. పేగులు ఆరోగ్యంగా ఉంటాయి. జీర్ణ శక్తి పెరుగుతుంది. కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది.

రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. మధుమేహ సమస్యలు తలెత్తవు.

బెండకాయ నీళ్లలో ఫైబర్ కరిగి ఉంటుంది. ఈ నీటిని తాగితే చాలాసేపటివరకూ కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల అతిగా తినాలని అనిపించదు. శరీర బరువు అదుపులో ఉంటుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

హలో అమ్మా!

పెళ్లయ్యాక అమ్మ చేతి రుచులకు దూరమైన ఓ అమ్మాయి... తల్లి సూచనలతో సంప్రదాయ వంటకాల తయారీలో నిష్ణాతురాలయ్యారు. ఫుడ్ కంటెంట్ క్రియేటర్‌గా సోషల్ మీడియాలో దూసుకెళ్తున్నారు. ఏడాదిన్నర కాలంలో మూడున్నర లక్షలకు పైగా ఫాలోవర్స్‌ను సంపాదించుకున్న అర్పిత దాస్ ప్రయాణం గురించి, ప్రయోగాల గురించి ఆమె మాటల్లోనే...

"కొత్త కాపురం మొదలుపెట్టాక... ప్రతి అమ్మాయి మిస్ అయ్యే వాటిలో ప్రధానమైనది... అమ్మ చేతి వంట. ఇల్లాలుగా వంటిల్లు పూర్తిగా తన చేతుల్లోకి వచ్చేస్తుంది. వంటలో ఎంతో కొంత అనుభవం ఉన్నా... 'ఏది చెయ్యాలి? ఎలా చెయ్యాలి?' అనేది ఎప్పుడూ ప్రశ్నే. అందుకే 'హలో అమ్మా!' అంటూ తల్లికి కాల్ చేసి, ఇంటి వంటకాల తయారీ గురించి సందేహాలను అడగడం దాదాపు రోజూ జరుగుతూనే ఉంటుంది. అందుకు నేను మినహాయింపు కాదు.

అందుకే ధైర్యం చేశాను...

మాది పశ్చిమబెంగాల్‌లోని హౌరాకు చెందిన జమీందారీ కుటుంబం. సంస్కృతి, సంప్రదాయాల మధ్య పెరిగాను. సృజనాత్మకంగా ఏదో చెయ్యాలనే తాపత్రయం నాకు చిన్నప్పటి నుంచీ ఉండేది. 'బ్యాచిలర్ ఆఫ్ ఫైనార్ట్స్' (బిఎఫఎ) పూర్తి చేశాను. పెయింటింగ్స్ వేసేదాన్ని, డిజైనింగ్ చేసేదాన్ని, కథలు రాసేదాన్ని. గొప్ప జీవిత లక్ష్యాలేవీ లేకుండా... కుటుంబ సభ్యులతో, స్నేహితులతో రోజుల్ని సరదాగా గడిపేసేదాన్ని. అలాంటి నేను.... సింగపూర్‌లో డాక్టర్‌గా పని చేస్తున్న సౌమిక్‌తో పెళ్ళయ్యాక... పూర్తిగా భిన్నమైన ప్రపంచంలోకి అడుగు పెట్టాను. మిగిలినవన్నీ బాగానే ఉన్నా... నా పుట్టింటి రుచులకు దూరమయ్యాననే అసంతృప్తి ఉండేది. హౌరాలోని మా ఇంట్లో ఎంతోమంది పనివారు ఉండేవారు. కానీ వంట మాత్రం అమ్మే చేసేది. అమ్మ ఏది చేసినా బ్రహ్మాండంగా ఉండేది. ఏది అడిగినా విసుక్కోకుండా చేసి పెట్టేది. సింగపూర్‌లో అది ఎలా సాధ్యమవుతుంది? రోజూ అమ్మకు వీడియో కాల్ చేసి, ఆమె చెప్పిన వంట పద్ధతులు అనుసరించేదాన్ని. ఆ వంటకాలు నా భర్తకు కూడా బాగా నచ్చాయి. తీరిక సమయాల్లో కొన్ని యూట్యూబ్ వీడియోలు చూస్తున్నప్పుడు... సంప్రదాయికమైన బెంగాలీ వంటకాల గురించి సాధికారికంగా వివరించేవి పెద్దగా కనిపించలేదు.

అమ్మ చెప్పే రెసిపీలతో వీడియోలు చేయాలనిపించింది. అంతకుముందు నా పర్యాటక అనుభవాలను, పెయింటింగ్స్ ను సోషల్ మీడియాలో పంచుకున్నాను. వీడియో ఎడిటింగ్ తెలుసు. కాబట్టి ధైర్యం చేశాను. అందరూ చేసుకోగలిగే పద్ధతిలో ఫిష్ ఫ్రై చేసి... ఫేస్‌బుక్‌లో ఉంచాను. నా కుటుంబం, పరిచయస్తులు మాత్రమే దాన్ని చూస్తారనుకున్నాను. కానీ రాత్రికి రాత్రి అది వైరల్ అయింది. కొన్ని గంటల్లోనే లక్షల్లో వ్యూస్ వచ్చాయి. ఇది నేను ఊహించలేదు. అప్పుడే ఫుడ్ కంటెంట్ క్రియేటర్‌గా మారాలనే ఆలోచన వచ్చింది. 'ఇక తగ్గేదిలే' అనుకున్నా.

మొక్కుబడిగా కాకుండా...

అప్పటి నుంచి సంప్రదాయికమైన బెంగాలీ వంటకాలు, ఇంట్లో సులువుగా వండుకోగలిగే పదార్థాలు... ఇంకా చాలా వాటిని తయారు చేసి 'వీకెండ్ ఫ్లేవర్స్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం ప్రారంభించాను. ఒక్కొక్క పోస్ట్ పెడుతూ ఉంటే... వాటికి వీక్షకుల నుంచి వచ్చిన స్పందన నాలో సంతోషంతో పాటు ఉద్వేగాన్ని కూడా కలిగించింది. 'ఎప్పుడో చిన్నప్పుడు తిన్నాం. అవి ఎలా చెయ్యాలో మీరు చూపిస్తూ ఉంటే... వెంటనే ట్రై చేసేద్దామనిపిస్తోంది' అని కొందరు... 'ఆ వంటకం ఎలా చెయ్యాలో చెప్తారా' అని మరికొందరు, 'పేరు గుర్తు లేదు కానీ... ఈ దినుసులతో చేస్తారని మాత్రం తెలుసు. అదేమిటో చెప్తారా, ప్లీజ్?' అని ఇంకొందరు చెబుతూ ఉంటే... రెట్టించిన ఉత్సాహంతో, అమ్మ మార్గదర్శకత్వంతో వరుసగా వీడియోలు చేశాను. కనీసం వారానికి ఒక వీడియో పోస్ట్ చెయ్యాలనేది నియమంగా పెట్టుకున్నాను. సంప్రదాయ వంటకాలకు ఆధునికమైన మెరుగులు దిద్దడం, ఇతర ప్రాంతాలకు చెందిన వంటకాలను బెంగాలీ పద్ధతిలో చేయడం, పిజ్జాలు, బర్గర్స్ లాంటి వాటిలో పాత రుచుల్ని మేళవించడం... ఇలా పలు ప్రయోగాలు చేస్తున్నాను.

అమ్మ చేసిన వంటల తయారీ గురించి ఆమెను అడుగుతున్నట్టు... నా వీడియోలన్నీ 'హలో అమ్మా!' అని ప్రారంభమవుతాయి. ఇది వీక్షకులందరికీ నచ్చింది. ఏదో మొక్కుబడిగా చెబుతున్నట్టు కాకుండా... చూస్తున్నవారికి ఆకట్టుకొనేలా మాట్లాడడానికి ప్రయత్నిస్తాను. రచయిత్రిగా నాకున్న కాస్త అనుభవం దీనికి పనికొస్తోంది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో నాకు మూడున్నర లక్షల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఎక్కడికైనా వెళ్ళినప్పుడు నన్ను జనం గుర్తుపట్టి పలకరిస్తున్నారు. నేను ఎన్నడూ ఊహించని ఈ ప్రయాణం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. ఆహారం కేవలం కడుపు నింపుకోవడానికి మాత్రమే కాదు. దాని వెనుక ఎన్నో జ్ఞాపకాలు ఉంటాయి. భావోద్వేగాలుంటాయి. అది మనుషుల్ని దగ్గర చేస్తుంది. నా కంటెంట్‌ను చూసేవారు తమ ఇంట్లో తిన్న పాత రుచుల్ని గుర్తు తెచ్చుకుంటే... నా ప్రయత్నం సఫలమైనట్టే.

మూత్రం నలుపు రంగులో ఉందా

కొన్ని రుగ్మతలు చిత్రమైన లక్షణాల ద్వారా బయల్పడుతూ ఉంటాయి. అల్కాప్టోనూరియా ఈ కోవకు చెందినదే! హెమోజెన్టిసేట్ అనే ఎంజైమ్ లోపంతో తలెత్తే ఈ రుగ్మత 'నల్లని మూత్రం'తో బయల్పడుతూ ఉంటుంది. మరిన్ని విషయాలు తెలుసుకుందాం!

అల్కాప్టోనూరియా, అత్యంత అరుదైన జన్యు సమస్య. ఇది అంతిమంగా కీళ్ల జబ్బులు, మూత్రపిండాల్లో రాళ్ల సమస్యకు దారి తీస్తుంది. శరీరంలోని హెమోజెన్టిసిక్ ఆమ్లం విచ్ఛిన్నానికి హెమోజెన్టిసేట్ అనే ఈ ఎంజైమ్ అవసరం. ఈ ఎంజైమ్ లోపించినప్పుడు, హెమోజెన్టిసిక్ ఆమ్లం శరీరంలో పెరిగిపోయి, మూత్రం ద్వారా బయటకు వచ్చేస్తూ ఉంటుంది. మూత్రం గాలికి బహిర్గతమైనప్పుడు దాన్లోని ఆమ్లం గాలితో ప్రతిచర్య జరిపి, మూత్రం నలుపు రంగులోకి మారిపోతుంది. అల్కాప్టోనూరియాలో కనిపించే ప్రధాన లక్షణమిది. ఈ లక్షణాన్ని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలంలో ఈ పరిస్థితి కణజాలం దెబ్బతినే ఓక్రోనోసిస్ అనే సమస్యకు దారి తీస్తుంది.

దీర్ఘకాల సమస్యలు..కీళ్ల క్షీణత: మృదులాస్థిలో పేరుకునే హెమోజిన్టిసిక్ ఆమ్ల నిల్వల మూలంగా కీళ్లు పెళుసుగా మారి, సులభంగా విరిగిపోతాయి. 30 నుంచి 40 ఏళ్ల లోపే ప్రత్యేకించి వెన్ను, తుంటి, మోకీళ్లు తీవ్ర ఆర్థయిటిసకు లోనవుతాయి.

మూత్రపిండాల్లో, ప్రోస్టేట్‌లో రాళ్లు: మూత్రపిండాల్లో, ప్రోస్టేట్‌లో స్ఫటికాల్లా ఏర్పడే హెమోహెమోజినిస్టిక్ ఆమ్లం అంతిమంగా రాళ్ల రూపాన్ని సంతరించుకుంటుంది.

మంగు: చర్మం పైన, కనుగుడ్లలోని తెల్లని భాగాల్లో మంగు మచ్చలు ఏర్పడతాయి.

నిర్ధారణ

ప్రస్తుతం ఈ రుగ్మతను సమర్థంగా సరిదిద్దే చికిత్సలు అందుబాటులో లేకపోయినా, లక్షణాలను నియంత్రించడం ద్వారా రోగుల జీవనాణ్యతను మెరుగుపరుచుకునే వీలుంది. నొప్పి నుంచి ఉపశమనం, కీళ్ల పనితీరును మెరుగ్గా ఉంచుకోవడం, మూత్రపిండాలు, ప్రోస్టేట్ పనితీరులను ఓ కంట కనిపెడుతూ ఉండడం ప్రధానమని వైద్యులు సూచిస్తున్నారు.

ఇంటిపైనే వాతావరణ కేంద్రం

ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడు ఇంటి పనులు మొదలుపెడతారు. ధాన్యం ఆరబెడతారు. దుస్తులు ఆరేస్తారు. ఎండ వచ్చిందంటే ఎవరి పనులు వాళ్లు చేసుకుంటారు. ఎండ ముదిరితే ఎవరింట్లో వాళ్లు ఉండిపోతారు. మబ్బులు కమ్ముకుని గాలి చల్లబడితే వీధులు జల ప్రవాహాలవుతాయి. వాన వచ్చిందంటే వరద రాకుండా జాగ్రత్త పడతారు. కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్‌లాగా వాతావరణం పని వేళల్ని నిర్దేశిస్తున్నది. ఈ మౌలిక సూత్రాన్ని ఆధారంగా చేసుకొని రూపుదిద్దుకున్నదే 'ఆరాష్యూర్'. వాతావరణ మార్పులు మాత్రమే కాదు, ప్రకృతి విపత్తుల గురించి కూడా హెచ్చరిస్తుంది ఈ స్మార్ట్ డివైస్.

ఆకాంక్ష

సైనిక కుటుంబంలో పుట్టింది. దేశంలో వివిధ ప్రాంతాల్లో పెరిగింది. ఆమె ఇల్లు, స్కూలు చుట్టూ పచ్చని వనాలు ఉండేవి. చల్లటి గాలుల మధ్య ఆమె బాల్యం గడిచింది. పెద్దయ్యాక బీటెక్ చదివేందుకు రూర్కెలా ఎన్ఐటీలో చేరింది. అక్కడికి వచ్చినప్పుడే ఆమెకు గాలిలో మొదటిసారి ఏదో తేడా అనిపించింది. రూర్కెలా ఎన్ఐటీకే కాదు స్టీల్ పరిశ్రమకు కూడా ప్రసిద్ధి. దానివల్ల ఆ పట్టణంలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉందని గుర్తించింది. ఈలోగా ఆకాంక్ష తల్లి ఆస్తమా బారినపడింది. తన స్నేహితులు కూడా ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడేవాళ్లు. ఇంజినీరింగ్ విద్యార్థినిగా ఈ సమస్యకు ఏదైనా పరిష్కారం కనుగొనాలని భావించిందామె.

ఉక్కు సంకల్పం

రూర్కెలా ఉక్కు పరిశ్రమకు అనుబంధంగా చుట్టూ చాలా చిన్న, మధ్య పరిశ్రమలున్నాయి. వాటన్నిటి నుంచి విడుదలయ్యే వాయువుల వల్ల, ధూళి కణాల వల్ల గాలి కలుషితమవుతుంది. దీనిని కాలుష్య నియంత్రణ మండలి కానీ, కంపెనీలు కానీ సరిగా గుర్తించలేకపోతున్నాయి. అమెరికాలోని ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ధ్రువీకరించిన కాలుష్య తీవ్రతను గుర్తించే ఉపకరణాలు ఖరీదైనవి. వాటి వినియోగం అంతంత మాత్రంగానే ఉండటంతో.. వివిధ ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఎంతుందో తెలుసుకునే అవకాశమే లేకుండా ఉంది. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనడమే లక్ష్యంగా పెట్టుకుంది ఆకాంక్ష. కొవిడ్ తర్వాత.. రెండున్నర కోట్ల రూపాయలతో చిన్న పరిశ్రమను నెలకొల్పింది. తక్కువ ఖర్చుతో వాతావరణాన్ని విశ్లేషించే ఉపకరణం (డివైస్) రూపకల్పన మొదలుపెట్టింది. ఒడిశా ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి, భారత వాతావరణ శాఖ, ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ ముంబయి, కొలంబియా యూనివర్సిటీ సహకారంతో పరిశోధనలు చేసింది. వాతావరణ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల సహకారంతో కలిసి 'ఆరాష్యూర్' డివైస్‌ని రూపొందించింది ఆకాంక్ష బృందం.

ఎప్పటికప్పుడు హెచ్చరికలు

పారిశ్రామిక ప్రాంతాల్లో గాలి కాలుష్యం సాధారణమే. దానిని నియంత్రణలో ఉంచాలంటే కచ్చితమైన లెక్క తేలాలి. అప్పుడే సమీపంలో నివసించే ప్రజల రక్షణ, కాలుష్య నియంత్రణ సులభమవుతుంది. గాలిలో పీఎం 10, పీఎం 2.5 రేణువులు ఎంత శాతం ఉన్నాయో ఆరాష్యూర్‌లోని సెన్సర్లు లెక్కిస్తాయి. ఘన వ్యర్థాలతోపాటు నైట్రోజన్ ఆక్సైడ్, ఓజోన్, కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, మీథేన్ ఎంత పరిమాణంలో ఉన్నాయో పసిగడతాయి. అంతేకాదు పరిశ్రమల నుంచి ఏవైనా హానికారక వాయువులు వెలువడితే పసిగట్టి వెంటనే ప్రమాద హెచ్చరికలు పంపుతాయి. గాలి నాణ్యతను ఎప్పటికప్పుడూ పరీక్షిస్తూ సమాచారం అందిస్తాయి.

వాతావరణ సమాచారాన్నీ చేరవేస్తాయి. ఆరాష్యూర్ డివైస్ అమర్చిన ప్రదేశంలో ఉపరితల కాంతి (సూర్యకాంతి, లైట్ల కాంతి), శబ్ద తీవ్రత (డెసిబుల్)లను ఇందులోని సెన్సర్లు చెబుతాయి. అలాగే ఉష్ణోగ్రత, గాలిలో తేమ, వర్షపాతం, గాలి పీడనం, గాలి వేగం, గాలి వీచే దిశను కూడా గుర్తిస్తుంది. ఈ డేటా మొత్తాన్ని విశ్లేషించి, సాఫ్ట్‌వేర్ సాయంతో వినియోగదారులకు వాతావరణ హెచ్చరికలు పంపిస్తుంది. భువనేశ్వర్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా విజయవంతమైన ఈ ఆరాష్యూర్ ఢిల్లీ, చెన్నై, ముంబయి, బెంగళూరు, రూర్కెలాతోపాటు మరెన్నో నగరాల్లో వాడుకలోకి వచ్చింది. త్వరలో దేశమంతటా దీని సేవలు విస్తరిస్తే కాలుష్య తీవ్రతను అంచనా వేసి, నియంత్రణ చర్యలు చేపట్టవచ్చు. ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చు.

ఇలా పనిచేస్తుంది

ఆరాష్యూర్‌లో అనేక సెన్సర్లు ఉంటాయి. ఇవి గాలి నాణ్యతతోపాటు వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు లెక్కిస్తుంటాయి. ఈ డివైస్ విద్యుత్ బ్యాటరీ సాయంతో నిరంతరం పనిచేస్తూ ఉంటుంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు ఇందులోని సోలార్ ప్యానెల్ ద్వారా పనిచేస్తుంది. ఎవరైనా ఈ డివైస్‌ని ఎత్తుకుపోయేందుకు లేదా ఆఫ్ చేసేందుకు ప్రయత్నించినా ఇందులోని సెన్సర్లు పసిగడతాయి. ఇంటర్నెట్ ద్వారా ఈ డివైస్ ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ పరిస్థితులను, గాలి నాణ్యతను విశ్లేషించి సమాచారం చేరవేస్తుంది.

బొమ్మను చేసి... ఉపాధిగా మలచి

బెంగళూరుకి చెందిన వీణా పీటర్‌కు బొమ్మలంటే ఇష్టం. కూతురు తార కోసం సరదాగా తయారు చేసిన బొమ్మ ఓ వ్యాపార సంస్థ ప్రారంభానికి నాంది పలికింది. అదే 'తారాస్ డాల్ హౌస్'. పర్యావరణానికి అనుకూలంగా ఉండే రకరకాల బొమ్మలను రూపొందించడం ఈ సంస్థ ప్రత్యేకత. అంతేకాదు ఎంతోమంది మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రస్తుతం కోటి రూపాయల టర్నోవర్ దిశగా సాగుతోంది. ఈ సంస్థకు సంబంధించి ఆసక్తికరమైన విశేషాలను వీణ ఇలా చెప్పుకొచ్చారు...

"సాధారణంగా ఆడపిల్లలు పొడవాటి జడ ఉన్న అమ్మాయి బొమ్మతో ఆడుకోవడానికి ఇష్టపడతారు. నా కూతురికి కూడా అలాంటి బొమ్మ కొనాలని చాలా షాపులు తిరిగాను. ఎక్కడా దొరకలేదు. ఓ షాపులో చిన్న జడ ఉన్న అమ్మాయి బొమ్మ కనిపిస్తే వెంటనే కొని ఇంటికి తీసుకెళ్లాను. మా అమ్మాయి చేతిలో ఆ బొమ్మ ఎక్కువ కాలం నిలవలేదు. నాకు బాధగా అనిపించింది. మార్కెట్లో దొరికే బొమ్మలన్నీ ఇలా త్వరగా విరిగిపోతుండడంతో నేనే ఒక బొమ్మను తయారు చేయాలని అనుకున్నా. ఇంట్లో ఉన్న పలుచని వస్త్రాలను ఉపయోగించి ఒక అమ్మాయి బొమ్మను తయారు చేశాను. పొడవైన ఊలు దారాలతో జడను రూపొందించాను. బొమ్మకు చక్కగా డ్రెస్ కుట్టి తొడిగాను. ఈ బొమ్మను చూసి మా అమ్మాయి చాలా సంతోషించింది. చాలా రోజుల వరకూ దానితోనే ఆడుకుంది కూడా. దీంతో ఇలాంటి బొమ్మల తయారీ ప్రారంభించాలనే ఆలోచన వచ్చింది. వెంటనే 2022లో తారాస్ డాల్ హౌస్‌ని ఏర్పాటు చేశాను.

తయారీ ఇలా...

అమ్మాయి బొమ్మలతో పాటు అబ్బాయి బొమ్మలను కూడా తయారు చేస్తాం. బొమ్మలను తయారు చేయడానికి నాణ్యమైన మెత్తని బట్టలను ఉపయోగిస్తాం. బొమ్మల తయారీకి కావాల్సిన ముడిపదార్థాలు, వాటికి తొడిగే దుస్తులకోసం అవసరమయ్యే వస్త్రాలను ఢిల్లీ, సూరత్‌ల నుంచి తెప్పించుకుంటాం. చర్మం రంగు... మూడు రకాల టోన్లలో ఉండేలా బొమ్మలను రూపొందిస్తాం. అలాగే తల వెంట్రుకలను నాలుగు వేర్వేరు రంగుల్లో తీర్చిదిద్దుతాం. ప్రస్తుతం ఆరు, పన్నెండు, పద్దెనిమిది అంగుళాల పొడవున్న బొమ్మలను రూపొందిస్తున్నాము. పిల్లల అభిరుచిని దృష్టిలో ఉంచుకుని ట్రావెల్ డాల్ హౌస్‌లు, స్లింగ్ బ్యాగ్ డాల్ క్యారియర్లు, డాల్ టెంట్లు, బొమ్మల వార్డ్‌రోబ్ సెట్‌లు కూడా తయారుచేస్తున్నాము. మా బొమ్మలకు ఢిల్లీ, పుణె, అహ్మదాబాద్, హైదరాబాద్, చెన్నై నగరాల్లో మంచి ఆదరణ ఉంది.

పర్యావరణ హితం...

బొమ్మల తయారీలో ప్లాస్టిక్, హానికరమైన రసాయన రంగులను ఉపయోగించము. స్టెన్సిల్ ట్రేసింగ్, కత్తిరించడం, కుట్టడం, తలకు వెంట్రుకలు అతికించడం, దుస్తులు కుట్టడం లాంటి ప్రక్రియలన్నింటినీ అత్యంత జాగ్రత్తగా నిర్వహిస్తాము. పిల్లలు ఎంతకాలం ఆడుకున్నప్పటికీ బొమ్మలు మన్నికగా ఉండేలా రూపొందిస్తాము.

మహిళా సాధికారతకు...

ప్రస్తుతం నెలవారీ 200 నుంచి 300 వరకు బొమ్మలు అమ్ముడవుతున్నాయి. వీటి నుంచి రెండు లక్షల వరకు ఆదాయం వస్తోంది. త్వరలో ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను ప్రారంభించాలనుకుంటున్నాము. అమెరికా సహా ఇతర పశ్చిమ దేశాల్లో వ్యాపారాన్ని విస్తరించాలనుకుంటున్నాము. దీనికి కొంత సమయం పట్టవచ్చు. తారాస్ డాల్ హౌస్ సంస్థ మహిళల సాధికారతకు ప్రాధాన్యమిస్తుంది. టైలరింగ్, బొమ్మల తయారీ, మార్కెటింగ్ విభాగాల్లో పూర్తిగా మహిళలే పనిచేస్తున్నారు. సంస్థ సహవ్యవస్థాపకుల్లో ఒకరు తప్ప మొత్తం బృంద సభ్యులంతా మహిళలే. నా అభిరుచి మరికొంతమంది మహిళలకు ఉపాధి మార్గం అయినందుకు ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉంది. భవిష్యత్తులో మరింతమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తా."

ఇంట్లో దుమ్ము చేరితే

సాధారణంగా ఇంట్లో చీపురుతో ఊడుస్తూ ఉంటాం. దీనివల్ల కొన్ని దుమ్ము కణాలు పైకి లేచి పక్కనే ఉన్న వస్తువులపై పడుతుంటాయి. నేలమీద కూడా కొన్ని కణాలు అలాగే మిగిలి ఉంటాయి. చీపురుతో కాకుండా వ్యాక్యూమ్ క్లీనర్‌తో ఇంటిని శుభ్రం చేస్తే దుమ్ము పూర్తిగా తొలగిపోతుంది. అలాగే వారానికి ఒకసారి ఇంటిని తడిగుడ్డతో తుడవాలి.

చెప్పులు, షూస్ లాంటివి ఎక్కువగా దుమ్మును ఇంట్లోకి తీసుకొస్తాయి. వీటిని ఇంటి బయటే వదలడం వల్ల సగం సమస్య తీరుతుంది. మూడు రోజులకు ఒకసారి డోర్‌మ్యాట్, కార్పెట్ లాంటివాటిని వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి. కొంతమంది ఇంట్లో కూడా చెప్పులు వేసుకుని నడుస్తూ ఉంటారు. ఈ చెప్పులను బయటికి వేసుకెళ్లకుండా ఇంట్లోనే వాడుకుంటూ ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి.

ఇంట్లో దుప్పట్లు, సోఫా కవర్లు, కర్టెన్ల మీద ఎక్కువగా దుమ్ము పడుతూ ఉంటుంది. వీటిని తీసి గట్టిగా దులిపి మళ్లీ వేస్తూ ఉంటారు. ఇలా దులిపినప్పుడు దుమ్ము కణాలు లేచి ఇల్లంతా వ్యాపిస్తాయి. కాబట్టి వీటిని దులపకుండా వారానికి ఒకసారి సబ్బు నీళ్లలో నానబెట్టి ఉతకడం మంచిది.

ఇంటి తలుపులు, వెంటిలేటర్లు, కిటికీల మూలలు, వాటి ఊచల మీద కూడా విపరీతంగా దుమ్ము నిలుస్తూ ఉంటుంది.

డెటాల్ లేదా సబ్బు నీళ్లలో ముంచిన గుడ్డతో వీటిని తరచూ తుడుస్తుంటే ఆ ప్రదేశాల్లో దుమ్ము పేరుకోదు.

ఇంట్లో ఉండే అరల్లో ఎక్కువగా దుమ్ము, ధూళి చేరుతూ ఉంటాయి. పదిహేను రోజులకు ఓసారి క్లీనింగ్ డస్టర్ సహాయంతో వీటిని శుభ్రం చేస్తే సరిపోతుంది.

భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

న్యూఢిల్లీ-నవభూమి: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాల్లో ముగిశాయి. ప్రతీకార సుంకాల అమలును వాయిదా వేస్తున్నట్లు అమెరికా ప్రకటించిన నేపథ్యంలో సూచీలు దూసుకెళ్లాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ దాదాపు వెయ్యి పాయింట్ల వరకు పెరిగింది. చివరి వరకు అదే జోరును కొనసాగించింది. జూలై 9 వరకు అదనపు సుంకాలను అమలును వాయిదా వేస్తున్నట్లు అగ్రరాజ్యం ప్రకటించింది. ఏప్రిల్ 2న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాకు వస్తువులను ఎగుమతి చేసే భారత్ సహా 60 దేశాలపై సుంకాలను విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మార్కెట్లలో ర్యాలీ కొనసాగింది. ఉదయం సెన్సెక్స్ 74,835.49 వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 74,762.84 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. 75,467.33 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 1,310.11 పాయింట్ల లాభంతో 75,157.26 వద్ద ముగిసింది. నిఫ్టీ 429.40 పాయింట్లు పెరిగి 22,828.55 వద్ద స్థిరపడింది. దాదాపు 3,006 షేర్లు లాభపడ్డాయి, 807 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో హిందాల్కో ఇండస్ట్రీస్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, కోల్ ఇండియా, జియో ఫైనాన్షియల్ భారీగా లాభాలను ఆర్జించాయి. టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, అపోలో హాస్పిటల్స్ నష్టపోయాయి. మెటల్ ఇండెక్స్ 4 శాతం పెరగ్గా.. ఆటో, ఆయిల్, గ్యాస్, పవర్, పీఎస్‌యూ, టెలికాం, ఫార్మా ఒక్కొక్కటి రెండుశాతం పెరగడంతో అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.8 శాతం పెరిగింది. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 3 శాతం వృద్ధిని నమోదు చేసింది.

చైనాపై బాదుడే బాదుడు.. 145 శాతానికి పెరిగిన ట్రంప్ టారిఫ్‌లు

అమెరికా-నవభూమి: అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతోంది. డ్రాగన్‌పై అధ్యక్షుడు ట్రంప్ సుంకాల మోత మోగిస్తున్నారు. తాజాగా చైనాపై మరో 20 శాతం అదనపు టారిఫ్‌లు విధించారు. దీంతో ప్రస్తుతం చైనా దిగుమతులపై అమెరికా విధించిన ప్రతీకార సుంకం 145 శాతానికి చేరుకుంది.కాగా, బుధవారానికి 125 శాతమని అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనగా.. గురువారం నాటికి అవి 145 శాతానికి పెరిగినట్లు శ్వేతసౌధం తాజాగా ప్రకటించింది. ఫెంటానిల్ అక్రమ రవాణాలో చైనా పాత్ర ఉందన్న ఆరోపణలకుగాను ప్రత్యేకంగా 20 శాతం సుంకాలు విధించినట్లు పేర్కొంది. ఫలితంగా 125 శాతంగా ఉన్న టారిఫ్‌లు కాస్తా 145కు పెరిగినట్లు వెల్లడించింది. ఇక అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చైనా ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు భారత్‌పై విధించిన 26శాతం అదనపు సుంకాల మినహాయింపు జులై 9వ వరకూ అమల్లో ఉంటుందని వైట్‌హౌస్ ఈ సందర్భంగా పేర్కొంది.గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకాన్ని విధించింది. ఇటీవల పెంచిన పన్నుతో ఇది 54 శాతానికి చేరుకున్నది. దీనిపై డ్రాగన్ దీటుగా స్పందించింది. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని నిర్ణయించింది . దీనిపై ఆగ్రహించిన ట్రంప్ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గాలంటూ డ్రాగన్‌కు వార్నింగ్ ఇచ్చారు. మరో 50 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో టారిఫ్‌లు 104 శాతానికి చేరాయి.అయినా చైనా వెనక్కి తగ్గలేదు. అమెరికాపై 84 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. ట్రంప్ హెచ్చరికలను చైనా పెడచెవిన పెట్టడంతో మళ్లీ అదనపు సుంకాల పోటు తప్పలేదు. చైనా నిర్ణయంతో ట్రంప్ బుధవారం మరో 21 శాతం బాదారు. దీంతో చైనాపై ప్రతీకార సుంకాలు 125 శాతానికి చేరింది. టక ఫెంటానిల్ అక్రమ రవాణాలో చైనా పాత్ర ఉందన్న ఆరోపణలకుగాను ప్రత్యేకంగా 20 శాతం సుంకాలు విధించడంతో మొత్తం టారిఫ్‌లు 145 శాతానికి చేరింది. మొత్తానికి ఈ పరస్పర సుంకాలతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత పెరిగినట్టైంది.

టారిఫ్‌లపై ట్రంప్ వెనుకడుగుకు.. బాండ్ మార్కెట్లే కారణమా?

అమెరికా-నవభూమి: టారిఫ్‌లపై ట్రంప్ వెనుకడుగు వేయడానికి బాండ్ మార్కెట్లే కారణమా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. అమెరికా ట్రెజరీ బాండ్లకు డిమాండ్ తగ్గి ఇన్వెస్టర్లు వాటిని కొనడానికి బదులుగా అమ్మకాలకు దిగుతుండటాన్ని గమనించా మని ట్రంప్ చెప్పారు. వ్యాపారులు, పార్టీ నేతలు తాత్కాలికంగా టారిఫ్‌లను వాయిదా వేయాలని కోరినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే టారిఫ్‌ల వాయిదా. కాగా, టారిఫ్‌ల వాయిదాతో బుధవారం అమెరికా ప్రభుత్వ బాండ్ల రేట్లు 3.9 శాతం నుంచి 4.5 శాతానికి పెరిగాయి. బాండ్లకు డిమాండ్ తగ్గితే అమెరికాకు నిధుల సమీకరణ కష్టతరమవుతుంది. ప్రభుత్వ ఖర్చుల నిర్వహణకూ ఇబ్బందే. ఇది చివరకు మాంద్యానికి దారితీయవచ్చు.

అంతర్జాతీయ మద్దతు కోసం చైనా

ప్రతీకార సుంకాల నుంచి చైనాకు మినహాయింపునివ్వకపోవడంతో అమెరికాతో వాణిజ్య యుద్ధం మొదలైనట్టైంది. చైనాపై అమెరికా టారిఫ్‌లు 145 శాతానికి పెరిగితే.. అమెరికాపైనా చైనా దీటుగానే స్పందిస్తు న్నది. అగ్రరాజ్యానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నది. అధిక సుంకాల ముప్పు ఉన్న యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలతో సంప్రదింపులు చేస్తున్నది. అలాగే ఆగ్నేయాసియా దేశాల ప్రభుత్వాలతోనూ చర్చలకు సిద్ధమవుతున్నది. అయితే చైనాతో సత్సంబంధాలు లేకపోవడంతో భారత్, ఆస్ట్రేలియాలు ఈ అంశంపై దూరంగా ఉంటున్నాయి. టారిఫ్‌ల ప్రభావం లేని రష్యా, మరికొన్ని దేశాలూ ఇంతే. దీంతో చైనా ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో వేచిచూడాల్సిందే.

చిన్న వ్యాపారులకు కష్టాలు

అమెరికా-చైనా ట్రేడ్‌వార్ నేపథ్యంలో చిన్న వ్యాపారులకు పెద్ద దెబ్బే తగులుతున్నది. ముఖ్యంగా అమెరికాలో చిరు వ్యాపారులపై ఈ ప్రభావం భారీగానే ఉండనున్నది. మునుపు చైనా నుంచి దిగుమతి చేసుకున్న వస్తూత్పత్తులకు 26,000 డాలర్లు చెల్లిస్తే.. ఇప్పుడు వాటికే 3.5 లక్షల డాలర్లు చెల్లించాల్సి వస్తున్నది మరి. ఈ నేపథ్యంలోనే తన కంపెనీ మూతబడే పరిస్థితి వచ్చిందని, నిలువ నీడకూడా లేకుండాపోయేలా ఉందని ఓ అమెరికన్ వ్యాపారి కన్నీటి పర్యంతమయ్యారు.

లులు' చేతికి మంజీరా మాల్

హైదరాబాద్-నవభూమి: దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న హైదరాబాద్, కూకట్‌పల్లిలోని మంజీరా మాల్ భవనం.. అంతర్జాతీయ రిటైల్ సంస్థ లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ పరమైంది. మంజీరా మాల్ రుణదాతలకు రూ.318.42 కోట్లు చెల్లించేందుకు లులు ఇంటర్నేషనల్ చేసిన ప్రతిపాదనకు రుణదాతల కమిటీ (సీఓసీ), ఎన్‌సీఎల్‌టీ, హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలపడంతో ఇది సాధ్యమైంది. ప్రస్తుతం ఇదే భవనంలో లులు మాల్ అద్దె పద్ధతిలో తన భారీ రిటైల్ మాల్ నిర్వహిస్తోంది. ఇప్పుడు ఏకంగా ఈ భారీ మాల్ భవనానికి యజమాని కాబోతోంది.2023లో దివాలా పిటిషన్ దాఖలు: మంజీరా మాల్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త జీ యోగానంద్ మంజీరా రిటైల్ హెూల్డింగ్స్ పేరుతో ప్రమోట్ చేశారు. అయితే తమకు చెల్లించాల్సిన రూ.317.30 కోట్ల బకాయిలను చెల్లించలేక పోవడంతో రుణదాతలైన క్యాటలిస్ట్ ట్రస్టీషిప్ లిమిటెడ్, ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ 2023 జూలైలో మంజీరా రిటైల్ హెూల్డింగ్స్‌పై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్‌లో దివాలా పిటిషన్ దాఖలు చేశాయి. మొత్తం 49 సంస్థలు ఈ మాల్‌పై ఆసక్తి చూపించినప్పటికీ చివరికి ఏడు సంస్థలు మాత్రమే పోటీలో నిలిచాయి. అందులో అత్యధికంగా కోట్ చేసిన లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ, సీఓసీ ఆమోదం తెలిపాయి.

ఆ 'ఇద్దరి' కొట్లాట.. చరిత్రలో తొలిసారి బంగారం ధరలు ఇలా.. ఒక్కసారిగా!

అమెరికా-నవభూమి: ప్రపంచ ఆర్థిక రంగంలో పెను ప్రకంపనలు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరుగుతున్న సుంకాల యుద్ధం తారస్థాయికి చేరడంతో బంగారం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. తాజాగా ఏప్రిల్ 11న సరికొత్త జీవనకాల గరిష్ట స్థాయిల్ని తాకాయి. చరిత్రలో తొలిసారిగా ఇవాళే ఇంటర్నేషనల్ మార్కెట్లో స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు (31.10 గ్రాములు) 3200 డాలర్ల మార్కు దాటింది. ప్రస్తుతం వార్త రాస్తున్న సమయంలో 3228 డాలర్ల వద్ద ఉంది. ఈక్రమంలోనే ఆల్ టైమ్ హై వాల్యూ నమోదు చేసింది. ఇలా రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తూ దూసుకెళ్తోంది.ట్రంప్ మొదట చైనాపై దిగుమతి సుంకాలను భారీగా పెంచగా, బీజింగ్ సైతం అంతే స్థాయిలో ప్రతిస్పందించింది. అమెరికా వస్తువులపై సుంకాలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ ఇద్దరు అగ్రనేతల పట్టుదల ప్రపంచ వాణిజ్యానికి పెను సవాలుగా మారింది. వాణిజ్య యుద్ధం, ఆర్థిక మాంద్యం భయాలు పెరిగిపోయాయి. దీంతో అనిశ్చితి నెలకొన్న మార్కెట్‌లో సురక్షిత పెట్టుబడి అయిన బంగారం వైపు మదుపరులు మొగ్గు చూపిస్తున్నారు. దీంతో ఆ ధరలు కూడా అందకుండా పోతున్నాయి.

ఫెడ్ వడ్డీ రేట్లు..బంగారం ధరలు ఇలా ఒక్కసారిగా పెరగడానికి కేవలం సుంకాల యుద్ధమే కాకుండా మరికొన్ని అంతర్జాతీయ అంశాలు కూడా దోహదం చేస్తున్నాయి. బలహీనమైన డాలర్, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ త్వరలో వడ్డీ రేట్లను తగ్గించవచ్చనే అంచనాలు, బాండ్ మార్కెట్‌లోని అస్థిరత కూడా పసిడి ధరలకు మరింత ఊతమిస్తున్నాయి. ముఖ్యంగా యూఎస్ సీపీఐ డేటా అంచనాల కంటే తక్కువగా రావడంతో ఫెడ్ భవిష్యత్ విధానంపై ట్రేడర్లలో ఆశలు చిగురించాయి.

హైదరాబాద్ గోల్డ్ రేట్లు..దేశీయంగానూ బంగారం ధరలు సరికొత్త శిఖరాలను తాకుతున్నాయి. ఎంసీఎక్స్‌లో బంగారం ధర.. జూన్ ఫ్యూచర్స్ ఒక్కసారిగా 1.41 శాతం పెరిగి 10 గ్రాముల ధర రూ. 93,736 వద్ద ఆల్ టైమ్ హైని చేరుకుంది. అంతకుముందు గురువారం కూడా బంగారం లాభాల్లోనే ముగిసింది. వెండి ధరలు కూడా అదే బాటలో పయనిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో చూసినట్లయితే 22 క్యారెట్ల గోల్డ్ రేటు తులం రూ. 87,450 కి చేరింది. ఇవాళ ఒక్కరోజే రూ. 1850 పెరగ్గా.. కిందటి రోజు రూ. 2700 ఎగబాకింది. ఇక 24 క్యారెట్ల స్వచ్ఛమైన పసిడి ధర 10 గ్రాములకు రూ. 95,400 కు చేరుకుంది.

మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, అమెరికా-చైనా మధ్య ఈ సుంకాల పోరు కొనసాగితే బంగారానికి మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉందని.. దీంతో రేట్లు ఇంకా గరిష్ట స్థాయిలకు వెళ్లొచ్చని తెలుస్తోంది. అనిశ్చిత ఆర్థిక పరిస్థితుల్లో బంగారం ఒక సురక్షితమైన ఆస్తిగా కొనసాగుతుందని వారు విశ్లేషిస్తున్నారు.

గూగుల్‌లో మళ్లీ లేఆఫ్స్ కలకలం.. ఈసారి వందలాది మంది ఇంటికి..!

న్యూఢిల్లీ-నవభూమి: మరోసారి లేఆఫ్స్ కలకలం రేగింది. టెక్ దిగ్గజం గూగుల్ ఈసారి ఉద్యోగాల కోతతో వార్తల్లో నిలిచింది. ఈసారి ఏకంగా తమ కీలకమైన ప్లాట్‌ఫామ్, డివైజెస్ యూనిట్‌పై కంపెనీ దృష్టి సారించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ ఫోన్‌లు, క్రోమ్ బ్రౌజర్‌లకు సంబంధించిన విభాగాల్లో పనిచేస్తున్న వందలాది మంది ఉద్యోగులను గూగుల్ సడెన్‌గా తొలగించింది. 'ది ఇన్ఫర్మేషన్' అనే మీడియా సంస్థ ఈ మేరకు కథనాన్ని వెల్లడించడంతో టెక్ పరిశ్రమలో ఒక్కసారిగా కలకలం రేగింది. అయితే, కచ్చితంగా ఎంత మంది ఉద్యోగులను తొలగించారనే దానిపై గూగుల్ అధికారికంగా స్పందించాల్సి ఉంది. అంతకుముందు మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటివి కూడా వేలాదిగా ఉద్యోగుల్ని తొలగించాయి. గూగుల్ ప్రతినిధి ఒక ప్రకటనలో మాట్లాడుతూ, గతేడాది ప్లాట్‌ఫామ్స్ %డ% డివైజెస్ బృందాలను విలీనం చేసినప్పటి నుంచి, మరింత వేగంగా పనిచేయడానికి, కార్యకలాపాలను మెరుగుపరచడానికి కంపెనీ నిరంతరం ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో, జనవరిలో స్వచ్ఛంద నిష్క్రమణ పథకాన్ని అందించడంతో పాటు, కొన్ని ఉద్యోగాల తగ్గింపులు కూడా అనివార్య మయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం ప్రధానంగా సంస్థాగత సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో తీసుకున్నట్లు తెలుస్తోంది.

గత రెండేళ్లలో గూగుల్ తన పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించింది. గతేడాది డిసెంబరులో మేనేజర్, డైరెక్టర్, వైస్ ప్రెసిడెంట్ స్థాయిల్లో పనిచేస్తున్న దాదాపు 10 శాతం మందికి లేఆఫ్ ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో హెచ్‌ఆర్ విభాగం, క్లౌడ్ ఆర్గనైజేషన్‌లో కూడా కొంతమంది ఉద్యోగులను తొలగించింది. ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగానే కంపెనీ ఈ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. 2022లో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ మాట్లాడుతూ, తమ ఉద్యోగుల్లో 20 శాతం మంది మరింత సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత ఏడాదిలోనే గూగుల్ ప్రపంచవ్యాప్తంగా దాదాపు 12 వేల మంది ఉద్యోగులను తొలగించడం గమనార్హం. ఓపెన్‌ఏఐ వంటి సంస్థలు సెర్చ్ ఇంజిన్ రంగంలో గూగుల్‌కు గట్టి పోటీని ఇస్తున్న నేపథ్యంలో ఈ తాజా తొలగింపులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, అమెరికాలో విదేశీ నిపుణులపై ట్రంప్ కఠిన నిబంధనలు అమలు చేస్తున్న సమయంలో ఈ లేఆఫ్ వార్తలు రావడం మరింత చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా, మరో టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కూడా మే నెలలో మరిన్ని ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతోందనే కథనాలు వినిపిస్తున్నాయి.ఈ వరుస ఉద్యోగాల తొలగింపులు టెక్ పరిశ్రమలో స్థిరత్వంపై ఆందోళనలను పెంచుతున్నాయి. గూగుల్ వంటి అగ్రగామి సంస్థలు సైతం వ్యయ నియంత్రణ చర్యలకు మొగ్గుచూపుతుండటం భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాల కోతలకు సంకేతాలుగా నిపుణులు

ఆల్ టైమ్ గరిష్ట స్థాయికి పసడి ధరలు..ఏ నగరాల్లో ఎంత ఉన్నాయంటే..

న్యూఢిల్లీ-నవభూమి: దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు ఈరోజు (ఏప్రిల్ 11న) కూడా పుంజుకున్నాయి. పెరుగుతున్న ప్రపంచ వాణిజ్య యుద్ధ ఉద్రిక్తతల మధ్య కొనుగోళ్లు భారీగా పెరిగాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో జూన్ 5న జరిగిన బంగారం ఇండెక్స్ ఈరోజు 10 గ్రాములకు రూ.92,463 వద్ద ప్రారంభమైంది. ఇది మునుపటి ముగింపు రూ.92,033 నుంచి రూ.430 పెరిగింది. చివరికి ఇది 977 లేదా 1.06 శాతం లాభంతో రూ.93,010 వద్ద ట్రేడవుతోంది. ఆ క్రమంలోనే ఇది రూ.93,736 వద్ద ఆల్ టైమ్ గరిష్ట స్థాయిని చేరుకుంది.

గత ముగింపు కంటే..అదేవిధంగా మే 5, 2025న వెండి ఫ్యూచర్స్ కూడా ఈరోజు లాభాల్లో కొనసాగింది. %వీజశ%లో ఈ ఒప్పందం కిలోకు రూ.92,000 వద్ద మొదలై, ఇది గత ముగింపు రూ.91,595 నుంచి రూ.405 లాభపడింది. ఇది మునుపటి ముగింపు కంటే రూ. 703 లేదా 0.77 శాతం లాభం పొందడం విశేషం. ఈ క్రమంలో ఇది రూ. 92,000 కనిష్ట స్థాయిని, రూ. 92,588 గరిష్ట స్థాయిని తాకింది.

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర

మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో %జూవీజుశ% బంగారం ధర ట్రాయ్ ఔన్సుకు దాదాపు 3,2-7.2 వద్ద ట్రేడవుతోంది. బంగారం ఫ్యూచర్లు ఔన్సుకు %వి%3,200 మార్కును దాటడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఉదయం 10:45 గంటలకు స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు దాదాపు 3,195.83గా ఉంది.

ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలను **ఇక్కడ చూద్దాం.**

ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 95,550కు చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ. 87,600గా ఉంది.

ఇక ముంబైలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ. 95,400 స్థాయిలో ఉండగా, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ. 87,450గా కలదు.

హైదరాబాద్, విజయవాడలో కూడా 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ. 95,400 స్థాయిలో ఉండగా, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ. 87,450గా కలదు.

కోల్‌కతాలో ఈరోజు 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 95,400 ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 87,450 వద్ద ఉంది

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ. 95,400 వద్ద ఉండగా, 22 క్యారెట్ల బంగారం రేటు 10 గ్రాములకు రూ. 87,450 వద్ద ఉంది

వెండి ధరలు

దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 97,100గా ఉంది.

ముంబైలో ఈ విలువైన లోహాన్ని కొనడానికి వినియోగదారులు ఈరోజు కిలోకు రూ. 97,100 చెల్లించాల్సి ఉంటుంది

కోల్‌కతాలో కిలో వెండి ధర రూ. 98,000, చెన్నైలో ఈ విలువైన లోహం ధర కిలోకు రూ. 1,08,000 స్థాయిలో ఉంది.హైదరాబాద్, విజయవాడలో కూడా కేజీ వెండి ధర రూ. 1,08,000గా ఉంది.

40 లక్షల లోన్‌పై ఇలా రూ. 7 లక్షలు ఆదా..!

న్యూఢిల్లీ-నవభూమి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించిన ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశాల్లో వరుసగా 25 బేసిస్ పాయింట్ల చొప్పున రెపో రేటును తగ్గించింది. దీంతో ఈ ఏడాది మొత్తంగా రెపో రేటు 50 బేసిస్ పాయింట్లు మేర తగ్గింది. ఈ నేపథ్యంలో బ్యాంకులు త్వరలోనే ఈ తగ్గింపు ప్రయోజనాన్ని గృహ రుణ గ్రహీతలకు అందించే అవకాశం ఉంది. ఫలితంగా వారి ఈఎంఐ భారం తగ్గుతుంది. ఇప్పటికే ఫిబ్రవరి సమయంలో తగ్గింపుల్ని ప్రకటించగా.. ఇప్పుడు ఇంకాస్త లోన్ వడ్డీ రేట్లు తగ్గనున్నాయి. రెపో రేటుకు లింక్ అయి ఉన్న లోన్లపై ఊరట దక్కుతుంది. బ్యాంకులు త్వరలో తమ వినియోగదారులను సంప్రదించి, ప్రస్తుత ఈఎంఐని తగ్గించుకోవాలా లేదా రుణ కాలపరిమితిని తగ్గించుకోవాలా అనే దానిపై ఎంపికను అడుగుతాయి. అయితే, ఏ ఎంపికను ఎంచుకుంటే భవిష్యత్తులో ఎక్కువ డబ్బు ఆదా అవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

టెన్యూర్.. ఏది తగ్గించుకోవాలి?

వడ్డీ రేటు తగ్గినప్పటికీ మీ ప్రస్తుత ఈఎంఐని కొనసాగిస్తూ, కాలపరిమితిని తగ్గించుకుంటే వడ్డీ చెల్లింపులపై ఎక్కువ ఆదా చేసుకోవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. బ్యాంక్‌బజార్.కామ్ సీఈఓ అధిల్ శెట్టి మాట్లాడుతూ, "రెండు ఎంపికలు కొంత ప్రయోజనాన్ని అందించినప్పటికీ, ప్రస్తుత ఈఎంఐని కొనసాగిస్తూ కాలపరిమితిని తగ్గించుకోవడం వల్ల దీర్ఘకాలంలో ఎక్కువ ఆదా ఉంటుంది. తక్కువ కాలపరిమితి మొత్తం వడ్డీని తగ్గిస్తుంది అలాగే రుణాన్ని త్వరగా ముగించడంలో సహాయపడుతుంది. దీనికి విరుద్ధంగా, ఈఎంఐని తగ్గించుకోవడం వల్ల నెలవారీ చెల్లింపులు తగ్గుతాయి కానీ మొత్తం చెల్లించే వడ్డీ పెరుగుతుంది." అని అన్నారు.

రూ. 40 లక్షల లోన్..

మీరు రూ. 40 లక్షల గృహ రుణం 20 సంవత్సరాల కాలానికి ఈ ఏడాది ప్రారంభంలో అలా.. 8.5 శాతం వడ్డీ రేటుతో తీసుకున్నారని అనుకుందాం. ఆర్‌బీఐ రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించినందున, మీ గృహ రుణ వడ్డీ రేటు 8 శాతానికి బ్యాంకులు తగ్గించే అవకాశం ఉంటుంది.మీరు ఈఎంఐ తగ్గింపును ఎంచుకుంటే: మీ అసలు ఈఎంఐ (రెపో రేటు తగ్గింపునకు ముందు) రూ. 34,713. సవరించిన ఈఎంఐ (రెండు రెపో రేటు తగ్గింపుల తర్వాత) రూ. 33,458 అవుతుంది. అంటే మీరు ప్రతి నెలా రూ. 1,255 ఆదా చేస్తారు. వడ్డీ రేటు 20 సంవత్సరాల పాటు 8 శాతం వద్ద స్థిరంగా ఉంటే, మీరు మొత్తం వడ్డీ చెల్లింపులపై రూ. 3.01 లక్షలు ఆదా చేస్తారు.

మీరు రుణ కాలపరిమితి తగ్గింపును ఎంచుకుంటే: మీరు మీ ఈఎంఐని రూ. 1,255 తగ్గించుకోకుండా, మీ ప్రస్తుత రుణ కాలపరిమితిని 20 సంవత్సరాల నుంచి తగ్గిస్తే, మీ అసలు ఈఎంఐ రూ. 34,713 చెల్లిస్తూనే మీ రుణ కాలపరిమితి 18.33 సంవత్సరాలకు తగ్గుతుంది. ఈ ఎంపిక ద్వారా మీరు మీ రుణాన్ని 20 నెలలు ముందుగానే పూర్తి చేస్తారు. దీనివల్ల మీరు మొత్తం వడ్డీ చెల్లింపులపై రూ. 6.93 లక్షలు (దాదాపు 7 లక్షలు) ఆదా చేస్తారు. వాస్తవానికి, మీరు రుణ కాలపరిమితి తగ్గింపు ఎంపికను ఎంచుకోవడం ద్వారా, ఈఎంఐ తగ్గింపును ఎంచుకోవడం కంటే రూ. 3.92 లక్షలు ఎక్కువ ఆదా చేస్తారు. కాబట్టి, మీ ఆర్థిక పరిస్థితిని బట్టి, ఎక్కువ ఆదా పొందడానికి రుణ కాలపరిమితిని తగ్గించుకోవడం మంచి ఎంపికగా నిపుణులు సూచిస్తున్నారు. అయితే, నెలవారీగా మీరు ఎక్కువ ఈఎంఐ చెల్లించలేని పరిస్థితుల్లో మాత్రం ఈఎంఐ తగ్గింపును ఎంచుకోవడం సరైనది కావచ్చని అంటున్నారు.

5 ఏళ్ల పాప పేరుపై.. నెలకు రూ.10 వేలు 'సిప్' పొదుపు చేస్తే.. 15 ఏళ్లలో ఎంతొస్తుంది?

న్యూఢిల్లీ-నవభూమి: ప్రస్తుత రోజుల్లో ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇద్దరు పిల్లలు ఉన్న ఇంట్లో ఎంత ఖర్చు ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రోజువారీ ఖర్చులు, పిల్లల చదువులు, పొదుపు, పెట్టుబడులు ఇలా చెప్పుకుంటూ వెళ్తే లిస్ట్ పెద్దగానే ఉంటుంది. భార్యాభర్తలు ఇద్దరు కష్టపడినా కొన్నిసార్లు సరిపోదు. ఇలాంటి పరిస్థితుల్లోనూ పిల్లల ఉన్నత చదువులు, పెళ్లిళ్ల కోసం వారి చిన్నతనం నుంచే పెట్టుబడులు పెట్టడం చాలా అవసరం. ఎంతో కొంత వారి కోసం దాచి పెట్టాలి. లేదంటే వచ్చే 15-20 ఏళ్లలో ద్రవ్యోల్బణం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించే పరిస్థితులు లేవు. ఇప్పుడే ఎల్‌కేజీ చదువులకే లక్షలు అడుగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 5 సంవత్సరాల తన కూతురి కోసం ఓ తండ్రి ఏ విధంగా పెట్టుబడి పెట్టాలో ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.

సమాధానం: పైన పేర్కొన్న ప్రశ్నకు ఆర్థిక నిపుణుల సలహా ప్రకారం.. ముందుగా మీ పాప ఆర్థిక భద్రత కోసం కుటుంబ పెద్ద వార్షిక ఆదాయానికి కనీసం 12 రెట్లు టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి. అలాగే మీరు ఎలాంటి పథకాలు ఎంచుకున్నా ద్రవ్యోల్బణానికి మించి కనీసం 3-4 శాతం అధిక రాబడి వచ్చే పథకాలను ఎంపిక చేసుకోవాలి. సాంప్రదాయ పొదుపు పథకాల్లో అంత మేర రాబడి రాదనే చెప్పాలి. ప్రస్తుతం సాంప్రదాయ పొదుపు పథకాల్లో వడ్డీ రేట్లు సైతం తగ్గిస్తున్నారు. దీంతో రాబడి మరింతే తగ్గుతుందనే చెప్పాలి. మీరు మదుపు చేయాలనుకుంటున్న పాప పేరు మీద రూ.3 వేల చొప్పున సుకన్య సమృద్ధి యోజనలో జమ చేయండి. దీని ద్వారా ప్రస్తుతం 8.2 శాతం వడ్డీ రేటు లభిస్తోంది. 15 సంవత

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ శనివారం 12 ఏప్రిల్ 2025

గూగుల్ మ్యాప్‌ను ఫాలో అయ్యి.. రైలు పట్టాలపైకి కారును నడిపిన వ్యక్తి

లక్నో-నవభూమి: ఒక వ్యక్తి పక్క రాష్ట్రంలో జరిగిన పార్టీకి వెళ్లాడు. మద్యం మత్తులో కారు నడుపుతూ తిరుగు ప్రయాణమయ్యాడు. గూగుల్ మ్యాప్‌ను ఫాలో అయ్యాడు. ఈ నేపథ్యంలో రైలు పట్టాలపైకి కారును డ్రైవ్ చేశాడు. (%మీఖఅ ణతీఅజవం ూాత్శీ =ఖఅశ్రీఖుఎ ఎతీఖఎనం%) గమనించిన లోకో పైలట్ ఎమర్జెన్సీ బ్రేకులు వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లా గోపాల్‌పూర్‌కు చెందిన ఆదర్శ్ రాయ్, ఉత్తరప్రదేశ్‌లోని గొరఖ్‌పూర్‌కు కారులో వెళ్లాడు. అక్కడ పార్టీ తర్వాత సొంత గ్రామానికి కారులో తిరుగు ప్రయాణమయ్యాడు.కాగా, మద్యం సేవించిన ఆదర్శ్, గూగుల్ మ్యాప్‌లో పూర్తి చిరునామాకు బదులు గ్రామం పేరు మాత్రమే ఎంటర్ చేశాడు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని డోమింగర్ సమీపంలో రైల్వే ట్రాక్‌పైకి కారును డ్రైవ్ చేశాడు. రైలు పట్టాల పక్కన ఉన్న కంకర రాళ్లలో టైర్లు కూరుకుపోయాయి. దీంతో కారు అక్కడ చిక్కుకుపోయింది.మరోవైపు ఆ ట్రాక్‌పై గూడ్స్ రైలు వస్తున్నది. అయితే రైలు పట్టాల పక్కన కారు ఉండటాన్ని లోకో పైలట్ సకాలంలో గమనించాడు. ఎమర్జెన్సీ బ్రేక్ వేయడంతో ఐదు మీటర్ల దూరంలో గూడ్స్ రైలు ఆగింది. ఈ విషయం తెలుసుకున్న ఆర్పీఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. స్థానికుల సహాయంతో ఆ కారును పక్కకు తొలగించారు. ఆదర్శ్ రాయ్ మద్యం మత్తులో ఉన్నట్లు గ్రహించి అరెస్ట్ చేశారు. ఆ కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకేరోజు వందల మందికి గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ లేఆఫ్.. కారణం ఏంటంటే?

బెంగళూరు-నవభూమి: ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోత కొనసాగుతోంది. అనేక కంపెనీలు తమపై ఆర్థిక భారాన్ని దించుకోవడానికి ఒకేసారి వందలాది మందిని ఉద్యోగాల్లోంచి తొలగిస్తున్నాయి. అయితే తాజాగా గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ కంపెనీ.. వందలాది మందిపై వేటు విధించింది. ముఖ్యంగా ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ ఫోన్స్, క్రోమ్ బ్రౌజర్ విభాగాల్లో పని చేస్తున్న వందల మందిని ఏప్రిల్ 10వ తేదీ రోజు ఉద్యోగాల్లోంచి తొలగించినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు కరెక్టుగా ఎంత మందిపై లేఆఫ్స్ ప్రభావం పడిందనే వివరాలు మాత్రం ఇంకా వెల్లడి కాలేదు. అయితే గూగుల్ ఇంత పెద్ద మొత్తం లేఆఫ్స్ ఎందుకు విధించిందో, దానికి గల కారణాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.ఏప్రిల్ 10వ తేదీ గురువారం రోజు గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వందలాది మందికి లేఆఫ్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వార్త ఈరోజు వెలుగులోకి రాగా.. కరెక్టుగా ఎంత మంది ఉద్యోగాలు పోయాయనే వివరాలు మాత్రం ఇంకా బయటకు రాలేదు. అయితే ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ ఫోన్స్, క్రోమ్ బ్రౌజర్ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులపై మాత్రం ఈ లేఆఫ్‌ల ప్రభావం పడినట్లు సమాచారం. జనవరి నెలలోనే గూగుల్ తన ఉద్యోగులకు ఆఫర్లు ప్రకటించి.. ఇప్పుడే కోతలు విధించడంతో అంతా షాక్ అవుతున్నారు.ముఖ్యంగా 2024 డిసెంబర్ నెలలో కూడా గూగుల్ సంస్థ 10 శాతం మంది ఉద్యోగులపై వేటు వేసింది. అంతకుముందు ఏడాది అంటే 2023 జనవరి నెలలో మొత్తంగా 12 వేల మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించింది. అయితే ఇందుకు కారణాలు చాలానే ఉన్నట్లు అనేక వార్తలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఆర్థిక అస్థిరత్వం వల్ల గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, అమెరికా ప్రతీకార సుంకాల యుద్ధం, మాంద్యం భయాలు, లాభాలు పూర్తిగా క్షీణించిపోవడం, ఏఐ వినియోగం విపరీతంగా పెరగడం వల్ల.. కంపెనీలు ఖర్చులు తగ్గించుకోవడానికి ఉద్యోగులపై వేటు విధిస్తున్నట్లు భావిస్తున్నారు.ఒక్క గూగుల్ సంస్థనే కాకుండా అనేక కంపెనీలు పలు కారణాలు చెబుతూ.. వేలాది మందిని ఉద్యోగాల్లోంచి తొలగిస్తున్నాయి. 2025వ సంవత్సరంలోనే సాంకేతిక రంగంలో 100 కంపెనీలు 27 వేల 762 మంది ఉద్యోగులను తొలగించినట్లు లేఆఫ్స్.ఎఫ్‌వై వెబ్‌సైట్ వెల్లడించింది. 2024లో 549 కంపెనీలు లక్షా 52 వేల 472 మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ఇచ్చినట్లు తెలిపింది. అలాగే అంతకు ముందు సంవత్సరం అంటే 2023లో వెయ్యి 193 కంపెనీలు.. 2 లక్షల 64 వేల 220 మంది ఉద్యోగాలకు కోత విధించినట్లు స్పష్టం చేసింది.

కమీషన్ డిమాండ్ చేస్తే.. లోకాయుక్తకు ఫిర్యాదు చేయండి : డిప్యూటీ సీఎం శివకుమార్

బెంగళూరు-నవభూమి: బిల్లులు చెల్లించేందుకు ఎవరైనా కమీషన్ డిమాండ్ చేస్తే లోకాయుక్తకు ఫిర్యాదు చేయాలని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కాంట్రాక్టర్లకు సూచించారు. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో కంటే ఇప్పుడు కమీషన్లు పెద్ద ఇబ్బందిగా మారాయని కర్నాటక కాంట్రాక్టర్ల సంఘం ఆరోపించిన నేపథ్యంలో ఆయన స్పందించారు. అసెంబ్లీ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం శివకుమార్, మరో ఇద్దరు సీనియర్ మంత్రుల కార్యాలయాల్లో అవినీతి మితిమీరిపోయిందని కాంట్రాక్టర్ల సంఘం గురువారం సంచలన ఆరోపణలు ఆరోపించింది. మంత్రుల కార్యాలయాల్లో బ్రోకర్లు కిక్కిరిసిపోయి ఉంటారని.. మైనర్ ఇరిగేషన్ మంత్రి ఎన్ఎస్ బోస్‌రాజు తనయుడు రవి బోస్‌రాజు లావాదేవీలన్నీ తానే జరుపుతారని, ప్రజా పనుల శాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి బంధువు ఒకరు శాఖాపరమైన వ్యవహారాల్లో తలదూరుస్తారని ఆరోపించిన విషయం తెలిసిందే.ఆరోపణలను శివకుమార్ ఖండించారు. తనతో పాటు మంత్రులపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. బిల్లులు చెల్లించేందుకు కాంట్రాక్టర్ల నుంచి ఎవరైనా కమీషన్ అడిగి ఉంటే లోకాయుక్తకు ఫిర్యాదు చేయాలన్నారు. కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎందుకు మంత్రిని అడగాలని ప్రశ్నించారు. వారికి (కాంటాక్టర్లకు) శాఖ బడ్జెట్ తెలియదా? గ్రాంట్ లేనప్పుడు వారు కాంట్రాక్టును ఎలా తీసుకున్నారు? అంటూ ప్రశ్నించారు. బీజేపీ హయాంలో తన శాఖ మాత్రమే రూ.లక్ష కోట్లకుపైగా విలువైన కాంట్రాక్టులను ఇచ్చిందని.. ఈ కాంట్రాక్టులకు బిల్లులు చెల్లించమని ఎమ్మెల్యేలు అడుగుతున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు తాను కాంట్రాక్టర్లను హెచ్చరించానని ఆయన అన్నారు. నిధులు లేకుండా ఏ పని చేయవద్దని హెచ్చరించినా మాన వినలేదని.. ఇప్పుడు రాజకీయ నేతల వద్దకు వస్తున్నారన్నారు.

షర్ట్ బటన్ పెట్టుకోని లాయర్‌కు ఆర్నెళ్ల జైలుశిక్ష, 2వేల ఫైన్ విధించిన హైకోర్టు

లక్నో-నవభూమి: అలహాబాద్ హైకోర్టు స్థానిక న్యాయవాది అశోక్ పాండేకు .. 2021 నాటి కోర్టు ధిక్కరణ కేసులో ఆర్నెళ్ల జైలుశిక్ష విధించింది. మెడ చుట్టు లాయర్ రోబ్ లేకుండా, షర్ట్‌కు బటన్ పెట్టుకోకుండా కోర్టుకు హాజరైన కేసులో.. అలహాబాద్ కోర్టు ఈ తీర్పును ఇచ్చింది. జస్టిస్ వివేక్ చౌదరీ, బీఆర్ సింగ్‌లకు చెందిన డివిజన్ బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. ఆరోపణలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కఠిన శిక్ష విధిస్తున్నట్లు కోర్టు చెప్పింది. గతంలో లాయర్ పాండే ప్రవర్తన సరిగా లేదని కోర్టు వెల్లడించింది

లాయర్ పాండేకు అలహాబాద్ కోర్టు జైలుశిక్షతో పాటు రెండు వేల జరిమానా కూడా విధించింది. ఒకవేళ జరిమానా చెల్లించకుంటే, అప్పుడు అతని మరో నెల అదనపు జైలు శిక్ష వేయనున్నారు. నాలుగు వారాల్లోగా లక్నోలోని చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ముందు సరెండర్ కావాలని కోర్టును లాయర్ పాండేను ఆదేశించింది. షోకాజ్ నోటీసు కూడా జారీ చేసింది. అలహాబాద్ హైకోర్టు, లక్నో బెంచ్‌ల్లో లీగల్ ప్రాక్టీసు చేయకుండా ఎందుకు నిషేధం విధించరాదు అని కోర్టు ప్రశ్నించింది. 2021, ఆగస్టు 18వ తేదీన పాండే కోర్టుకు హాజరైన తీరు పట్ల అప్పటి న్యాయమూర్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయవాద దుస్తులు సరిగా లేవని ఆరోపించారు. జడ్జీలతో అతను దురుసుగా ప్రవర్తించినట్లు తేలింది. వాళ్లను గూండాలు అని అతను పిలిచాడు. కోర్టు ధిక్కరణ కేసు పట్ల న్యాయవాది పాండే స్పందిచలేదు.

ఉప ప్రధానిగా నితీష్ కుమార్, అద్వానీ వారసుడిగా.. బీజేపీ సీనియర్ నేత కీలక వ్యాఖ్యలు

లక్నో-నవభూమి: మరికొన్ని రోజుల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న జేడీయూ.. బీజేపీతో కలిసి పోటీ చేయనుంది. ఇక ఇండియా కూటమిలో ఉన్న ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు కలిపి బరిలోకి దిగనున్నాయి. బిహార్ సీఎం నితీష్ కుమార్.. ఇప్పుడు నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో కీలక భాగస్వామిగా ఉండగా.. మరికొన్ని రోజుల్లో బిహార్ శాసనసభ ఎన్నికలు రానున్న తరుణంలో ఇప్పుడు బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. జేడీయూ అధినేత, బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను తాను దేశ ఉపప్రధానిగా చూడాలని అనుకుంటున్నట్లు అశ్వినీ కుమార్ చౌబే తాజాగా మీడియాకు వెల్లడించారు.కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమికి నితీష్ కుమార్ చేసిన సేవలు వెలకట్టలేనివని అశ్వినీ కుమార్ చౌబే తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వంలో నితీష్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు ఉప ప్రధాని పదవి ఇవ్వాలన్నది తన కోరిక అని మనసులో మాట బయటపెట్టారు. అయితే ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని అశ్వినీ కుమార్ చౌబే స్పష్టం చేశారు. ఒకవేళ అదే జరిగితే.. బిహార్ నుంచి ఉప ప్రధానిగా ఎన్నికైన రెండో వ్యక్తిగా నితీష్ కుమార్ నిలుస్తారని పేర్కొన్నారు. గతంలో బిహార్ నుంచి బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి ఉపప్రధానిగా పనిచేశారు.

ఇక ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇక ఈసారి ఎన్నికల్లో కూడా విజయం సాధించి.. సీఎం సీటును నిలబెట్టుకోవాలని నితీష్ కుమార్ భావిస్తున్నారు. గత 2 దశాబ్దాలకుపైగా బిహార్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న నితీష్.. రాష్ట్రంలో జేడీయూ గెలుపు, ముఖ్యమంత్రి పదవిని నిలబెట్టుకునేందుకు మళ్లీ కూటమి మారే ప్రయత్నం చేస్తారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే నితీష్ కుమార్ ఏ పార్టీతో జట్టుకట్టినా ముఖ్యమంత్రి స్థానం మాత్రం ఆయనదే కావడం గమనార్హం.మరోవైపు.. బిహార్‌లో ఈ రాజకీయాలతో కూటమిలో రెండో స్థానానికే పరిమితమైన బీజేపీ.. నితీష్ కుమార్‌ను గౌరవప్రదంగా పక్కన పెట్టాలని భావిస్తున్నట్లు కమలం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముఖ్యమంత్రి అభ్యర్థిగా నితీష్ కుమార్‌ను ప్రకటించేందుకు బీజేపీ హైకమాండ్ ఆసక్తి చూపించడం లేదంటూ ఇటీవల ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి పరిణామాల మధ్య బీజేపీ సీనియర్ నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది.

ట్రంప్ సుంకాల ఎఫెక్ట్.. భారతీయ కంపెనీలకు చైనా సంస్థలు బంపరాఫర్.. వాటి ధరలు తగ్గుతాయ్!

బెంగళూరు-నవభూమి: అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం రోజు రోజుకూ తీవ్రమవుతోంది. చైనాను టార్గెట్ చేసిన ట్రంప్.. సుంకాల మీదు సుంకాలు పెంచుకుంటూ పోతున్నారు. దీంతో చైనా కంపెనీలకు అమెరికా నుంచి ఆర్డర్లు తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో చైనాలోని ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీదారులు.. భారతీయ కంపెనీలకు డిస్కౌంట్ ఆఫర్లు ఇస్తున్నాయి. భారతీయ కంపెనీలకు 5% వరకు డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నాయి. టెలివిజన్, రిఫ్రిజిరేటర్, స్మార్ట్‌ఫోన్ తయారీదారుల ప్రకారం.. చైనా కంపెనీల రాయితీలు.. భారతీయ తయారీదారులు తమ లాభాలను 2-3% పెంచుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. అమ్మకాలను పెంచుకోడానికి ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయనున్నాయి.భారతీయ కంపెనీలు ఉపయోగించే మొత్తం ఎలక్ట్రానిక్స్ విడిభాగాలలో చైనా దిగుమతులు దాదాపు 75%. 'చైనాలోని ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీదారులు ఒత్తిడిలో ఉన్నారు' అని గోద్రెజ్ అప్లయన్స్ విభాగం చీఫ్ కమల్ నంది అన్నారు. అమెరికా నుంచి ఆర్డర్‌లు తగ్గడంతో భారతీయ కంపెనీలతో ధరలపై చర్చించనున్నాయని అభిప్రాయపడ్డారు. సాధారణంగా ఎలక్ట్రానిక్స్ విషయానికి వస్తే రెండు నుంచి మూడు నెలలకు సరిపడే ముడి సరుకు నిల్వలు ఉంటాయి. కంపెనీలు మే-జూన్ నుంచి కొత్త ఆర్డర్‌లను ప్రారంభిస్తాయి. గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ నివేదిక ప్రకారం.. 2024 ఆర్థిక సంవత్సరంలో భారత్ ఎలక్ట్రానిక్స్ విడిభాగాల దిగుమతులు అంతకు ముందు పోలిస్తే 36.7% పెరిగి 34.4 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత ఐదేళ్లలో దిగుమతులు (2019లో 15.8 బిలియన్ డాలర్ల) 118.2% మేర పెరిగాయి.

చైనా తయారీదారులు ముడి సరుకు మిగులు సమస్యలను ఎదుర్కొంటున్నారని టెలివిజన్ కాంట్రాక్ట్ తయారీదారు సూపర్ ప్లాస్ట్రానిక్స్ సీఈఓ అవనీత్ సింగ్ మార్వా అన్నారు. "చైనా నుంచి అమెరికాకు ఎగుమతులు నిలిచిపోవడంతో ఆందోళన నెలకుంది.. భారతీయ కంపెనీలకు చైనా విడిభాగాల తయారీదారులు 5% వరకు ధరలు తగ్గించడానికి చర్చలు జరుపుతున్నారు' అని మార్వా తెలిపారు. కానీ, 'దేశీయంగా డిమాండ్ లేకపోవడం వల్ల ఈ కంపెనీలు తమకు రాయితీగా వచ్చిన ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీచేయడానికి ధరలు తగ్గించవచ్చు' అని పేర్కొన్నారు. 2024లో చైనా నుంచి అమెరికా దిగుమతుల్లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలదే అగ్రస్థానం.దేశీయ కంపెనీలకు ప్రభుత్వం ప్రోత్సహకాలు, నాణ్యత ప్రమాణాలపై విషయంలో కఠినంగా వ్యవహరించడం, సుంకాల వంటి కారణాలతో చైనా పరికరాలకు డిమాండ్ తగ్గింది. ఇది స్థానిక తయారీని ప్రోత్సహించింది. రెండు రోజుల కిందట ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్‌ను ప్రకటించిన ప్రభుత్వం.. 2030 నాటికి ఈ రంగం 145-155 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. ప్రస్తుతం, చిప్‌లు, కంప్రెసర్‌లు, ఇన్నర్ గ్రూవ్డ్ కాపర్ ట్యూబ్‌లు, ఓపెన్ సెల్ టెలివిజన్ ప్యానెల్‌లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్‌లు, బ్యాటరీ సెల్‌లు, డిస్ప్లే మాడ్యూల్‌లు, కెమెరా మాడ్యూల్‌లు, ఫ్లెక్సిబుల్ ప్రింటెడ్ సర్క్యూట్‌లతో సహా ముఖ్యమైన ఎలక్ట్రానిక్ భాగాలను భారత్ దిగుమతి చేసుకుంటోంది. అమెరికా మార్కెట్ మందగించడం, డిమాండ్ తగ్గడం వల్ల విడిభాగాల ధరలు తగ్గుతాయని డైక్సన్ టెక్నాలజీస్ ఎండీ అతుల్ లాల్ అభిప్రాయపడ్డారు.

ముంబై ఉగ్రదాడుల నుంచి తృటిలో తప్పించుకున్నా : అస్సాం సీఎం

ముంబై-నవభూమి: ఇప్పుడు దేశంలో ఎక్కడ చూసినా ముంబై ఉగ్రదాడి ఘటన ప్రస్తావనే వినిపిస్తోంది. అందుకు కారణం ముంబై 26/11 పేలుళ్ల కేసులో ప్రధాన నిందితుడు తహవ్వుర్ హుస్సేన్ రాణా ను భారత్‌కు తీసుకురావడమే. ఆయన రాకతో నాటి భయానక పరిస్థితుల్ని అందరూ గుర్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సైతం ఆ మారణహోమాన్ని తలచుకున్నారు. ఆ దాడినుంచి తాను తృటిలో తప్పించుకున్నట్లు చెప్పారు.ఉగ్రదాడులు జరిగిన రోజే నేను ముంబై తాజ్ హోటల్లో బస చేయాల్సి ఉంది. అయితే, చివరి నిమిషంలో షెడ్యూల్ మారడంతో మరో హోటల్లో దిగాను. దీంతో ఆ దాడి నుంచి తృటిలో ప్రాణాలతో బయటపడ్డా. ఆ రోజు జరిగిన ఎన్ఎస్‌జీ ఆపరేషన్ ఇప్పటికీ నా కళ్ల ముందు మెదులుతోంది. కర్మ సిద్ధాంతం ప్రకారం దాడుల వెనక ఉన్న సూత్రధారులు ఏదో ఒకరోజు శిక్ష ఎదుర్కోక తప్పదని అప్పుడే భావించా. దాడి జరిగిన పదహారేళ్ల తర్వాత నిందితుడిని దేశంలో చూస్తుంటే న్యాయవ్యవస్థలపై మరింత విశ్వాసం పెరిగింది' అని హిమంత వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు.16 ఏళ్ల క్రితం అంటే 2008 నవంబర్ 26న పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహోమానికి పాల్పడ్డారు. కొబాలా సముద్ర తీరం వెంబడి దక్షిణ ముంబైలోకి ప్రవేశించిన ఈ ముఠా నగరంలో మారణహోమాన్ని సృష్టించారు. ఛత్రపతి శివాజీ టెర్మినస్, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్, లియోపోల్డ్ కేఫ్, ముంబై చాబాద్ హౌస్, నారిమన్ హౌస్, కామా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. 18 మంది భద్రతా సిబ్బంది సహా 166 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఈ దాడులకు అవసరమైన ప్రణాళికలు రూపొందించడంలో రాణా కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడిపై కేసులు నమోదయ్యాయి. ఇక దాడి జరిగిన ఏడాది తర్వాత అంటే 2009లో షికాగోలో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులు రాణాను అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి ఆయన అమెరికా జైలులోనే శిక్ష అనుభవించారు.

తహవ్వూర్ రాణా భారత్‌కు అప్పగింత

14 ఏళ్ల కిందట మోదీ పెట్టిన పోస్ట్ వైరల్

26/11 ఉగ్రదాడుల కుట్రదారుడు తహవ్వూర్ రాణాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 14 ఏళ్ల కిందట ఎక్స్ (ట్విట్టర్)లో చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. రాణాను అమెరికా అప్పగించడంతో అతడ్ని గురువారం సాయంత్రం ఢిల్లీకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ప్రధాని 2011లో పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. రాణాను 'నిర్దోషి' అని ప్రకటించడం ద్వారా అమెరికా.. 'భారతదేశ సార్వభౌమాధికారాన్ని అవమానించింది' అని మండిపడ్డ ప్రధాని.. కాంగ్రెస్ నేతృత్వంలోని అప్పటి యూపీయే 2 ప్రభుత్వం విదేశాంగ విధానాన్ని విమర్శించారు. మొత్తం 166 మందిని బలితీసుకున్న ముంబయి ఉగ్రదాడుల కుట్రలో రాణాకు ప్రత్యక్ష పాత్రలేదని 2011లో అమెరికా కోర్టు తేల్చి చెప్పింది. అయితే దాడులకు పాల్పడిన ఉగ్రవాద సంస్థకు మద్దతు ఇచ్చినందుకు అతడిని దోషిగా నిర్ధారించింది."ముంబయి దాడిలో తహవ్వూర్ రాణాను అమెరికా నిర్దోషిగా ప్రకటించి భారతదేశ సార్వభౌమాధికారాన్ని అవమానించింది.. ఇది కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వ విదేశాంగ విధాన వైఫల్యం' అని మోదీ పోస్ట్ చేశారు. సోషల్ మీడియాలో ఈ పోస్ట్‌ను మళ్లీ షేర్ చేస్తోన్న నెటిజన్లు.. చట్టాన్ని ఎదుర్కోవడానికి రాణాను భారతదేశానికి విజయవంతంగా రప్పించినందుకు మోదీపై ప్రశంసలు కురిపిస్తున్నారు.'చెప్పింది చేసే నాయకుడు. మా కెప్టెన్' ఒకరు.. 'మీరు దీన్ని సాధించారు సార్!! అభినందనలు. .ధన్యవాదాలు!' అని ఇంకొకరు.. 'మోదీ ఉంటే, ఏదైనా సాధ్యమే' అని మరొకరు ఇలా వరుసగా పోస్ట్‌లు పెడుతున్నారు.ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా రాణాను భారత్‌కు అప్పగిస్తున్నట్టు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. అటు, చట్టపరంగా అన్ని దారులు మూసుకుపోవడంతో రాణా భారత్‌కు రాకతప్పలేదు. గురువారం సాయంత్రం ప్రత్యేక విమానం ఢిల్లీలో ల్యాండ్ అయినవెంటనే.. ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచారు. అతడ్ని 20 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరగా.. న్యాయస్థానం 18 రోజుల పాటు అనుమతించింది.పాక్‌లో పుట్టిపెరిగిన రాణా.. దాయాది సైన్యంలో వైద్యుడిగా పనిచేశాడు. పాకిలోని ఉగ్రవాద సంస్థలు, వారి నాయకులతో అతడికి సంబంధాలు ఉన్నట్టు దర్యాప్తులో వెల్లడయ్యింది.ఈ విషయాన్ని అతడి చిన్ననాటి స్నేహితుడు, ఈ కేసులో ప్రధాన నిందితుడు డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ వెల్లడించాడు. ముంబయిలో వ్యాపార కార్యకలపాల ముసుగులో రెక్కి నిర్వహించి.. ఉగ్రవాదులకు సమాచారం చేరవేశాడని తెలిపాడు. ముంబయి దాడిలో పాక్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా (%హమ%) పాత్రను కూడా అతను బయటపెట్టాడు. రాణా సహాయంతో తన గుర్తింపును దాచడానికి ఒక ఇమ్మిగ్రేషన్ కంపెనీని ప్రారంభించినట్టు వివరించారు. అంతేకాదు, రాణా తన భార్యతో కలిసి ముంబయి సందర్శించి.. విదేశీయులు విడిదిచేసే తాజ్ మహల్ హోటల్‌లో దిగాడు. అందుకే ఉగ్రదాడులకు అది కూడా టార్గెట్‌గా మారింది.

ప్రియుడితో ఉన్న భార్యను పట్టుకున్న భర్త.. హత్యకు గురై డ్రమ్‌లో ఉండాలని లేదంటూ హంగామా

లక్నో-నవభూమి: ప్రియుడితో కలిసి ఉన్న భార్యను భర్త రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తనను హత్య చేసి మృతదేహాన్ని డ్రమ్ములో ఉంచే అవకాశం ఉన్నందున భార్యతో కలిసి జీవించడం ఇష్టం లేదంటూ హంగామా చేశాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మౌరానీపూర్‌లో నివసించే పవన్ ఆరోగ్యశాఖలో పని చేస్తున్నాడు. అతడి భార్య రీతూ వర్మ ప్రభుత్వ బాలికల కాలేజీలో క్లర్క్‌గా పనిచేస్తున్నది. వారికి ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు.కాగా, స్థానిక కౌన్సిలర్ అభిషేక్ పాఠక్‌తో భార్యకు వివాహేతర సంబంధం గురించి తెలుసుకున్న భర్త పవన్ అదే ప్రాంతంలో విడిగా నివసిస్తున్నాడు. కుమారుడితో కలిసి భార్య రీతూ వర్మ నివసిస్తున్న ఇంట్లో ఆమె ప్రియుడు ఉన్నట్లు అతడు తెలుసుకున్నాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. చాలాసేపు ప్రయత్నించిన తర్వాత కౌన్సిలర్ అభిషేక్ పాఠక్ ఆ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అక్కడున్న పోలీసులు, ఇతరులతో అతడు దురుసుగా ప్రవర్తించాడు.మరోవైపు తన భార్య, ఆమె ప్రియుడి నుంచి తనకు, తన కుమారుడికి ప్రాణ ముప్పు ఉందని పవన్ ఆందోళన వ్యక్తం చేశాడు. తనను హత్య చేసి మృతదేహాన్ని డ్రమ్ములో ఉంచే అవకాశం ఉన్నందున ఆమెతో కలిసి జీవించడం ఇష్టం లేదని పోలీసులకు చెప్పాడు. మీరట్‌లో మాజీ మర్చంట్ నేవీ అధికారి సౌరభ్‌ను అతడి భార్య ముస్కాన్, ఆమె ప్రేమికుడు సాహిల్ శుక్లా కలిసి హత్య చేసి మృతదేహాన్ని డ్రమ్‌లో దాచిన ఘటనను గుర్తు చేస్తూ ఇలా అన్నాడు. దీంతో పవన్ ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

3 నెలల పసికందు అస్తమానం ఏడుస్తున్నాడని.. ఎంత పనిచేశావమ్మా తల్లీ?

అహ్మదాబాద్-నవభూమి: పిల్లలు అన్న తర్వాత ఏడుస్తారు. తల్లులు వారి జో కొట్టాలి, బుజ్జగించాలి, పాలు తాగించి బజ్జో పెట్టాలి. లేదంటే కాసేపు వారిని

హాట్ హాట్‌గా తమన్నా.. మరో స్పెషల్ సాంగ్‌తో వచ్చిన మిల్కీ బ్యూటీ

బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'రైడ్ 2'. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో వస్తున్న ఈ సినిమాకు రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వం వహిస్తుండగా.. 2018లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రైడ్ సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. ఈ చిత్రంలో తమన్నా ఒక ప్రత్యేక గీతంలో (నషా సాంగ్) నటించబోతుంది. తాజాగా దీనికి సంబంధించిన పాటను చిత్రబృందం విడుదల చేసింది. నషా నషా అంటూ ఈ పాట సాగగా.. ఇందులో తమన్నా తన డాన్స్‌తో అలరించింది.

ఈ సినిమాలో రితేష్ దేశ్‌ముఖ్, వాణి కపూర్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. పనోరమా స్టూడియోస్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్, క్రిషన్ కుమార్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సమ్మర్ కానుకగా మే 01న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది.

మోడ్రన్ వధువుగా శ్రీదేవి కూతురు



తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు శ్రీదేవి. దేశ వ్యాప్తంగా పాపులారిటీని సొంతం చేసుకుని, బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్‌గా వెలుగు వెలిగిన శ్రీదేవి ఇద్దరు కుమార్తెలు హీరోయిన్స్‌గా ఎంట్రీ ఇచ్చారు. జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో ఇప్పటికే పలు సినిమాల్లో నటించింది. తెలుగులో ఎన్టీఆర్‌కి జోడీగా దేవర సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబోలో రూపొందుతున్న పెద్ది సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. గతంలో చిరంజీవి, శ్రీదేవి జోడీని చూసిన ప్రేక్షకులు ఇప్పుడు రామ్ చరణ్, జాన్వీ కపూర్ జోడీని చూడటం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా ఇప్పటికే సెటిల్ కాగా చిన్నమ్మాయి ఖుషి కపూర్ సక్సెస్ కోసం ప్రయత్నాలు చేస్తుంది. ఇప్పటికే ఈమె సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి ది ఆర్చీస్, లవ్‌యాపా, నదానియన్ లతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అక్క జాన్వీ కపూర్ మాదిరిగానే ఖుషి కపూర్‌కి సక్సెస్‌లు వెంట వెంటనే దక్కడం లేదు. బాలీవుడ్‌లో బ్రేక్ కోసం ప్రయత్నాలు చేస్తున్న ఖుషి కపూర్ సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్‌గా స్టార్ హీరోయిన్స్‌కి ఏమాత్రం తగ్గకుండా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయం తెల్సిందే. ఈసారి ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజీపై కనిపించింది. మానిఫెస్ట్ కవర్ పేజ్‌పై ఖుషీ కపూర్ మోడ్రన్ వధువుగా కనిపించింది. డిఫరెంట్ హెయిర్ స్టైల్‌తో పాటు, గ్రీన్ స్టోన్స్‌ను కలిగిన నెక్ హారంను ధరించి, అంతకు మించి మోడ్రన్ ఔట్ ఫిట్‌ను ధరించింది. సాధారణంగానే అందంగా, ఆకర్షణీయంగా కనిపించే ఈ అమ్మడు తాజా ఫోటోలతో ఓ రేంజ్‌లో ఆకట్టుకుంది. ఖుషి కపూర్ అక్క జాన్వీ కపూర్‌కి ఏమాత్రం తగ్గలేదు. రెండు మూడు ఏళ్ల క్రితం ఖుషి కపూర్ హీరోయిన్‌గా సెట్ కాదు అని విమర్శలు చేసిన వారే ఇప్పుడు ఆమె అందానికి ఫిదా అవుతున్నారు. ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్స్‌లో చాలా మందితో పోల్చితే ఖుషి కపూర్ బెస్ట్ హీరోయిన్ అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. న్యూయార్క్‌లోని ఫిల్మ్ అకాడమీలో సంవత్సరం పాటు నటన కోర్స్ చేసిన ఖుషి కపూర్ నటనతో ఇప్పటి వరకు నటించిన ప్రతి సినిమాలోనూ అలరించింది. కానీ లక్ కలిసి రాకపోవడంతో సినిమాలు హిట్ కావడం లేదు. అక్క జాన్వీ కపూర్ ఎలా అయితే సోషల్ మీడియా ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుని ఆకట్టుకుందో, ఆఫర్లు దక్కించుకుందో అలాగే ఈ అమ్మడు అందమైన ఫోటోలతో అలరిస్తోంది. ముఖ్యంగా ఈ అమ్మడు తన అందాల ఆరబోతతో ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా వైరల్ అవుతోంది. ముందు ముందు కూడా ఈమె నటిగా రాణించాలంటే ఇలాంటి అందమైన ఫోటో షూట్స్, కవర్ స్టిల్స్ తప్పనిసరి అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

మే నెలలో సమంత రెండో వివాహం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కుటుంబ సభ్యులు



టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ సమంత. చూడ చక్కని అందం, ఆకట్టుకునే అభినయంతో ఎంతో మంది మనసులని దోచుకుంది సమంత. కొన్నాళ్లపాటు ఈ భామ పర్సనల్ లైఫ్, కెరీర్ సజావుగానే సాగిన ఇటీవల మాత్రం కాస్త ట్రాక్ తప్పింది. నాగ చైతన్యతో విడాకులు, మయోసైటిస్ వ్యాధితో సమంత డిప్రెషన్‌లోకి వెళ్లింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటుంది. నాగ చైతన్యతో విడాకులు తర్వాత సమంత తెలుగు సినిమాలు చేయడం కూడా తగ్గించేశారు. బాలీవుడ్ సినిమాలు చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నట్టు అర్థమవుతుంది. సమంత హీరోయిన్‌గానే కాకుండా నిర్మాతగా కూడా ప్రయత్నిస్తుంది. సామ్ ఫస్ట్ టైమ్ నిర్మాతగా చేసిన తొలి చిత్రం శుభం టీజర్ ఇటీవల విడుదలై మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. 'త్రాలాలా మూవింగ్ పిక్చ ర్స్' పేరుతో ఆమె సొంత ప్రొడక్షన్ హౌస్ ను స్థాపించి తొలి చిత్రంగా 'శుభం మూవీని ప్రేక్షకుల ముందుకు తెస్తుంది. అయితే గత కొద్ది రోజులుగా సమంత రెండో పెళ్లికి సంబంధించి చాలా వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ దర్శకుడు రాజు నిడుమోరుతో డేటింగ్ చేస్తోన్నట్టు ప్రచారం జరుగుతోంది. వీరిద్దరు చాలాకాలంగా ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి కూడా చేసుకుంటారని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం సమంత, రాజ్‌ల పెళ్లి మేలో ఉంటుందని ఫిలిం నగర్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే ఇరు కుటుంబ సభ్యులు కూడా వీరి పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని , ఇక పెళ్లి జరగడమే తరువాయి అని అంటున్నారు. మరి ఇందులో ఎంత నిజం ఉందో తెలియదు కాని, ప్రస్తుతం ఈ వార్త ఇంటర్నెట్‌లో కూడా తెగ హల్‌చల్ చేస్తుంది. నాగ చైతన్య ఇప్పటికే శోభితని వివాహం చేసుకొని సంతోషంగా వైవాహిక జీవితం గడుపుతుంది. కాని చైతూ నుండి విడిపోయినప్పటి నుండి సమంత సింగిల్‌గానే ఉంటుంది. ఆమె పెళ్లికి సంబంధించి ఎన్నో వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నా కూడా దీనిపై సమంత ఇంత వరకు స్పందించింది లేదు.

అవకాశాల కోసం చెప్పులు అరిగేలా తిరిగిన డీజే టిల్లు తండ్రి .. ఆయన అన్ని ఇబ్బందులు పడ్డారా..!

డీజే టిల్లు చిత్రంలో హీరో తండ్రిగా నటించిన మురళీ ధర్ గౌడ్ మనందరికి సుపరిచితమే. ఇటీవలి కాలంలో ఆయన చాలా చిత్రాలలో నటిస్తూ ప్రేక్షకుల మనసు గెలుచుకుంటున్నాడు. అయితే ఆయన జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, సినిమా రంగంలో ఏ విధంగా అవకాశం వచ్చింది వంటి విషయాల గురించి చెప్పి ఆశ్చర్యపరిచాడు. ముందు ఆయన కరీంనగర్ జిల్లాలోని ఆఫీసులో అకౌంటెంట్‌గా పని చేసేవారట. రిటైర్‌మెంట్ తర్వాత నటనపై ఆసక్తితో సినిమా ఆఫీసుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాడట. ఎంత బతిమిలాడిన అప్పుడు ఎవరు పట్టించుకోలేదు. చిన్నప్పటి నుండి నేను కఠిక పేదరికం అనుభవించాను అని అన్నాడు. తమ తల్లిదండ్రులకి మేము ఐదుగురు సంతానం కాగా, చిన్నప్పుడు వేసుకోవడానికి బట్టలు కూడా సరిగా ఉండేవి కావు. చెప్పులు లేవు. తినడానికి సరైన తిండి ఉండేది కాదు. బగారా ఎప్పుడో తినేవాళ్లం. ఉడికించిన కోడిగుడ్డు ముగ్గురం తినేవాళ్లం. అలా పెరిగిన నేను పెద్దయ్యాక కోట్లు సంపాదించాలని డిసైడ్ అయ్యాను. అయితే సినిమాలలోకి రావాలని అనుకున్నప్పుడు అవకాశాలు ఇవ్వకపోయిన నిరాశ చెందకుండా రోజూ షూటింగ్స్ జరిగే ప్రాంతానికి వెళ్లి అసలు సినిమా ఎలా తీస్తారు. ఆర్టిస్టులు ఎలా నటిస్తున్నారు అని పరిశీలించేవాడిని. ముందు ఛాన్స్ కోసం బ్యాక్‌గ్రౌండ్ ఆర్టిస్ట్‌గా వెళ్లాను. అలా మూడు సినిమాలు చేసిన గుర్తింపు రాలేదు.

అయితే కృష్ణం రాజు డైలాగులు బట్టికొట్టి ఆడిషన్స్‌కి వెళ్లిన ప్రతిచోట అది చెప్పేవారంట. అలా కొన్ని వందల ఆడిషన్స్ ఇచ్చిన తర్వాత డీజీ టిల్లు సినిమాలో అవకాశం వచ్చిందని చెప్పారు మురళీధర్ గౌడ్. డీజీటిల్లు సినిమా అనంతరం అతనికి మంచి పేరు వచ్చింది. అవకాశాలు తలుపు తట్టాయి. ఇటీవల వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం, మ్యాడ్ స్క్వేర్ వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించారు. తను నటించిన అన్ని సినిమాలు దాదాపు సక్సెస్ అవుండడం తన అదృష్టం అంటుంటాడు మురళీధర్. చాలా మంది ఇతరులను చూసి ఈర్ష పడుతుంటారని అలా చేస్తే వారు పైకి రారని చెప్పుకొచ్చారు. నేను ఎప్పుడు మూలాలని మరిచిపోను. ఇప్పటికీ తాను కర్మఫలాన్ని నమ్ముతుంటానని చెప్పారు. కసితో కష్టపడే ప్రతి వ్యక్తినీ అదృష్టం ఏదో ఒకరూపంలో తలుపు తడుతుందని కూడా మురళీధర్ గౌడ్ చెప్పుకొచ్చారు.

వీరమల్లు శర వేగంగా అంచనాలు మించేలా!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తోన్న హరిహరవీరమల్లు మే 9న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ ఆ తర్వాత మళ్లీ ఎలాంటి అప్ డేట్ లేదు. పవన్ కళ్యాణ్ ఇంకా నాలుగు రోజులు డేట్లు ఇవ్వాల్సి ఉండగా ఇంతలో పీకే కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్లో అగ్ని ప్రమాదానికి గురవ్వడంతో? డేట్లు ఇవ్వడం సాధ్యమవుతుందా? లేదా? అన్న దానిపై మళ్లీ నీలి నీడలు కమ్ముకున్నాయి. ఈ స్పీడ్ లో సాధ్యమేనా? ఈ నేపథ్యంలో తాజాగా మరో ఇంట్రెస్టింగ్ అప్ డేట్స్ తో మేకర్స్ ముందుకొచ్చారు. ఈ సినిమాకు సంబంధించి రీ-రికార్డింగ్, డబ్బింగ్ , వీఎఫ్ ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. చివరి దశ నిర్మాణం అన్ని విధాలుగా పూర్తవుతోంది. ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో అందంగా చెక్కుతున్నారు. సినిమాలో విజువల్స్, పాటలు, ఎలివేషన్ సన్నివేశాలు ప్రేక్షకుల అంచనాలను మించి ఉంటాయన్నారు. కథలో బలమైన ఎమోషన్, యాక్షన్ సన్నివేశాలు కొత్త అనుభూతిని పంచుతాయన్నారు. దర్శకుడు జ్యోతికృష్ణ ప్రాణం పెట్టి పనిచేస్తున్నాడు. గత ఏడు నెలలుగా అవిశ్రాంతంగా పని చేస్తున్నారాయన. ఎడిటింగ్, విఎఫ్ ఎక్స్ సహా అన్ని విభాగాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. అలాగే సినిమా పాన్ ఇండియాలో వరల్డ్ వైడ్ భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నట్లు మరోసారి కన్ఫమ్ చేసారు. దీంతో రిలీజ్ విషయంలో సందేహాలు తొలగిపోయాయి. ప్రకటించినట్లుగానే మే 9న రిలీజ్ పక్కా అని తేలిపోయింది. అయితే పవన్ పై చిత్రీకరించాల్సిన నాలుగు రోజుల షూటింగ్ కి సంబంధించి క్లారిటీ రావాల్సి ఉంది. ఆయన సింగపూర్ నుంచి తిరిగి రాగానే డేట్లు ఇచ్చే అవకాశం ఉంది.

టైట్ డ్రెస్‌లో అందాల కృతి మహేష్ బాబుకి జోడీగా

నేనొక్కడినే' సినిమాలో హీరోయిన్‌గా నటించి సినిమా ఇండస్ట్రీకి పరిచయం అయిన ముద్దుగుమ్మ కృతి సనన్. మొదటి సినిమా నిరాశ పరచడంతో బాలీవుడ్‌లో ఈ అమ్మడు ప్రయత్నాలు చేసింది. లక్కీగా ఈ అమ్మడికి హిందీలో 'హీరోపంతి' సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో బాలీవుడ్‌లో ఒక్కసారిగా బిజీ అయింది. తెలుగులో దోచెయ్ సినిమాలో నటించిన ఈమెకు మరోసారి తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి నిరాశే మిగిలింది. దోచెయ్ సినిమా తర్వాత టాలీవుడ్‌కి దూరం అయింది. ప్రభాస్‌కి జోడీగా ఆదిపురుష్ సినిమాలో నటించిన విషయం తెల్సిందే. 2019లో ఏకంగా అర డజను సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కృతి సనన్ ఆ తర్వాత కూడా ఏడాదికి కనీసం రెండు మూడు సినిమాలు చేస్తూ వచ్చింది. గత ఏడాది ఈమె నటించిన నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఈ ఏడాదిలో రెండు లేదా మూడు సినిమాలతో ఈమె ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈమె తేరే ఇష్క్ మే సినిమాలో నటిస్తుంది. త్వరలోనే ఆ సినిమా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. మరో రెండు సినిమాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఆ సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్ త్వరలోనే వచ్చే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు ఈమె సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో కృతి సనన్‌కి దాదాపుగా ఆరు కోట్ల ఫాలోవర్స్‌ను కలిగి ఉంది. తక్కువ సమయంలోనే ఈమెకు ఈ స్థాయిలో ఫాలోవర్స్ దక్కారు. సోషల్ మీడియాలో అత్యధిక సంపాదన కలిగి ఉన్న హీరోయిన్స్‌లో ఈమె ఒకరు అనడంలో సందేహం లేదు. అందుకు తగ్గట్టుగానే ఈమె రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను, వీడియోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆకట్టుకునే అందంతో పాటు, పొడుగు కాళ్ళ సుందరిగానూ పేరు దక్కించుకుంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌లో ఈ అమ్మడు ముందు వరుసలో ఉంది. అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్స్ జాబితాలోనూ ఈమె ముందు ఉన్న విషయం తెల్సిందే. తాజాగా ఈమె టైట్ డ్రెస్‌లో అందంగా కనిపించి అలరించింది. స్కిన్ టైట్ డ్రెస్లో కొందరు ముద్దుగుమ్మలు ఎబ్బెట్టుగా ఉంటారు. కానీ ఈమె మాత్రం చాలా అందంగా ఉందనే కామెంట్స్ దక్కించుకుంది. ఈమె నటించిన మిమి సినిమాకు గాను జాతీయ అవార్డును సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. సరోగేట్ తల్లి పాత్రలో నటించి విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. జాతీయ అవార్డుతో పాటు ఉత్తమ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డును సొంతం చేసుకుంది. ఆదిపురుష్ సినిమాలో సీత పాత్రలో నటించడం ద్వారా మంచి పేరు సొంతం చేసుకుంది. అదే సమయంలో ఆమె మేకోవర్, స్కిన్ షో విమర్శలు ఎదుర్కొంది. ప్రస్తుతం పలు బిగ్ ప్రాజెక్ట్‌ల్లో నటిస్తున్న ఈమె సౌత్ సినిమాల్లోనూ నటించేందుకు రెడీగా ఉంది. యంగ్ స్టార్ హీరోలకు జోడీగా ఈమె భవిష్యత్తులో నటించే అవకాశాలు ఉన్నాయా అనేది చూడాలి.

సోషల్‌మీడియాలో నీచమైన పోస్టులు.. ఆగ్రహం వ్యక్తం చేసిన నటి త్రిష

సోషల్ మీడియా వేదికగా విషపూరితమైన పోస్టులు పెట్టేవారిపై తమిళ నటి త్రిష ఆగ్రహం వ్యక్తం చేసింది. అజిత్ నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ మూవీలో హీరోయిన్‌గా నటించింది త్రిష. అయితే ఈ సినిమా విషయంలో త్రిష వ్యక్తిగత జీవితాన్ని లాగి కొందరూ ఆకతాయిలు సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసింది త్రిష.

సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "విషపూరితమైన వ్యక్తులారా, అసలు మీ జీవితం ఎలా ఉంటుంది మీ జీవితంలో బాగా నిద్రపోతారా? సోషల్ మీడియాలో కూర్చొని ఇతరుల గురించి అర్థంలేని విషయాలు పోస్ట్ చేయడం నిజంగా మీకు సంతోషంగా అనిపిస్తుందా. ఇతరుల గురించి నీచమైన పోస్టులు పెట్టే మీతో పక్కనున్న వారికి చాలా ప్రమాదం. గుర్తుతెలియని ఈ పిరికిపందలను చూస్తుంటే బాధగా ఉంది. వీరిని దేవుడే రక్షించాలంటూ." త్రిష రాసుకోచ్చింది.

4 కోట్లు, ఫ్లాట్ కోరిన రెజ్లర్ వినేశ్ పోగట్.. చిక్కుల్లో హర్యానా సర్కారు

చండీఘడ్-నవభూమి: రెజ్లర్, ఎమ్మెల్యే వినేశ్ పోగట్ పెట్టిన డిమాండ్‌తో.. హర్యానా క్రీడా శాఖ ఇరకాటంలో పడింది. గత ఏడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్ పోగట్ రెజ్లింగ్‌లో రజత పతకం గెలిచిన విషయం తెలిసిందే. దానిలో భాగంగా హర్యానా సర్కార్ ఆమెకు 4 కోట్ల నగదు రివార్డు ఇవాల్సి ఉంది. అయితే 4 కోట్ల క్యాష్ రివార్డు కావాలా లేక అంత విలువైన ప్లాట్ కావాలా లేక గ్రూపు-ఏ జాబ్ కావాలా అని క్రీడా శాఖ ఇటీవల ఆమెను కోరింది. ఆ ఆఫర్‌కు రియాక్ట్ అయిన వినేశ్ పోగట్.. తనకు 4 కోట్ల క్యాష్‌తో పాటు ప్లాట్ కూడా కావాలని కోరింది. దీంతో క్రీడాశాఖ ఖంగుతిన్నది. ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో అధికారులకు అర్థం కావడం లేదు. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో డిస్‌క్వాలిఫై అయిన సిల్వర్ పతక విజేత వినేశ్ కేసులో క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నదని, మూడు ఆప్షన్లలో ఆమె దేన్ని అయినా తీసుకోవచ్చు అని ఇటీవల సీఎం నయాబ్ సింగ్ సైనీ తెలిపారు. అయితే ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం వల్ల ఆమె ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగానికి అర్హురాలు కాదు. ఇక క్యాష్ రివార్డు లేదా ప్లాట్ తీసుకునే ఆప్షన్లలో.. ఆమె రెండింటిని కోరడం క్రీడాశాఖను ఇరకాటంలో పడేసింది.

పారిస్ ఒలింపిక్స్‌లో 50 కేజీల కేటగిరీలో వినేశ్ పోగట్.. బరువు ఎక్కువ ఉన్న కారణంగా ఫైనల్ నుంచి డిస్ క్వాలిఫై అయ్యింది. కేవలం వంద గ్రాములు ఎక్కువ ఉన్న కారణంగా ఆమెను పక్కన పెట్టేశారు. డిస్‌క్వాలిఫై అయిన కొన్ని గంటల్లో సీఎం సైనీ తన ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. వినేశ్ పోగట్ పట్ల దేశం గర్వంగా ఫీలవుతున్నదని, సిల్వర్ మెడలిస్టుకు ఇచ్చే అని బెనిఫిట్స్ ఇస్తామని ఆయన అన్నారు. అయితే కొన్ని పరిణామాల వల్ల వినేశ్ కాంగ్రెస్ పార్టీలో చేరి, జులనా అసెంబ్లీ నుంచి ఎన్నికల్లో గెలిచారు.

ఐపీఎల్‌లో అత్యధిక పరుగుల వీరులు.. టాప్-10 లోకి కేఎల్ రాహుల్



బెంగుళూరు-నవభూమి ఐపీఎల్ లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ల జాబితాలో ఢిల్లీ క్యాపిటల్స్ వికెట్ కీపర్, బ్యాటర్ కేఎల్ రాహుల్ టాప్-10లోకి దూసుకెళ్లాడు. గురువారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో రాహుల్ ఈ ఫీట్ సాధించాడు. దాంతో కోల్‌కతా నైట్ రైడర్స్ స్కిప్పర్ అజింక్య రహానే, ఆర్సీబీ మాజీ వికెట్‌కీపర్, బ్యాటర్ దినేశ్ కార్తీక్‌లను జాబితాలో వెనక్కి నెట్టాడు. గురువారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాహుల్ 53 బంతుల్లో 93 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దాంతో ఐపీఎల్ కెరీర్‌లో రాహుల్ మొత్తం పరుగుల సంఖ్య 4,868కి చేరింది. మొత్తం 135 మ్యాచ్‌లు ఆడిన రాహుల్ 126 ఇన్నింగ్స్‌లో 135.67 స్ట్రైక్ రేట్, 46.36 సగటుతో ఈ పరుగులు సాధించాడు. అందులో నాలుగు సెంచరీలు, 39 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అత్యుత్తమ స్కోర్ 132 నాటౌట్. కాగా 2020 ఐపీఎల్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు తరఫున ఆడిన కేఎల్ రాహుల్ ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. ఆ సీజన్‌లో మొత్తం 14 మ్యాచ్‌లలో 14 ఇన్నింగ్స్ ఆడాడు. 129.34 స్ట్రైక్ రేట్‌తో 55.83 సగటుతో మొత్తం 670 పరుగులు చేశాడు. అందులో ఐదు అర్ధసెంచరీలు ఉన్నాయి.

షాన్‌దార్ ఢిల్లీ.. ఆర్‌సీబీపై ఘన విజయం రాహుల్ అజేయ అర్ధసెంచరీ

బెంగుళూరు-నవభూమి ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అజేయ ప్రస్థానం కొనసాగుతున్నది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై ఘన విజయం సాధించింది. తొలుత టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 163 పరుగులకే పరిమితమైంది. ఫిల్ సాల్ట్ (17 బంతుల్లో 37, 4 ఫోర్లు, 3 సిక్సర్లు), టిమ్ డేవిడ్ (20 బంతుల్లో 37 నాటౌట్, 2 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆ జట్టును ఆదుకున్నారు. కుల్‌దీప్ యాదవ్ (2/17), విప్రాజ్ నిగమ్ (2/18) బెంగళూరును కట్టడిచేశారు. అనంతరం ఛేదనలో ఢిల్లీ ఆరంభంలోనే తడబాటుకు లోనై వెంటవెంటనే వికెట్లు కోల్పోయినా కేఎల్ రాహుల్ (53 బంతుల్లో 93 నాటౌట్, 7ఫోర్లు, 6సిక్స్‌లు) రాణించడంతో లక్ష్యాన్ని 17.5 ఓవర్లలో ఛేదించింది. స్టబ్స్(38) నాటౌట్‌గా నిలిచాడు. భువనేశ్వర్(2/26)కు రెండు వికెట్లు దక్కాయి. రాహుల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**